వనిత
గృహ నిర్వహణలో మెళకువలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

విజయవాడ  : fb.com/vaartha

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam


5-2-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 4 పేజీలు: 12 వెల: 6.50

ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

కేంద్రసహకారంతో రాష్ట్రానికి భారీగా నిధులు: మంత్రి లోకేష్

2లో

# ఆదాయవనరులు పెంచుకోవాలి



## రాష్ట్ర ఆర్థికపరిస్థితిపై సమీక్ష జరిపిన సిఎం చంద్రబాబు

## రెవెన్యూ ఆదాయం అంచనా రూ.1,02,154 కోట్లు

## పన్ను ఎగవేతలు లేకుండా చూడాలి

## అధికారులకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం

**విజయవాడ.ఫిబ్రవరి4,ప్రభాతవార్తప్రతినిధి:**రాష్ట్రాభ్యున్నతికి ఆదాయ వనరులను గణనీయంగా వృద్ధి చేసుకోవాలని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.రాష్ట్రానికి ఆదాయాన్ని సమకూర్చే ప్రతి వనరును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థికంగా రాష్ట్రాన్ని పరిపుష్టం చేసుకుందామన్నారు.ఇందుకు నిర్మాణాత్మకంగా ఉత్తమోత్త కార్యచరణతో అడుగులు వేద్దామన్నారు. రాష్ట్రానికి ఆదాయాన్ని సమకూర్చే విషయంలో అధికారయంత్రాంగం అంకిత భావంతో వ్యవహరించాలన్నారు. ఇందుకు నిరంతరం నూతన విధానాలను గుర్తించే దిశలో ఉండాలన్నారు.ఆదాయం వృద్ధికి ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయం ఎవ్వరిని ఇబ్బంది పెట్టేదిగా ఉండకూడదన్నారు. వనరులు, ఆదాయ వృద్ధిపై ముఖ్యమంత్రి మంగళవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. వైకాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఆర్థికంగా కుదేలైన రాష్ట్రం మళ్లీ కోలుకుని అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వంలోని ఆదాయార్జన శాఖలు ఉత్తమ ఫలితాలు రాబట్టాలని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్ర ఖజానాకు రాబడులు పెంచేందుకు సరికొత్త ఆలోచనలు చేయాలని సీఎం చెప్పారు. రాష్ట్రాన్ని ఆర్థిక కష్టాల్లోంచి బయట పడేసేందుకు సమర్థవంత చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సాధారణ పనితీరుతో, సాధారణ టార్గెట్స్ రొటీన్‌గా పనిచేస్తే ఫలితాలు రావన్నారు.వినూత్న ఆలోచనలతో పనిచేయాలని సిఎం అన్నారు. టెక్నాలజీ వాడకం ద్వారా రెవెన్యూ ఆర్జనలో లోపాలను సరిదిద్ది ఆదాయం పెంచాలని సిఎం సూచించారు. వాణిజ్య పన్నుల విభాగంలో పన్ను ఎగవేతలపై అధికారులు చెప్పిన అంశాలపై సిఎం మాట్లాడుతూ ఏ ఒక్కరూ పన్ను ఎగవేతకు పాల్పడకుండా చూడాలన్నారు. అలా అని వ్యాపారులను వేధింపులకు గురి చేయవద్దని సిఎం సూచించారు. వేదింపు వలన వారికి మానసిక వత్తిడి పెరుగుతుందన్నారు.వారి నుంచి రావాల్సిన పన్ను వసూలు అవసరతను బట్టి సరళీకృత విధానాలను అవలంభించారు. >>2

# 25 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి

## గరిబీ హఠావో ఆచరణలో చూపించాం

## లోక్‌సభలో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** వికసిత్‌భారత్ నిర్మాణమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు వెళుతోందని, గడచిన పదేళ్లలో 25 కోట్లమందిని పేదరికంనుంచి విముక్తిచేయగలిగామని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం మాలో ఆత్మవిశ్వాసం పెంచిందని మరోసారి మా ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకున్నందుకు ధన్యవాదాలని తెలిపారు. రాష్ట్రపతిప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలు విపక్షాల విమర్శలకు పదునైన మాటలతో జవాబిచ్చారు. కాంగ్రెస్, ఆప్ పార్టీలను తన మాటల తూటాలతో ఎద్దేవాచేస్తూ ప్రసంగం కొనసాగించారు. మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలను నెర వేరుస్తామని, గతప్రభుత్వాలు గరీబీ హఠావో అని నినాదాలు మాత్రమే చేసాయని కొందరునేతలు బంగ్లాలు కట్టుకోవడంపై దృష్టిసారించారని, మేం మాత్రం ఇంటింటికీ నల్లానీరు ఇవ్వడంపై దృష్టి పెట్టా >>2

## వరుసగా 60 రోజులు అసెంబ్లీకి రాకపోతే

# జగన్‌పై అనర్హత వేటు

## డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

**విజయవాడ ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి:** జగన్ అయినా మరే ఎమ్మెల్యే అయినా.. సహేతుక కారణంతో సెలవు కోసం దరఖాస్తు చేయకుండా వరుసగా 60 రోజులు అసెంబ్లీకి గైర్హాజరైతే వారు చట్ట ప్రకారం అనర్హతకు గురవుతారని శాసనసభ ఉప సభాపతి రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు. రాష్ట్రంలో మొదటిసారి ఎన్నికైన ఎమ్మెల్యేలకు ఈ నెలలో నిర్వహించబోయే శిక్షణ తరగతుల కార్యక్రమానికి లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను ఆహ్వానించేందుకు ఢిల్లీకి వచ్చిన ఆయన సోమవారం ఏపీ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. సభకు గైర్హాజరవుతున్న వైకాపా అధ్యక్షుడు జగన్ గురించి విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు ఆయన పైవిధంగా స్పందించారు. జగన్ గత అయిదేళ్లలో ముందుగా రికార్డు చేసిన ప్రెస్‌మీట్లు తప్పితే నేరుగా మీడియాను కలిసిన >>2

# తిరుపతి మేయర్ పదవికి గండం?

## కొరవడిన సమన్వయం, పట్టుతప్పిన నాయకత్వం

## పార్టీని ముంచిన వైఎస్సార్సీ కార్పొరేటర్లు

**తిరుపతి, ఫిబ్రవరి 4ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో గత ఏడాది సాధారణ ఎన్నికల్లో అనూహ్యంగా వైసిపి అధికారం కోల్పోవడంతో తాజాగా తిరుపతి కార్పొరేషన్‌లో 47మంది బలమున్న కార్పొరేటర్లు ఎదురుదెబ్బతో పట్టుకోల్పోయింది. బలం లేదని గెలవలేరని విశ్వాసంతో ఉన్న వైసిపికి కోలుకోలేని గడ్డుపరిస్థితి. గత ఏడాది కార్పొరేషన్‌లో ఖాళీ అయిన రెండవ డిప్యూటీ మేయర్ పదవికి అనూహ్యరీతిలో సోమవారం జరగాల్సిన ఎన్నికల్లో వ్యూహాత్మకంగా గైర్హాజరైనా, మంగళవారం నాటి పరిణామాలతో జరిగిన ఎన్నికలో డిప్యూటీ మేయర్ పదవిని వదలుకోవాల్సిన చేదు సంఘటన జరిగింది. ఏకంగా 25మంది వైసిపి కార్పొరేటర్లు ఒకేఒక్క టిడిపి కార్పొరేటర్‌కు తమ మద్దతు తెలపడంతో 26మంది ఓటుతో డిప్యూటీ మేయర్‌ను టిడిపి కైవశం చేసుకోవడం వైసిపి నేతలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కార్పొరేటర్లలో తొలినుండి భూమన కరుణాకర్‌రెడ్డికి అత్యంత సన్నిహితులుగా, విశ్వాసపాత్రులుగా వ్యవహరించిన ఎస్‌కె బాబు, పొన్నాలచంద్ర, కుడితి సుబ్రమణ్యం, నారాయణ, అనీష్‌రాయల్, గణేష్, మునిరామిరెడ్డి, శేఖర్‌రెడ్డి, ప్రవళిక, ప్రతాప్‌రెడ్డి, నరేంద్ర, అనిల్ మరికొందరు కార్పొరేటర్లు కూటమివైపు రావడంతో ఊహించని షాక్ తగిలింది. ఈ నేపథ్యంలో మంగళవారం తిరుపతిలో కొన్ని నాటకీయ పరిణామాలతో, అనూహ్యరాజకీయ మలుపులతో కూటమి అభ్యర్థిగా ఆర్‌సి మునికృష్ణ కార్పొరేషన్‌లో డిప్యూటీ మేయర్ కుర్చీ అందుకున్నారు. దీనివెనుక కుట్రలు, కారణాలు ఉన్నా బలమున్న చోట పట్టుకోల్పోవడంతో కొరవడిన సమన్వయం, పట్టుతప్పిన నాయ >>2

# 24 నుంచి బడ్జెట్ అసెంబ్లీ

**విజయవాడ ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి:** అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 24 నుంచి ప్రారంభమయ్యే అవకాశముంది. ఈ సమావేశాలు మూడు వారాలకు పైగా నిర్వహించవచ్చని ప్రాథమిక సమాచారం. మార్చిలో రాష్ట్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఏ రోజున బడ్జెట్ పెట్టాలనేది ఇంకా ఖరారు కావాల్సి ఉంది. సమావేశాలు ఎన్ని పని దినాలు ఉండాలి? ఏయే బిల్లులను ఈసారి సభ ముందుకు తేవాలి? తదితరాలపై ప్రభుత్వం ఈ వారంలో ప్రాథమిక నిర్ణయం >>2

# పిఏసి చైర్మన్‌గా పులవర్తి

## ఫైనాన్షియల్ కమిటీలకు చైర్మన్ల నియామకం



పులవర్తి రామాంజనేయులు

**విజయవాడ,ఫిబ్రవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ శాసనసభలో ఫైనాన్షియల్ కమిటీలను నియమిస్తూ అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేశారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ, అంచనాల కమిటీల చైర్మన్ లను అధికారికంగా ప్రకటిస్తూ నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రజా పద్దుల సంఘం (పీఏసీ) ఛైర్మన్‌గా పులవర్తి రామాంజనేయులు ఎన్నికైనట్లు అధికారికంగా నోటిఫికేషన్‌లో స్పష్టం చేసారు.పీఏసీ ఛైర్మన్‌గా ఇప్పటికే పులవర్తి రామాంజనేయులు ఎన్నికయ్యారు. ఆయన భీమవరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా గెలుపొందారు. ఇకపబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్ కమిటీ (పీయుసీ) ఛైర్మన్‌గా కూన రవికుమార్, అంచనాల కమిటీ (ఎస్టిమేట్స్ కమిటీ) ఛైర్మన్‌గా వేగుళ్ల జోగేశ్వరావు నియామకాన్ని ఆమోదిస్తూ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. మూడు ఫైనాన్షియల్ కమిటీలకు ఛైర్మన్ లను నియమిస్తూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు నోటిఫికేషన్ జారీ చేశారు. ఫైనాన్షియల్ కమిటీల నియామకం పూర్తైనట్టు స్పీకర్ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఒక్కో కమిటీలో 9 మంది ఎమ్మెల్యేలను, ముగ్గురు ఎమ్మెల్సీల చొప్పున మొత్తం 12 మందిని ఎన్నిక ప్రక్రియ ద్వారా ఎంపిక చేశారు.

# కబ్జాలపై ఎవరినీ ఉపేక్షించం..

## త్వరలో 3 సూపర్ సిక్స్ పథకాలు అమలు: మంత్రి సవిత

**కడప, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** జిల్లాలో జరిగిన భూ కబ్జాలపై విచారణ చేపడుతున్నామని, ఎవరినీ ఉపేక్షించేది లేదని జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. రాబోయే వేసవి దృష్ట్యా జిల్లాలో తాగునీటి కల్పనకు అధిక ప్రాధాన్యతాను ఇస్తున్నామన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, రైతులకు ఆర్థికసహాయం పథకాలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన డీఆర్సీ సమావేశం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. సమావేశంలో జిల్లాలో చేపట్టబోయే అభివృద్ధి పనులపైనా, పలు సమస్యలపైన చర్చించామన్నారు. శాఖల వారీగా చేపట్టిన అభివృద్ధి పనుల ప్రగతిపైన సమీక్షించామన్నారు. ముఖ్యంగా రాబోయే వేసవి దృష్ట్యా కడపలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో జగన్ సొంత నియోజక వర్గం పులివెందుల పట్టణంలో తీవ్ర తాగునీటి కొరత ఏర్పడిందన్నారు. ఎన్డీయే పాలనలో పులివెందుల వాసులకు తాగునీటి కష్టాలు రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాతో పాటు రాష్ట్రంలోనూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నామన్నారు. ఇప్పటికే అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామని, మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లు, ఉచిత ఇసుక అందజేస్తున్నామని తెలిపారు. జగన్ రెడ్డి చీకటి చట్టం ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేశామన్నారు. రాష్ట్రంలో యువతకు 20లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ పనిచేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా 16వేలకు పైగా టీచర్ పోస్టుల భర్తీకి త్వరలో మెగా డీఎస్సీ నిర్వహించబోతున్నామన్నారు. దీనిలో భాగంగా 26 జిల్లాల్లోనూ ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్లు ప్రారంభించామన్నారు.



మంగళవారం కడప కలెక్టరేట్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సవిత

**త్వరలో 3 సూపర్ సిక్స్ పథకాలు:** త్వరలో మూడు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, రైతులకు ఆర్థిక సహాయం పథకాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు కాబోతున్నాయన్నారు. ప్రధాని నరేంద్రమోడి ఆశీర్వాదంతో విశాఖ ఉక్కు పరిశ్రమకు ఊపిరొచ్చిందన్నారు. రాజధాని అమరావతి, పోలవరం పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయన్నారు.రాష్ట్రమంతా రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ఇలా రాష్ట్రమంతటా అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని మంత్రి తెలిపారు.

**కబ్జారాయుళ్లను ఉపేక్షించం:** జిల్లాలో వేల ఎకరాల్లో భూములు అన్యాక్రాంతయ్యాయని, కబ్జాలపై విచారణ సాగుతోందని, ఆక్రమణలకు పాల్పడేవారు ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదని మంత్రి సవిత స్పష్టంచేశారు. గత ప్రభుత్వ హయాం కడపలో కబ్జాలకు అంతేలేకుండా పోయిందన్నారు. ప్రభుత్వ భూములు, అటవీ భూములను కబ్జాలు చేశారన్నారు.తమ ప్రభుత్వం కబ్జాలపై కఠినంగా వ్యవహ రిస్తోందని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్రమంతంటా రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు.

ఈ సదస్సుల్లో వచ్చిన వినతులకు పరిష్కారాలు సైతం చూపుతున్నామన్నారు. కడప జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు 12,425 వినతులు రాగా,వాటిలో 3,884 దరఖాస్తులకు పరిష్కారాలు చూపామన్నారు.

మిగిలిన అర్జీలకు త్వరలో పరిష్కారాలు చూపుతామని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేడే ఢిల్లీ పోలింగ్



## హ్యాట్రిక్ కోసం ఆప్, గద్దెనెక్కాలని బిజెపి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** కేంద్రపాలితప్రాంతం, అందులోనూ దేశరాజధాని నగరం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలపై అన్ని రాజకీయ పార్టీలు ఫోకస్‌ను పెంచాయి. ముఖ్యంగా ఆమ్ ఆద్మీపార్టీ మూడోసారి గెలిచి హ్యాట్రిక్‌సాధించాలని పట్టుదలగా ఉంటే రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ ఢిల్లీ సింహాసనంపై తమదే పట్టు ఉండాలని భారతీయ జనతాపార్టీ భావిస్తోంది. ఈనేపథ్యంలో ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను ఈనెల 5వ తేదీ జరిగే పోలింగ్‌కోసం విస్తృత ఏర్పాట్లుచేసారు. మొత్తం ఒక కోటి 56 లక్షల మంది ఓటర్లకోసం 13,766 పోలింగ్‌కేంద్రాలు ఏర్పాటుచేసారు. తొలిసారిగా క్యూమేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను భారత్‌లో ఎన్నికల సంఘం ప్రవేశపెడుతోంది.పోలింగ్‌కేంద్రాలవద్ద తొలిసారి క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్ క్యూఎంఎస్ యాప్‌ద్వారా కూడా తెలుసుకోవచ్చు. ఇప్పటికే సుమారు ఏడువేల మంది సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు ఇంటివద్ద ఓటుహక్కు వినియోగించుకున్నారు. 2015 ఢిల్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీపార్టీకి 70స్థానాల్లో 67 చోట్ల గెలిచి ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరిస్తే బిజెపి మూడు చోట్లమాత్రమే గెలిచింది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో 62 చోట్ల ఆప్ గెలిస్తే బిజెపికి ఎనిమిది సీట్లు వచ్చాయి. ఈరెండుసార్లూ కూడా కాంగ్రెస్ ఒక్కసీటుకూడా గెలవలేకపోయింది. ఈసారి ఢిల్లీపీఠం ఎవరిపరం అవుతుందన్నది ఈనెల 8వ తేదీ తేలిపోనున్నది. ఎన్నికలప్రచారంలో మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ప్రధానిమోడీలు ఇద్దరూ పోటాపోటీ ప్రచారంచేసారు. కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్రల్లో ఉచితాలకు ఓట్లు భారీగా రావడంతో ఢిల్లీలోకూడా పోటాపోటీగా ఈ పార్టీలు ఉచితాలనుప్రకటించాయి. కాంగ్రెస్‌కూడా తక్కువేమీ కాదన్నట్లు ఉచిత హామీలు ఇచ్చింది. కులగణన చేపడతామని ప్రకటించింది. పోలింగ్ తేదీ సమీపించినవేళ కేంద్రం బడ్జెట్‌లో ఆదాయపు పనున మినహాయింపును 12 లక్షలరూపాయలకు పెంచడం ద్వారా బిజెపి మధ్యతరగతి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నంచేసింది. ఎన్నికలకు ముందుగానే పార్టీలు సంక్షేమపథకాల అర్హులను గుర్తించే దరఖాస్తులు ప్రక్రియ ప్రారంభించాయి. అవినీతి వ్యతిరేకపునాదులపై పుట్టిన ఆప్ అవినీతి ఆరోపణల్లోకూరుకునిపోయింది. ఆపార్టీప్రతిష్ట మసకబారింది. ఢిల్లీలోపదేళ్లుగా విద్యవైద్యంలోచేపట్టిన సంస్కరణలతోపాటు ఉచిత విద్యుత్, తాగునీరు గడచిన రెండు ఎన్నికల్లో మంచి ఫలితాలిచ్చాయి.మహిలలకు ఉచిత బస్సుప్రయాణం ఆపార్టీకి కలిసివచ్చింది.ఈ సారి ఆదే మంత్రం ప్రయోగించింది. సర్వేలను బట్టిచూస్తే ఢిల్లీలో ఓటర్లు కలుషితనీరు, దారుణమైన రోడ్లతో అసంతృప్తిగా ఉన్నారు. యమునానదిలో కాలుష్యం ఈసారి ఎన్నికల ప్రచారంలో హాట్‌హాట్‌గా నడిచింది. అధికారపక్షాన్ని విపక్షాలుసైతం నిలదీసాయి. 2013 వరకూ 15 ఏళ్లపాటు ఢిల్లీలో అదికారంలో ఉన్న కాంగ్రెస్ గడచిన రెండు ఎన్నికల్లో ఒక్కసీటు కూడా గెలవలేకపోయింది. ఆప్ బిజెపి మధ్యపోరులో కాంగ్రెస్ అసలు ఉనికి లేకుండాపోయినట్లయింది. 1998నుంచి కూడా ఢిల్లీలో అధికారంలో లేకపోవడంతో ఈసారి ఎలాగైనా ఢిల్లీపీఠంసాధించుకోవాలని బిజెపి సర్వశక్తులు వినియోగిస్తోంది. సంఘ్‌పరివార్‌తోపాటు అనుబంధసంఘాలు కూడా ఈప్రచారాన్ని హోరెత్తించాయి. కృత్రిమ మేథ సాంకేతికతతో సృష్టించిన స్పూఫ్‌లు, పదునైన రాజకీయ విమర్శలతో ఈసారి ఢిల్లీ ఎన్నికల ప్రచారం వేడిగా సాగింది. అన్ని పార్టీలకు చెందిన ముఖ్యనేతలు హస్తినలో విస్తృత ప్రచారం నిర్వహించారు. బిజెపినిభారతీయ అబద్ధాలపార్టీ, దూషించేపార్టీ అని ఆమ్ ఆద్మీపార్టీ విశ్లేషించింది. ఆప్‌ను ఒక విపత్తుగాను కేజ్రీవాల్‌ప్రకటనల మంత్రిగాప్రధానిమోడీ విమర్శలు గుప్పించారు. ఇక కాంగ్రెస్ పార్టీ కేజ్రీవాల్‌ను నకిలీ అంటూ మోడీ ఛోటారీఛార్జ్ అంటూ విమర్శలుచేసింది. ఎఐతో సృష్టించిన మీమ్స్ డిజిటల్‌ప్రచారాలు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ముఖ్యపాత్రను పోషిస్తున్నాయి.

## ప్రతి పంటకు బీమా

# వర్తింపజేయాలి

## లోక్ సభలో ఎంపి శ్రీకృష్ణ దేవరాయలు

**విజయవాడ,ఫిబ్రవరి4,ప్రభాతవార్తప్రతినిధి:**ప్రతి పంటకూ,ప్రతి ఎకరాకూ బీమా వర్తింపజేయాలని మంగళవారం లోక్ సభలో ప్రశ్నోత్తరాల సమయంలో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ను టిడిపి ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు కోరారు.బీమా కంపెనీల సంఖ్యను పెంచాలన్నారు.రైతుకు పూర్తి ప్రయోజనాన్ని కలిగించే దిశలో పంట బీమా ఉండాలన్నారు.తను పల్నాడు ప్రాంతంకు చెందిన వాడినంటూ మంగళవారం లోకసభలో మాట్లాడటం ప్రారంభించిన ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు రైతులు, వ్యవసాయం దేశ ప్రగతికి వెన్నెముఖ ప్రపంచానికే భారతదేశం ఆహార భాండాగారం కావాల బడ్జెట్ లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కోరారన్నారు.ఆమె చెప్పిన విషయం అర్ధవంతంగా ఉందన్నారు. అయితే రైతులు పండిస్తున్న సుమారు 200 పంటలకు గాను, కేవలం సుమారు 60పంటలకే బీమాను వర్తింపజేస్తున్నారన్నారు. ఇన్సూరెన్స్ కంపెనీలు కూడా పబ్లిక్ రంగంలో5, ప్రైవేట్ రంగంలో 15 మాత్రమే ఉన్నాయి. బీమా కంపెనీల సంఖ్యను పెంచడమే కాకుండా అత్యధిక పంటలకు బీమాను వర్తింపజేయాలి. ఫసల్ బీమా పథకాన్ని బ్లాక్ లెవల్‌నుంచి గ్రామస్థాయికి విస్తరింపజేసినట్లే రైతు పండించే ప్రతి పంటకూ బీమా వర్తింపజేసే విధంగా విధాన నిర్ణయాలను తీసుకోవాలి అని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు కోరారు. అందుకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ సమాధానమిస్తూ ఫసల్ బీమా యోజనలో టెక్నాలజీ ఉపయోగిస్తున్నాం రిమోట్ సెన్సింగ్ డేటా ద్వారా పంటనష్టాన్ని అంచనా వేస్తు న్నాం తద్వారా బీమా కంపెనీలు బీమా చెల్లింపులు చేయడం సులభతరం చేశాం, మరిన్ని పంటలను ఫసల్ బీమా పరిధిలోకి తెస్తున్నాం. అలాగే బీమా కంపెనీలు కూడా 20కిచేరాయి. ఇంకా పెరుగుతాయని సభకు తెలిపారు.



గుంతకల్లు రైల్వే స్టేషన్ వద్ద పట్టాలు తప్పిన గూడ్స్ వ్యాగన్లు

# గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో పట్టాలు తప్పిన గూడ్స్ వ్యాగన్లు

## ప్రధాన రైళ్లకు అంతరాయం.. పలురైళ్ల దారి మళ్లింపు..

**గుంతకల్లు రైల్వే, ఫిబ్రవరి 4, ప్రభాత వార్త:** దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజనల్ ప్రధాన కేంద్రంలో ఓ గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. బళ్ళారి నుంచి గుత్తి వైపు వెళ్తున్న గూడ్స్ రైలు సుమారు 06-07 గంటల సమయంలో సౌత్ క్యాబిన్ ఎదురుగా పా యింట్ వద్ద క్రాస్ చేస్తున్న సమయంలో గూడ్స్ రైలుకు చెందిన ఫార్మేషన్ రెండుగా విడి పోయింది. దీంతో రెండు వ్యాగన్లు పట్టాలు తప్పాయి. ఈ ప్రమాదం కారణంగా ముంబైచెన్నై, బెంగళూరు, సికింద్రాబాద్, బెంగళూరువిజయవాడ ప్రధాన రైలు మార్గానికి అప్ అండ్ డౌన్ రైలు మార్గాలకు తీవ్ర అంతరాయం ఏర్ప డింది. ప్రమాద వార్త తెలుసుకున్న అధికారులు వెంటనే రైలు మార్గాన్ని పునరుద్ధరించే నిమిత్తం ఎ ఆర్ టి ని సంఘటన స్థలానికి తరలించి రైలు మార్గం పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదం కారణంగా పలు రైలు సర్వీసులను ప్ర త్యామ్నాయ మార్గాల మీదుగా మళ్లించిన్నట్లు అధి కార వర్గాలు తెలిపాయి.

# వరుసగా 60 రోజులు అసెంబ్లీకి రాకపోతే జగన్‌పై అనర్హత వేటు

>>పాపాన పోలేదు. కానీ, ఇప్పుడు అసెంబ్లీ సమావేశాలు జరిగేటప్పుడు మీడియా ముందు కొంత ఎక్కువగా కనిపిస్తున్నారు. ఒక శాసన సభ్యుడిగా అసెంబ్లీకి వచ్చి తన భావాలను వ్యక్తపరిస్తే ఆయనకు గౌరవంగా ఉంటుంది. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఇవ్వని గౌరవం కోసం మంకుపట్టు పడితే ఫలితంఉండదు. మొత్తం సభ్యుల్లో 10% బలం ఉంటేనే ప్రతిపక్ష హోదా ఇవ్వాలన్న సంప్రదాయాన్ని 1952 నుంచి అనుసరిస్తున్నారు. ఇది ఆయనకూ తెలుసు. వరుసుగా శాసనసభకు గైర్హాజరయ్యే వారిపై చర్యలు తీసుకోవడానికి చట్టంలోని నిబంధనలు అవకాశం కల్పిస్తున్నాయి. 60 రోజుల వ్యవధిలో సెలవుకు దరఖాస్తు చేస్తే పరిశీలిస్తారు. లేకుంటే 60 రోజులు దాటిన తర్వాత ఆయన ఆటోమేటిక్‌గా ఎమ్మెల్యేగా అనర్హుడవుతారు. పులివెందులకు ఉప ఎన్నిక వస్తుంది అని వెల్లడించారు.

సభకు రాకుండా రిజిష్టర్‌లో సంతకం పెట్టి వెళ్లిపోవచ్చు కదా? అన్న ప్రశ్నకు రఘురామ అవునని సమాదానం ఇచ్చారు. అది తన సీటు నిలబెట్టుకోవడానికి పనికొస్తుందే తప్ప, ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే సభకు రాను అన్న మాటకు విలువ ఉండదని చెప్పారు.

# ఉక్రెయిన్‌కు సాయం చేస్తే మాకేంటి?

## ట్రంప్ బేరసారాలు!

**వాషింగ్టన్, ఫిబ్రవరి 4:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు పూర్తిగా బిజినెస్ టైకూన్‌లా ఇతర దేశాలతో డీల్ చేస్తున్నారు. తాజాగా ఉక్రెయిన్‌కు చేసే సాయంపైనా ఇలాగే ఓ మెలిక పెట్టారు. కీవ్‌కు తమ సైనిక సాయం కావాలంటే అక్కడి అరుదైన ఖనిజాలను వినియోగించుకునే అవకాశం వాషింగ్టన్‌కు ఉండాలనే కండీషన్ పెడతామని వెల్లడించారు. ఇప్పటికే ఐరోపాలోని భాగస్వాముల కంటే అమెరికానే అత్యధిక సైనిక, ఆర్థిక సాయాలను జెలెన్‌స్కీ సర్కారుకు అందించిందని గుర్తు చేశారు. వారికి అవసరమైనప్పుడల్లా నిధులు, పరికరాలు ఇచ్చాము. ఐరోపా వారు ఈ విషయంలో వారి మాట నిలబెట్టుకోలేదు. వారు చెప్పిన మాటలను నిలబెట్టుకోవాలి. మాతో పోల్చుకుంటే వారు చాలా తక్కువ నిధులు, ఆయుధాలు ఇచ్చారు. కనీసం మాతో సమానంగా అన్నా ఇవ్వాలి. ఉక్రెయిన్ వద్ద చాలా అరుదైన ఖనిజాల భాండాగారం ఉంది. అందుకే మేము ఆ దేశంతో ఓ డీల్ చేసుకోవాలనుకుంటున్నాం. మాకు ఆ ఖనిజాలు లభిస్తే మేము వారికి అవసరమైనవి ఇస్తాము. మాకు అరుదైన ఖనిజాల లభ్యతలో భద్రత అవసరం. దానిని వారు మాకు ఇచ్చేందుకు ఆసక్తిగా ఉన్నారు. ఉక్రెయిన్, రష్యా విషయంలో మేము చాలా పురోగతి సాధించాం. భవిష్యత్తులో ఏం జరగబోతోందో మనం చూస్తాం. ఆ మూర్ఖపు యుద్ధాన్ని ఆపనున్నాం అని పేర్కొన్నారు. మరోవైపు ఇటీవల ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ మాట్లాడుతూ వారికి సొంతంగా ఏమైనా సంబంధాలు ఉండొచ్చు. కానీ మేము లేకుండా ఉక్రెయిన్ గురించి మాట్లాడటం ప్రతి ఒక్కరికి చాలా ప్రమాదకరం అని పేర్కొన్నారు. తాము ట్రంప్ బృందంతో టచ్‌లో ఉన్నామని ప్రస్తుతం జనరల్ స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. త్వరలో వీటిలో పురోగతి సాధించే అవకాశం ఉందన్నారు.

# త్రివేణి సంగమంలో భూటాన్‌రాజు పుణ్యస్నానం

**ప్రయాగరాజ్, ఫిబ్రవరి 4:** మహాకుంభ్‌మేళాలో భూటాన్‌రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యేల్ వాంగ్‌చుక్ పవిత్రస్నానం ఆచరించారు. మంగళవారం ఉదయం ఆయన యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి ప్రయాగరాజ్‌లోని త్రివేణి సంగమంలో పవిత్రస్నానంచేసారు. ఆ తర్వాత గంగా హారతిలో పాల్గొన్నారు. కుంభ్‌మేళాలో పాల్గొనేందుకు ముందురోజే వాంగ్‌చుక్ లక్నోకు చేరుకున్నారు. ఆయనకు సీఎం యోగి ఆదిత్యనాథ్ సాదర స్వాగతం పలికారు. ఇండియాభూటాన్‌మధ్య ఆధ్యాత్మిక సాంస్కృతిక సంబందాలను బలోపేతంచేస్తూ భూటాన్‌రాజు మహాకుంభ్‌కు హాజరుకావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇరుదేశాలకు చెందిన పలువురు ప్రముఖులు భక్తులు గంగా హారతి, పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# 25 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి

>> మని, దేశంలో పేదలకోసం 12 కోట్లకుపైగా మరుగుదొడ్లునిర్మించామన్నారు. కొందరునేతలు పేదల గుడిసెలవద్ద ఫోటోలు దిగేందుకే ఉత్సాహం చూపిస్తారని, సభలో పేదలగురించి మాట్లాడితే ఈనేతలు మొహం చిరాగ్గాపెడతారని ఎద్దేవా చేసారు. గతంలో ఢిల్లీనుంచి రూపాయి పంపిస్తే గ్రామాలకు 16 పైసలే చేరుతోందని ఒకప్రధాని వాపోయారని అప్పట్లో అదేపరిస్థితి ఉండేదని, ఇపుడు ఢిల్లీనుంచి ఒకరూపాయి పంపిస్తే ఆగ్రామానికి పూర్తిగా రూపాయి చేరుతోందని, నగదు బదిలీద్వారా నేరుగా వెళుతోందన్నారు. కొందరు వ్యక్తులు వెచ్చటి నీటికొనులు, లగ్జరీ షవర్లపై దృష్టిపెడతారని మేం ఇంటింటికీ నీళ్లివ్వడంపై దృష్టిపెడతామన్నారు. ప్రభుత్వ పథకాలతో ఆదాచేస్తుంటే ప్రజాధనంతో శీష్‌మహల్ కట్టుకోడానికి ఎప్పుడూ వినియోగించలేదన్నారు. ఆదాయపు పన్ను తగ్గించి బిజెపి సారథ్యంలోని ఎన్డీయేమధ్యతరగతికి పొదుపు పెంచిందని, 2014కు ముందు టాక్స్ బాంబులు విసిరేవారని, బుల్లెట్లు పేల్చేవారని, ప్రజాజీవనంపై ఎంతోభారం పడేదని ఆ గాయాలనుంచి తమ ప్రభుత్వం స్వస్థత చేకూర్చి ముందుకుపోతోందన్నారు. ఇకపై 12 లక్షలవరకూ ఎవరూ పన్ను చెల్లించనవసరం లేదన్నారు. ఎన్నికల్లో హామీలిచ్చి తర్వాతచేతు లెత్తేస్తారని ఇలాంటి పార్టీలు యువత భవిష్యత్తుకు విపత్తు ఆప్‌దా వంటివని హర్యానాలో మేం ఎలా పనిచేసామో అందరూ చూసారని, ఉద్యోగాలి స్తామని చెప్పాం ఇచ్చామని, మహారాష్ట్రలో మంచి ఫలితాలుసాధించామని, ప్రజల ఆశీస్సుల తోనే ఈ విజయాలన్నీ చేపట్టామన్నారు. కొందరు అర్బన్ నక్సల్స్ భాషలో మాట్లాడుతూ ఇండియన్‌స్టేట్‌నున బహిరంగంగానే సవాల్‌చేస్తారని ఇలా మాట్లాడేవారికి రాజ్యాంగం గురించికానీ దేశ ఐక్యత గురించి కానీ అవగా హన లేదన్నారు. భారత రాజ్యాంగం ఎలాంటి వివక్షకు తావీయదని, రాజ్యాంగాన్ని జేబుల్లోపెట్టుకుని తిరుగుతున్నవారికి ముస్లిం మహిళలను ఎలాంటి కష్టాల్లోకి నెట్టేసారన్నది తెలియదని ఎద్దేవాచేసారు. మహాత్మా గాంధీ చెప్పినట్లు చిట్టచివరి వ్యక్తికికూడా ఫలాలు అందాలన్నదే మా లక్ష్యమని, ఎస్సీ ఎస్టీ ఒబిసి కులాలకు గరిష్ట అవకాశాల కల్పనకు మా ప్రభుత్వం పనిచేస్తోందని కొందరికికులం గురించి మాట్లాడటం ఫ్యాషన్‌గా ఉంటుందని గడచిన 39 ఏళ్లుగా ఒబిసి ఎంపిలు ఒబిసి కమిషన్‌కు రాజ్యాంగ ప్రతిపత్తికల్పించాలని డిమాండ్‌చేస్తున్నారని గుర్తుచేసారు. కులాన్ని సొంత ప్రయోజనాలకు వాడు కోవాలని చూసేవారు ఆ డిమాండ్ ఎందుకు పట్టించుకోలేదని విపక్షాల మాటలకు చేతలకు పొంతనే ఉండదన్నారు. అధికారం సేవచేసేందుకే అయితే జాతినిర్మాణం జరుగుతుందని, అధికారం వారసత్వంగా మారితే ప్రజాస్వామ్యం అవుతుందని మేం రాజ్యాంగ స్ఫూర్తితోముందుకువెళ్తామేకానీ విషరాజకీయాలకు తావీయబోమని మోడీ స్పష్టంచేసారు.

# ఆదాయ వనరులు పెంచుకోవాలి..

>> **ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థగాడిన పడాలి:** సంక్షేమ కార్యక్రమాలకు, అభివృద్ధి పనులకు ఆర్థిక వనరులు ఎంతో కీలకమని...దీన్ని దృష్టిలో పెట్టుకుని రోజువారీ ప్రోగ్రెస్ చూపేలా ఆదాయార్జన శాఖల్లో అధికారులు పనిచేయాలని సిఎం సూచించారు. గత ప్రభుత్వ విధానాలతో ప్రజల జీవన ప్రమాణాలు పడిపోయా యని, ఆదాయం కోసం ప్రజలపై అదనంగా భారం మోపలేమని, ఆదాయార్జనలో మరింత మెరుగైన ఫలితాలు సాధించడం మినహా మరొక మార్గం లేదని సిఎం అన్నారు. కేంద్రం నుంచి నిధుల విషయంలో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నానని, 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగారియాను కలిసి గంటా 45 నిమిషాల పాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వివరించానని, ఈ తపనంతా రాష్ట్రం కోసమేనని సిఎం అన్నారు. అధికారులు కూడా దీన్ని అర్థం చేసుకుని పనిచేయాలని సిఎం సూచించారు.

**రాష్ట్ర రెవెన్యూ ఆదాయం అంచనా రూ. 1,02,154 కోట్లు:** రాష్ట్రానికి 2023-24 సంవత్సరానికి వాణిజ్య పన్నుల విభాగంలో మొత్తం రూ.41,420 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు..ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.41382 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ విభాగంలో ఫిబ్రవరి, మార్చి నెలల్లో వృద్ధి ఉంటుందని అధికారులు తెలిపారు. అదే విధంగా గతేడాదితో పోల్చితే నూతన ఎక్సైజ్ విధానం కారణంగా ఈ శాఖలో ఆదాయం పెరుగుతుందని అధికారులు వివరించారు. ఇకపోతే మైనింగ్ శాఖలో ఇప్పటి వరకు అనుకున్న స్థాయిలో రెవెన్యూ పెరగలేదని అధికారులు వివరించారు. కోర్టు కేసుల పరిష్కారం, అనుమతుల మంజూరు వంటి చర్యల ద్వారా మైనింగ్ శాఖలో ఆదాయాన్ని పెంచాలని సిఎం అన్నారు. రాష్ట్రానికి ఉన్న మైనింగ్ వనరుల దృష్ట్యా...ఈ విభాగంలో అత్యధిక ఆదాయం రావాలని సిఎం అన్నారు.

202425 ఆర్థిక సంవత్సరానికి వ్యాట్, జీఎస్టీ, ఎక్సైజ్, వృత్తివాణిజ్య పన్నుల ద్వారా వచ్చే ఆదాయం స్వల్పంగా పెరుగుతుందని అధికారులు అంచనా వేశారు. మొత్తంమ్మీద 202425 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ రూ.1,02,154 కోట్లు ఉండొచ్చని అధికారులు అంచనా వేశారు. ఆదాయార్జన విషయంలో ఇకపై ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తానని అధికారులు శాఖలను బలోపేతం చేసుకుని ఫలితాలుచూపాలని సిఎం చంద్రబాబు అన్నారు. ఈ సమీక్షలో ఆర్థికశాఖమంత్రి పయ్యావుల కేశవ్ తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మంగళవారం సమగ్ర సమాచార కరదీపికను ఆవిష్కరిస్తున్న చిన జీయర్ స్వామి

# ఆధ్యాతిక జ్ఞానమే ప్రాపంచిక విజ్ఞానాన్ని పెంపొందిస్తుంది: చినజీయర్ స్వామి...

**విజయవాడ ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి:** మంచిని పెంచే వ్యక్తుల పరిచయాలను పదిగురికి అందించేందుకు ఒక బృహత్తర యత్నం జరగాలని త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి అన్నారు.ఆధ్యాత్మిక, సాంస్కృతిక పీఠాలు,అలౌకి జ్ఞాన సంపదను అందించే వారి వివరాలను నిక్షిప్తం చేసి అందు బాటులో ఉంచడం చక్కని ప్రయోగమన్నారు. మల్లెతీగ సాహిత్య సాంస్కృతిక సేవాసమితి, నవమల్లెతీగ మాసపత్రిక సంయుక్తంగా ప్రచురించిన 2025 సమగ్ర సమాచార కరదీపిక (డైరీ)ని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంలో త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం జీయర్ స్వామి మాట్లాడుతూ సర్వులకూ ఉపకరించే సమాచారం ఈ డైరీలో ఎంతో వుందన్నారు. సనాతర ధర్మ పరివ్యాప్తిలో భాగంగా విజయకీలాద్రిపై జరిగే బ్రహ్మోత్సవాల సమాచారం భక్తులకు తెలియపరచడంలో మీడియా వారు సహకరించాలన్నారు.ఒక క్షేత్రం అలౌకికామృతం లభిస్తుందంటే సరిపోదని,ఆ వివరాలు పదుగురికి తెలియాలన్నారు. నారాయణ సేవ గురించి తెలియాలి, ధార్మికంశాలు తెలియాలి,లౌకిక ప్రపంచీక విధానాలు తెలియాలి.తెలుసుకోవడం వలన మనస్సు వికసిస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ వెంకటాచారి, నవమల్లెతీగ సంపాదకుడు కలిమిశ్రీ, సీనియర్ జర్నలిస్టులు యేమినేని వెంకటరమణ, చొప్పా రాఘవేంద్రశేఖర్ ఆనంద్, కుర్రా సురేష్ బాబు పాల్గొన్నారు.

# తిరుపతి మేయర్ పదవికి గండం?

>> కత్వం ప్రధాన కారణాలుగానే విశ్లేషకులు అంచనావేస్తున్నారు. నిజంగా ఇదీ వైసిపికి పెద్ద దెబ్బగానే జనం కూడా భావిస్తున్నారు. కాగా కూటమి తరపున మునికృష్ణకు 26 ఓట్లు మద్దతుపలకగా వైసిపి అభ్యర్థి లడ్డుభాస్కర్‌రెడ్డికి 21 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో వైసిపి కార్పొరేటర్లు చేసేదిలేక అక్కడ నుండి బయటకు వచ్చారు. ఈ ఎన్నికలకు ముందే దాడులు, విద్వంసాలు, ప్రతీకారాలు, క్యాంపు రాజకీయాలు చేసినా ఫలితం మాత్రం వైసిపి అందుకో లేక పోవడం ఇప్పుడునేతలు జీర్ణించుకోలేని పరిస్థితి.

**జరిగిన తప్పిదాలకు కార్పొరేటర్లు కన్నీళ్లు:** అందరూ ఊహించినట్లే తిరుపతి కార్పొరేషన్‌లో డిప్యూటీ మేయర్ కుర్చీలో టిడిపి పాగా వేయడంతో అనివార్యపరిస్థితుల్లో, భయపెట్టడంతో టిడిపికి ఓటువేశామని కొందరు వైసిపి కార్పొరేటర్లు తప్పు చేశాం..క్షమించండి అంటూ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి, సమన్వయనేత అభినయ్‌రెడ్డి కాళ్ళపై పడి అవినాశ్, అమరనాథ్, అనిల్, మోహన్‌కృష్ణ వేడుకున్నారు. ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తామంటే ఓటువేశామని, వేయకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని భయపెట్టారని మొరవినించారు. వారిని ఓదార్చారు.

**ఎంఎల్‌సీదీ అదేదారి**

అనివార్యకారణాల వల్ల తాను జరిగిన ఓటింగ్‌కు వెళ్ళలేకపోయానని, అయితే తాను ప్రాణం ఉన్నవరకు జగన్‌తోనే ఉంటానని ఎంఎల్‌సి డాక్టర్ సుబ్రమణ్యం వివరణ ఇచ్చుకునే పరిస్థితి వచ్చింది. ఏకంగా సాయంత్రం పద్మావతిపురంలోని భూమన ఇంటికి వెళ్లి భూమనను,. పార్టీ శ్రేణులను క్షమించమని కోరడం వెనుక ఆంతర్యమేమిటో తెలియాల్సి ఉంది. తనకు చావైనా ,బ్రతుకైనా వైసిపితోనేని ఉత్కంఠతతో చెప్పారు.

# సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీమ్ మార్గదర్శకాలు విడుదల

**విజయవాడ.ఫిబ్రవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీమ్ కింద రాష్ట్రంలో భవన నిర్మాణ అనుమతులపై ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణ ప్రాంత స్థానిక సంస్థలే ఇక నుంచి అనుమతులు ఇచ్చేలా మార్గదర్శకాలు ఇచ్చింది. సీఆర్డీఏ మినహా అన్ని చోట్లా అనుమతుల జారీ అధికారం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధి నుంచి పట్టణ ప్రాంత స్థానిక సంస్థలకు బదిలీ చేస్తున్నట్లు తెలిపింది. 300 చదరపు మీటర్లు మించకుండా ఉన్న ప్రాంతాల్లో నిర్మాణాలను స్వయంగా యజమానులే ప్లాన్ ధ్రువీకరించి దరఖాస్తు చేసేలా చట్టంలో మార్పులు చేశారు. స్వయంగా యజమానులు లేదా ఆర్కిటెక్టు, ఇంజనీర్లు, టౌన్‌ప్లానర్లు కూడా దరఖాస్తు చేసే అవకాశం కల్పిస్తూ మార్గదర్శకాలు విడుదల చేసింది. లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్‌లు కూడా ఇంటి ప్లాన్ ను ధ్రువీకరించి అప్ లోడ్ చేసే అవకాశం కల్పించింది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా: బహుళ అంతస్తులు కాని నివాస భవనాలకు మాత్రమే ఈ వెసులుబాటు కల్పిస్తూ మార్గదర్శకాలు ఇచ్చింది. ఆన్‌లైన్ బిల్డింగ్ పర్మిషన్ సిస్టంలో నేరుగా దరఖాస్తుదారు లైసెన్సుడు టెక్నికల్ పర్సన్ జారీ చేసిన ప్లాన్ ను అప్‌లోడ్ చేసేలా నిబంధనల్ని సరళతరం చేసింది. ఈ మేరకు ఏపీ మున్సిపల్, టౌన్ ప్లానింగ్ చట్టాల్లో మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు గానూ భవన నిర్మాణ అనుమతులను సరళతరం చేస్తూ ఆదేశాలిచ్చారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా భవన నిర్మాణ అనుమతుల కోసం సెల్ఫ్ సర్టిఫికేషన్ ప్రక్రియను ప్రవేశ పెట్టారు. అనుమతులున్న లే అవుట్స్ లో నిర్మించే భవనాలకు మాత్రమే ఈ వెసులుబాటు కల్పించాలని నిర్ణయించారు. 2008, 2020 ఎల్ఆర్ ఎస్‌లో అనుమతులు పొందిన లేఅవుట్లలో నిర్మించే భవనాలకు వెసులు బాటు కల్పించారు. ప్లింత్ లెవల్ ఇన్‌స్పెక్షన్ నివేదికను ఆన్‌లైన్ బిల్డింగ్ పర్మిషన్ సిస్టంకు సమర్పించాలని మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు. కోస్టల్ రెగ్యులేటరీ జోన్ లో నిర్మించే భవనాలకు ఈ స్వయం ధ్రువీకరణ వెసులుబాటు లేదని స్పష్టం చేశారు. అనధికార లేఅవుట్లో నిర్మించే భవనాలకు ఈ వెసులుబాటు లేదని వెల్లడించారు. ఆన్‌లైన్ బిల్డింగ్ పర్మిషన్ సిస్టంలో ఎలాంటి ఉల్లంఘనలు చోటు చేసుకున్నా సంబంధిత భవనాల యజమానులపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్ మార్గదర్శకాలు జారీ చేశారు.

# మరణాల సంఖ్యను ఎందుకు దాస్తున్నారు?

## లోక్‌సభలో అఖిలేష్ యాదవ్ ఆగ్రహం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లోజ రుగుతున్న మహాకుంభ్‌మేళాలో తొక్కిసలాటఘటనపై పార్లమెంట్‌లో దుమారం చెలరేగుతోంది. ఈ దుర్ఘటనలో వాస్తవ మరణాల సంఖ్యను యూపి ప్రభుత్వం దాచిపెడుతున్నందటూ ఎంపి అఖిలేష్‌యాదవ్ బిజెపి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేసారు. కుంభ్‌మేళా సందర్భంగా యోగి ప్రభుత్వంచేసిన ఏర్పాట్లపైనా ఆయన మండిపడ్డారు. తొక్కిసలాటలో ఎంతమంది చనిపోయారు. అసలైన లెక్కలు బయటపెట్టండి అంటూ నిలదీసారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపేందుకు పార్లమెంటు మంగళవారం కూడా ప్రత్యేకసమావేశం అయింది. ఈ క్రమంలో కుంభ్‌మేళా ఘటనపై అఖిలేష్ స్పందించారు. ఈ అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుకలో తొక్కిసలాట జరగడం బాధాకరమని, యుపి ప్రభుత్వం 30 మంది చనిపోయారని 60 మందికి గాయాలయ్యాయని చెపుతోందని కానీ విపక్షాలు ఆసంఖ్య ఇంకా ఎక్కువే ఉన్నాయని అంటున్నాయన్నారు. బడ్జెట్ విషయంలో సరైన లెక్కలుచెప్పే ప్రభుత్వం కుంభమేళా మరణాలసంఖ్యను ఎందుకు దాస్తున్నదని ప్రశ్నించారు. ఈ దుర్ఘటనకు బాధ్యత ఎవరిదని ఇప్పటిదాకా ఎంతమందిపై చర్యలు తీసుకున్నారని అఖిలేష్ ప్రశ్నించారు. ఈఘటనపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని, కుంభమేళా ఏర్పాట్లపై చర్చించాలని, మరణాలు, గాయపడినవారు, వారికి అందుతున్న చికిత్స, అక్కడి వైద్యసిబ్బంది, రవాణా సదుపాయాలు వైద్యం ఇలా అన్నింటిపైనా చర్చజరగాలని ఆయన డిమాండ్‌చేసారు. ప్రధాని రాష్ట్రపతి సంతాపం చెప్పేంతవరకూ యోగి సర్కారు సంతాపం కూడా ప్రకటించలేదని అఖిలేష్ తీవ్రస్వరంతోప్రశ్నించారు. పెటుబ్బడుల విషయంలో డబుల్ ఇంజిన్‌ప్రభుత్వాల ఇంజిన్లుమాత్రమేకాదని బోగీలు కూడా ఢీకొట్టుకున్నాయని ఎద్దేవాచేసారు.

# అక్రమవలసదారుల రవాణాకు భారీ వ్యయం

## ఒక్కో వ్యక్తికి 4675 డాలర్లు ఖర్చుచేస్తున్న అమెరికా

వాషింగ్టన్, ఫిబ్రవరి 4: అక్రమ వలసదారులపై గుర్రుగా ఉన్న దేశాధ్యక్షుడు డొనాల్డ్‌జాన్‌ట్రంప్ దేశ చరిత్రలోనే అతిపెద్ద బహిష్కరణ ఆపరేషన్ చేపట్టారు. అక్రమంగా వలసవెళ్లిన విదేశీయులను వెనక్కి పంపిస్తున్నారు. ఇందుకోసం భారీ మొత్తం ఖర్చుచేసేందుకు సైతం వెనకాడటంలేదు. పౌరవిమానాల్లోనే కాకుండాప్రత్యేక సైనిక విమానాల్లో సంబంధిత దేశాలకు తరలిస్తున్నారు. గ్వాటెమాలా, పెరూ, హోండూరాస్ తదితర దేశాలకు అమెరికా వందలమంది అక్రమ వలసదారులను తరలించింది. గ్వాటెమాలాకు వెళ్లాలంటే ఒక్కో వ్యక్తికి 4675 డాలర్లు ఖర్చుచేసింది. సాధారణ టికెట్ 853 డాలర్లతోపోలిస్తే ఐదు రెట్లు ఎక్కువ. యుఎస్ ఇమ్మిగ్రేషన్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నడిపించే ఛార్టర్‌ఫ్లైట్ టికెట్‌దరకంటే ఎక్కువ కావడం విశేషం. సి17 సైనిక విమానంలో మరింత అధికం అవుతోంది. ఈ ఆపరేషన్‌కు అమెరికా రక్షణశాఖ రెండు సి17 రెండు సి130 ఈ మిలిటరీ ఎయిర్‌క్రాఫ్ట్‌లను వినియోగిస్తోంది. సి17 విమానానికి నిర్వహణ ఖర్చు గంటకు 21వేల డాలర్లుగా అంచనా. సీ130 ఈ ఎయిర్‌క్రాఫ్ట్‌కు 68 వేలనుంచి 71 వేల డాలర్లుగా ఖర్చు అవుతోంది. దీనితో సి17 విమానం 12 గంటలప్రయాణానికి 2.52 లక్షల డాలర్లు అవుతుంటే సి130 విమానం అయితే 8.16 లక్షలడాలర్లనుంచి 8.52 లక్షల డాలర్లు వ్యయం అవుతున్నట్లు తేలింది. ఇసిఇ డైరెక్టర్ జాన్సన్ వెల్లడించిన గణాంకాలుచూస్తే డిపోర్టేషన్ విమానాల ఖర్చు గంటకు 17 వేల డాలర్లవుతున్నదన్నారు. 135 మంది సామర్థ్యం ఉన్న ఈవిమానంలో ఒక్కొక్కరిని పంపించేందుకు గంటకు 630 డాలర్లు ఖర్చవుతోందని చెప్పారు. ట్రంప్ బహిష్కరణ అపరేషన్‌చేపట్టాక మొత్తం ఖర్చుపై లెక్కలు వేయలేదన్నారు. ఖర్చుతో నిమిత్తంలేకుండా ప్రాదాన్యతా క్రమంలో అక్రమ వలసదారులను వేగంగా తరలించే లక్ష్యంతోనే అధికారులు పనిచేస్తున్నారు. భారత్‌కు చెందిన అక్రమ వలసదారులను సి17 విమానంలో తరలించగా వచ్చే 24 గంటల్లో భారత్‌కు వస్తారని అంచనా.

# రైతువేషంలో వెళ్లి అవినీతి కనిపెట్టిన భద్రక్ కలెక్టర్

**భద్రక్(ఒడిశా),ఫిబ్రవరి 4:** అవినీతిపై వస్తున్న ఫిర్యాదులపై విచారణ చేసేందుకు భద్రక్ జిల్లా కలెక్టర్ తానే స్వయంగా రంగంలోకి దిగారు. జిల్లా కలెక్టర్ దిలీప్ రౌత్రాయ్ అవినీతి ఆరోపణలు ఎక్కువ వస్తున్న ఒక ప్రాథమికవ్యవసాయ సహకారసొసైటీ ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని తనిఖీలుచేసారు. అయితే తాను కలెక్టర్‌గా కాకుండా షార్ట్స్‌వేసుకని టీషర్టు వేసి భుజాలపై ఒక తుండు వేసుకని తలకు టోపీ, ముఖానికి మాస్క్ ధరించి కట్షాహి సేవా సమయబాయా సమితి మండికి వెళ్లారు. ధామ్‌నగర్ బ్లాక్‌లో ఉన్న ఈ కేంద్రాన్ని సందర్శించి అక్కడిపరిస్థితులు నిశితంగా పరిశీలనచేసారు. మిల్లర్లు, సహకార సొసైటీలు క్వింటాలుకు అదనంగా ఎనిమిదినుంచి పది కిలోల ధాన్యం డిమాండ్‌చేస్తున్నట్లు గుర్తించారు. దీనితో సహేతుక నాణ్యత సగటు ప్రమాణాలను అతిక్రమిస్తున్నట్లు గుర్తించారు. మండినుంచి తిరిగి వచ్చిన వెంటనే కలెక్టర్ రౌత్రాయ్ సహకార సొసైటీల అసిస్టెంట్ రిజిస్ట్రార్‌ను పిలిపించుకని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ సొసైటీ కార్యదర్శికి షోకాజ్‌నోటీస్ జారీచేసారు.

# కేంద్ర సహకారంతో రాష్ట్రానికి భారీగా నిధులు: మంత్రి లోకేష్

## ఢిల్లీలో బిజీ,బిజీగా లోకేష్

**విజయవాడ,ఫిబ్రవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే సమిష్టి కృషితో విశాఖ రైల్వే జోన్, రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్ట్, స్టీల్ ప్లాంట్‌లకు నిధులు తెచ్చుకోగలిగామని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. సమిష్టి కృషితోనే ఇదంతా సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. మనమంతా కలిసికట్టుగా ఉండడం వల్లే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోగలిగామన్నారు. మంగళవారం ఢిల్లీ పర్యటనకు వచ్చిన మంత్రి నారా లోకేష్.. టీడీపీకి చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలతోపాటు బీజేపీ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఇక ముందు కూడా ఇదే పంథా కొనసాగిద్దామని వారికి సూచించారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర మంత్రులు, ఎంపీలు చేస్తున్న కృషిని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ అభినందించారు.అతి తక్కువ కాలంలో విశాఖ స్టీల్‌తో సహా అనేక సమస్యల పరిష్కారం కావడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని వారితో నారా లోకేష్ పేర్కొన్నారు. ఢిల్లీ పర్యటనకు వచ్చిన నారా లోకేష్‌తో కేంద్ర మంత్రులు శ్రీనివాస వర్మ, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ ఎంపీలతోపాటు బీజేపీ నేతలు కలిసి మాట్లాడారు. ఈ మేరకు నారా లోకేష్ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.ఇక లోకేష్ తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో కలుసుకున్నారు.రాష్ట్రానికి భారీగా నిధులు కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

# ప్యాన్‌కు ఉరేసుకొని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

**విజయవాడ,ఫిబ్రవరి4,ప్రభాతవార్తప్రతినిధి:**ఇంటర్ విద్యార్థి ప్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం కృష్ణా జిల్లా కానూరులో జరిగింది. కానూరులోని ఎన్ఆర్ఐ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి గుర్రం.వేణునాథ్ (18) తన హాస్టల్ గదిలో ఫ్యాన్‌కి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.ఈ విషయాన్ని గమనించిన సహచర విద్యార్థులు సమాచారాన్ని హాస్టల్ నిర్వహణాధికారికి తెలిపారు.వెంటనే ఆయన విషయాన్ని పోలీసులకు తెలియజేసారు. వేణునాథ్ స్వస్థలం తోట్లవల్లూరు మండలం గురువిందపల్లిగా తెలుసుకున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియవలసి ఉంది.వేణునాథ్ మానసిక వత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

# 24 నుంచి బడ్జెట్ అసెంబ్లీ

>> తీసుకోనుంది. తర్వాత శాసనసభ వ్యవహారాల సలహా మండలిలో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు.

## వారం - వర్జ్యం

**తేది : 05-02-2025, బుధవారం**
**శ్రీ క్రోధి నామ సంవత్సరం,**
**మాఘమాసం, ఉత్తరాయణం,**
**శిశిర ఋతువు, శుక్లపక్షం,**
అష్టమి రా.12.36
భరణి రా.8.32
వర్జ్యం : ఉ.6.39-8.32
దు.మ.12.07-12.53
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** ఆధ్యాత్మిక చింతన. ప్రముఖుల నుండి శుభవార్తలు వింటారు. వస్తులాభం. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**వృషభం :** బంధువుల నుండి ధనలాభం పొందుతారు. ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. ఇంటా బయటా ప్రోత్సాహం.

**మిథునం:** పాత మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు. వస్తు కొనుగోలు. ఆర్థిక పరిస్థితి అనుకూలం.

**కర్కాటకం:**దూరప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. ఇంటర్వ్యూలు అందుతాయి. పోటీపరీక్షలలో విజయం సాధిస్తారు.

**సింహం:** బంధువుల నుండి విలువైన సమాచారం అందుకొంటారు. వస్త్రా కొనుగోలు. వృత్తి, వ్యాపారాలలో లాభాలు.

**కన్య :** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం కలవరపాటు కలిగిస్తుంది. సోదరుల కలయిక.

**తుల :** చోరభయం. కుటుంబసభ్యులు ఎదురై చికాకులు పెడతాయి. వాహనసౌఖ్యం. జీవిత భాగస్వామి నుండి సాయం అందుతుంది.

**వృశ్చికం:** ముఖ్యమైన పనులు ముందుకు సాగవు. ధనవ్యయం. ఆరోగ్యసమస్యలు ఎదురై చికాకులు పెడతాయి.

**ధనుస్సు:** నూతన ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వస్తుసేకరణ.

**మకరం:** కొత్త పథకాలకు రూపకల్పన చేస్తారు. విందు, వినోదాలలో పాల్గొంటారు. సేవకార్యక్రమాలలో పాల్గొంటారు.

**కుంభం:** పనులలో ఆటంకాలు ఎదురై చికాకు పెడుతాయి. ఖర్చులు పెరుగుతాయి. బంధువుల కలయిక.

**మీనం :** ఉద్యోగ బాధ్యతలు పెరిగిన సమర్థవంతంగా నిర్వహిస్తారు. శుభవార్తలు అందుకొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

05-02Pg3exHMNWJQEVRSP.qxd:05-02Pg3exHMNWJQEVRSP.qxd 01/01/01 9:43 AM Page 1






# నేత్ర పర్వం..అరసవిల్లి సూర్యుని నిజరూప దర్శనం

## - ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించిన దేవాదాయశాఖ

## - స్వామివారిని దర్శించుకున్న మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం అర్ధరాత్రి 12.30 గంటల నుంచి స్వామి వారికి క్షీరాభిషేకాలు ప్రారంభమయ్యాయి. స్వామి వారి నిజరూప దర్శనానికి జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి కూడా వేలాది భక్తులు తరలివచ్చారు. ముందుగా స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించిన దేవాదాయశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ వాడ్రెన్ వినయ్ చంద్ పూజలు ప్రారంభించి ప్రభుత్వ లాంఛనాలతో పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి నిజరూప దర్శనాన్ని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్న ప్రజా ప్రతినిధులలో కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, శాసనసభ్యులు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, మామిడి గోవిందరావు, గౌతు శిరీష, మాజీ కేంద్రమంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, ఎంఎల్‌సి వరుదు కళ్యాణి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులు ఉన్నారు.స్వామి వారి నిజరూప దర్శించుకున్న అధికారులు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్ల ప్రధాన న్యాయమూర్తి జువైద్ అహ్మద్ మౌలానా, విశాఖపట్నం డిఐజి గోపినాథ్ జట్టి, జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, పార్వతీపురం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, రెవెన్యూ డివిజనల్ అధికారి సాయి ప్రత్యూష, వెంకటేష్ తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు భారీగా



తరలి రావడంతో భారీ ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అరసవల్లికి వచ్చే వాహనాల రాకపోకల ప్రత్యేకదారుల మీదుగా మళ్లించారు. జిల్లా యంత్రాంగం, పోలీస్ అధికారులు చేపట్టిన పటిష్ట చర్యలతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా నిజరూప దర్శనం త్వరితగతిన జరిగింది. జిల్లా కలెక్టర్ పలుమార్లు స్వయంగా పర్యటించి క్యూలైన్‌లో ఉన్న వారికి క్యూలైన్‌లో దర్శనానికి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీయగా భక్తులు ఏర్పాట్లుపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలు స్వచ్ఛంద సంస్థలు అన్నదానాలు, మంచినీటి సరఫరా, పిల్లలకు పాలు, భక్తులకు మజ్జిగ వంటివి సరఫరా చేశాయి. ఇంద్రపుష్కరిణి గట్టుపై మహిళలు పిడకలపై ఆవుపాలు, బియ్యం, పంచదారతో పరమాన్నం తయారు చేసి, సూర్యనారాయస్వామికి నివేదించి పూజలు నిర్వహించారు.

# పోలవరం ప్రాజెక్టు కెపాసిటీ తగ్గించొద్దు

**రాష్ట్రానికి అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం: ఎంపి మిథున్‌రెడ్డి**



**విజయవాడ,ఫిబ్రవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** పోలవరం ప్రాజెక్ట్ విషయంలో రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోబోమని వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి అన్నారు. అవసరమైతే పార్టీలకు.రాజకీయాలకు అతీతంగా ఎంపీలతో కలిసి లోక్ సభలో పోరాడేందుకు తాము సిద్ధమని చెప్పారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే చర్చలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.పోలవరం ప్రాజెక్ట్ కెపాసిటీని తగ్గించవద్దని మిథున్ రెడ్డి కోరారు. ప్రాజెక్ట్ కెపాసిటీ 194 టీఎంసీలన్నారు.ఏడున్నర లక్షల ఎకరాలకు సాగునీటిని అందించేలా ప్రాజెక్ట్ ని డిజైన్ చేశారని తెలిపారు. ప్రాజెక్ట్ ఎత్తును తగ్గిస్తూ బడ్జెట్ లో ప్రతిపాదనలు పెట్టారన్నారు.. దీనివల్ల ప్రాజెక్ట్ కెపాసిటీ 194 టీఎంసీల నుంచి 115 టీఎంసీలకు పడిపోయిందని చెప్పారు. కేవలం 3.20 లక్షల ఎకరాలకు మాత్రమే నీరు అందుతుందని తెలిపారు. దీనివల్ల రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని చెప్పారు.

ఈ అన్యాయాన్ని ఎదిరించేందుకు టీడీపీ ఎంపీలతో కలిసి పని చేసేందుకు కూడా సిద్ధమేనని అన్నారు. కెపాసిటీ తగ్గిస్తే బనకచర్లకు నీరు ఎలా అందుతుందని ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేయవద్దని అన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో క్రమంగా ఇంగ్లీష్ మీడియంను రద్దు చేస్తున్నారని విమర్శించారు.

# హంద్రీనీవా కాలువ వెడల్పు చెయ్యాల్సిందే!

**కాలువ సామర్థ్యాన్ని పదివేల క్యూసెక్కులకు పెంచాలి**

**ఎన్నికల వాగ్దానాన్ని కూటమి అమలు చేయాల్సిందే**

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ**

**అనంతపురం ఫిబ్రవరి 04 ప్రభాతవార్త బ్యూరో** కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి రాయలసీమ ప్రజల మద్దతు కూడగట్టడానికి హంద్రీనీవా సుజల స్రవంతి పథకాన్ని తెరమీదకు తెచ్చి హంద్రీనీవా కాలువను పదివేల క్యూసెక్కుల సామర్థ్యము చేపట్టి చివరి ఆయకట్టుకు నీళ్ల అందిస్తామని నమ్మబలికిన పెద్దలు అధికారం రాగానే మాట మార్చడం భావ్యం కాదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మండిపడ్డారు. మంగళవారం అనంతపురం జిల్లా కేంద్రంలోని హంద్రీనీవా సుజల స్రవంతి జిల్లా కార్యాలయం ముందు సిపిఐ ఆద్వర్యంలో అఖిలపక్ష రాజకీయ పార్టీలను, రైతు సంఘాల నాయకులను కలుపుకొని ధర్నా చేపట్టిన కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రధాన వక్తగా హాజరై మాట్లాడుతూ కర్నూలు జిల్లా మల్యాల నుండి చిత్తూరు జిల్లా కుప్పం వరకు కృష్ణా జలాలను మళ్లించడానికి హంద్రీనీవా సుజల స్రవంతి పథకాన్ని తీసుకొచ్చిన ప్రభుత్వాలు రైతుల ఆశయాలకు అనుగుణంగా పనిచేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హంద్రీనీవా కాలువ సామర్థ్యం పెంచి చివరి ఆయకట్టుకు నీళ్ల ఇస్తామని ఎన్నికల వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు ఇప్పుడు మాట మారుస్తున్నారన్నారుని ఆరోపించారు. పదివేల క్యూసెక్కుల సామర్థంతో కాలువ వెడల్పు చేసి 6లక్షల ఎకరాలకు సాగు నీరు అందించడంతో పాటు



హంద్రీనీవా డిప్యూటీ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న సిపిఐ, సిపిఎం నేతలు

30లక్షల మందికి త్రాగు నీరు అందించాలనేది ప్రధాన డిమాండు. చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించాలని 50 సంవత్సరాలుగా పోరాటం జరుగుతుంది గుర్తు చేశారు. ప్రభుత్వం రైతులకు అనుగుణంగా క్రిష్ణా జనులను తోడి అందించాల్సింది పోయి కాంక్రీటు లైనింగ్ చేపట్టి రైతులను నష్టాలకు గురి చేస్తే ఉద్యమిస్తామన్నారు. మొదటి పేజ్ కింద 14 టీఎంసీల నీటి వాడుకోవాల్సి ఉండగా కాలువ సామర్థం లేక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రెండోదశ కింద లైనింగ్ పనులు చేపట్టి కుప్పం వరకు నీళ్ల తీసుకెళ్లడానికి చంద్రబాబు చేసిన కుయుక్తులను బయటపెట్టారు. గోదావరి నీళ్ల బనకచర్ల వరకు కాలువ తవ్వి నీళ్ల ఇస్తామంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు హంద్రీనీవా కాలువ విషయంలో ఎందుకు వెనకడుగు వేస్తున్నాడని ప్రశ్నించారు. రాయలసీమలోని చిత్తూరు, కర్నూలు, అనంతపురం జిల్లా రైతాంగానికి సాగునీరు, తాగునీరు అందించే ప్రాజెక్టులపై శీతకన్ను ఎందుకన్నారు. మదనపల్లిలో ఇప్పటికే రైతులు ఆందోళన మొదలుపెడితే అనంతపురం కర్నూలు జిల్లాల్లో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టడానికి సిద్ధంగా ఉన్నారని గుర్తు చేశారు. 30 సంవత్సరాలుగా కృష్ణా జలాలు రాయలసీమకు మళ్లింపు నినాదం కొనసాగుతూనే ఉందని 1995లో చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసిన విషయం గుర్తు చేశారు. ముఖ్యమంత్రులు మారిన రాయలసీమ రైతాంగ సమస్యలు మాత్రం అక్కడే ఉన్నాయన్నారు. మూతి ముందా తోక ముందా అనే చందంగా చంద్రబాబు వ్యవహారం ఉందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ మాట్లాడుతూ రెండో దశ లైనింగ్ పనులు వెంటనే ఆపివేయాలని కాలువ సామర్థం పెంచి చెరువులకు నీళ్ల ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే కాలువ సామర్థం నానాటికి తీశికట్టు చందంగా మారిందని అన్నారు. అనంతపురం జిల్లాలో శ్రీకృష్ణదేవరాయల కాలంనాటి చెరువులుఉన్నాయన్నారు.

# టిటిడిలో ఘనంగా రథసప్తమి వేడుకలు

## - స్వామివారికి అలంకారం చేసిన 'పడవల' దంపతులు

**విజయవాడ,ఫిబ్రవరి 4,ప్రభాతవార్త** బెజవాడలో తొలిసారిగా టిటిడి కళ్యాణమండపం మాడవీధుల్లో శ్రీ స్వామి వారిని తిరుచ్చిపై భక్తులు ఊరేగించడం విశేషతను సంతరించుకుంది. టిటిడిలో మంగళవారం రథ సప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం 5 గంటలకే రథ సప్తమి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు తోమాల సేవను నిర్వహించారు. అనంతరం స్వామి వారిని వివిధ రకాల వర్ణాల పుష్పాలతో వీనులవిందుగా అలంకరించారు. 7.05 నిముషాలకు స్వామివారిపై



మాడ వీధుల్లో స్వామి వారు

సూర్య కిరణాలు పడిన వెంటనే పండితులు వేద మంత్రాల ఘోషను నిర్వహించగా,భక్తులు ఆదిత్య హృదయాన్ని పఠించారు. అనంతరం ముస్తాబైన స్వామివారి ఉత్సవ మూర్తిని 'తిరుచ్చి'పై ఆసనంగా ఉంచి మాడవీధుల్లో ఊరేగించారు. విశేష అలంకార ప్రియుడైన స్వామివారికి మూల,మూలల మహిళలు హారతులిచ్చారు.దాదాపు 400 మంది వరకు భక్తులు వీనులవిందుగా హారతులిచ్చిన వైనం కనువిందు చేసింది. ఆలయ అర్చకులతో పాటు ఆలయ ముఖ్య అధికారులు,సూపరింటెండెంట్ మల్లిఖార్జునరావు,లలిత,రమాదేవితో పాటు స్వామివారికి పూలతో విశేష అలంకారం నిర్వహించిన పడవల ఏడుకొండలు-శాంతిశ్రీ దంపతులు,విజయకుమార్-సునీత దంపతులు,ప్రసాదరెడ్డి, సుబ్రహ్మణ్యం దంపతులు,తులసి,రాజేశ్వరి,రామకృష్ణ,వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అర్చకుల వేదమంత్రాలు,భక్తుల గోవింద నామస్మరణలతో ఆద్యంతం టిడిపి ప్రాంగణం భక్తి పారవశ్యంతో మునిగిపోయింది.న భూతో బన భవిష్యత్ అనే రీతిలో టిటిడి ప్రాంగణంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఆద్యంతం మహిళా భక్తులు విరివిగా తరలి రావడంతో, భక్తుల గోవింద నామాలతో టిటిడి ప్రాంగణం భక్తి పారవశ్యంతో మునిగి తేలింది.

# సిబిఐ కోర్టు స్పెషల్ పిపిగా వెన్నా కళ్యాణ చక్రవర్తి



**విజయవాడ,ఫిబ్రవరి 4,ప్రభాతవార్త** సిబిఐ కోర్టు సెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వెన్నా కళ్యాణ చక్రవర్తి నియమితులయ్యారు. ఈయన ఈ పదవిలో మూడేళ్ళ పాటు కొనసాగుతారు. ఈయన తండ్రి సీనియర్ న్యాయవాది అయిన వెన్నా రమేష్‌చంద్రబాబు గతంలో విజయవాడ మహిళా కోర్టుకు ఎపిపిగా సుదీర్ఘకాలం పాటు పనిచేశారు.ఆయన హయాంలో 95 శాతం సక్సెస్ రేటును సాధించి,నిందితులకు కఠిన శిక్షలు పడేటట్లు చేసి,అప్పటి పోలీస్ కమీషనర్ నుండి ప్రశంసలు కూడ అందుకున్నారు. ఆయన వద్ద నుండి మెళుకువలను సంగ్రహించిన ఆయన తనయుడైన కళ్యాణ చక్రవర్తి ఆయన అడుగుజాడల్లోనే నడిచి,అత్యంత ప్రతిష్టాత్మక మైన సిబిఐ కోర్టు ఎపిపి పదవికి నియమితులయ్యారు.

# ప్రపంచ విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్‌లలో జిఎంఆర్ఐటికి గుర్తింపు

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త** టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ (టిహెచ్ఈ) సబ్జెక్టు వారీగా ఇచ్చిన వరల్డ్ యూనివర్శిటీ ర్యాంకింగ్స్ 2025లో ఇంజనీరింగ్ విభాగంలో జిఎంఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (జిఎంఆర్ఐటి) రాజాం చోటు దక్కించుకున్నట్లు జిఎంఆర్ఐటి మేనేజ్‌మెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వరల్డ్ యూనివర్శిటీ ర్యాంకింగ్స్ 2025 కోసం 97 దేశాల నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన 1488 విశ్వవిద్యాలయాలు పాల్గొనగా 18 కఠినమైన పనితీరు సూచికల ఆధారంగా విశ్లేషించి ర్యాంకింగ్‌లను ఇచ్చారని వారు తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హార్వర్డ్, స్టాన్ఫర్డ్, ఎంఐటి మరియు ఆక్స్‌ఫర్డ్ వంటి విశ్వవిద్యాలయాలు తమ అగ్ర స్థానాలను కొనసాగించగా, ఉన్నత విద్య రంగంలో పెరుగుతున్న ప్రభావాన్ని సూచిస్తూ భారతదేశం నుంచి 87 విద్యాసంస్థలు ర్యాంకింగ్స్ పొందాయని అన్నారు.

ఆంధ్రప్రదేశ్ నుంచి 7 విశ్వవిద్యాలయాలు మరియు ఇతర విద్యాసంస్థలు ఈ ర్యాంకింగ్‌లో చోటు సంపాదించగా వాటిలో అటానమస్ విద్యాసంస్థ అయిన జిఎంఆర్ఐటి ర్యాంకింగ్‌ను దక్కించుకుని ప్రత్యేకంగా నిలిచిందని తెలిపారు. ఈ గుర్తింపు ద్వారా జిఎంఆర్ఐటి తన పరిశోధనలలో నైపుణ్యతను, విద్యావిధానంలో నవీకరణల పట్ల అంకితభావాన్ని తెలియ జేస్తుందని, ఈ ఘనతను సాధించడంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా వారికి జిఎంఆర్ఐటి మేనేజ్‌మెంట్ అభినందనలు తెలిపారు.

# సిఎం చంద్రబాబు పాలన సుభిక్షంగా సాగుతుంది

## - ప్రముఖ అవధాని,మాడుగుల నాగఫణిశర్మ



మాడుగుల నాగఫణిశర్మకు జ్ఞాపికను అందిస్తున్న ముఖ్యమంత్రి

**విజయవాడ,ఫిబ్రవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో సీఎం చంద్రబాబు వంటి ముందు చూపు ఉన్న నేత లేరని ప్రముఖ అవధాని,సరస్వతీ ఉపాసకులు పద్మశ్రీ అవార్డు ప్రకటించబడిన మాడుగుల నాగఫణి శర్మ అన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాలను ప్రోత్సహించడంలో ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు తీసుకున్న చర్యలను ఆయన కొనియాడారు. ప్రముఖ అవధాని, సరస్వతీ ఉపాసకులు మాడుగుల నాగఫణి శర్మ పద్మశ్రీ పురస్కారం పొందిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా నాగఫణి శర్మ మాట్లాడుతూ. చంద్రబాబు కీర్తి మరింత ఇనుమడిస్తుందని...ఆయన పాలనలో రాష్ట్రం సుభిక్షం అవుతుందని చెప్పారు. ప్రజల కోసం చేపట్టిన కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తాయని...ఆయన ఆలోచనలన్నీ కార్యరూపం దాల్చుతాయని అన్నారు. అమరావతి రాజధాని పూర్తై ప్రపంచంలో మేటి నగరం అవుతుందని, పోలవరం సహా అన్ని ప్రాజెక్టులు పూర్తై ప్రజలకు మేలు జరుగుతుందని నాగఫణి శర్మ అన్నారు. ముఖ్యమంత్రిని ఈ మేరకు ఆయన ఆశీర్వదించారు. పద్మశ్రీ వచ్చిన సందర్భంగా నాగఫణి శర్మను అమరావతికి ఆహ్వానించిన సీఎం చంద్రబాబు...ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి సన్మానించారు. చంద్రబాబు విజన్ వల్లనే హైదరాబాద్‌కు ఐటీ వచ్చిందన్నారు..ఆయన ముందు చూపు లక్షల మంది జీవితాల్లో వెలుగులు తెచ్చిందని అన్నారు. రాళ్లు, రప్పలతో నిండిన మాదాపూర్ ప్రాంతం భవిష్యత్‌లో ఎలా ఉండబోతుందో చంద్రబాబు ఊహించారని అన్నారు. ఐటీ కంపెనీలతో రూపురేఖలు మారిపోతాయన్నారు.

# తిరుమల సమాచారం

# సప్తవాహనాలపై సప్తగిరీశుడు అభయం

## - వరుసగా వివిధ అలంకరణల్లో స్వామివారు



**తిరుమల,ఫిబ్రవరి 4ప్రభాతవార్తప్రతినిధి:** మాఘమాసం సప్తమితిధిసూర్యజయంతి పర్వదినాన మంగళవారం ఉదయం నుండి రాత్రి వరకు ఏడుకొండలస్వామి ఏడువాహనాలపై అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చాడు. సాధారణంగా ఏడాది బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదిరోజులు 16 వాహనసేవలు జరిగితే రథసప్తమిన ఒకేరోజు ఏడువాహనాలపై ఊరేగడం విశేషం. మంగళవారం ఉదయం తొలివాహనంగా 5.30గంటలకు శ్రీమన్నారాయణుడిగా సూర్యప్రభవాహనంపై దర్శనమిచ్చిన కలియుగదేవుడు ఆ తరువాత వరుసగా ఉదయం 9గంటల నుండి 10గంటల వరకు చిన్నశేషవాహనం, ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు గరుడవాహనం, మధ్యాహ్నం 1నుండి 2గంటల వరకు హనుమంతవాహనం, మధ్యాహ్నం 2గంటల నుండి 3గంటల వరకు చక్రస్నానమహోత్సవం, సాయంత్రం 4గంటల నుండి 5గంటల వరకు కల్పవృక్షవాహనం, సాయంత్రం 6గంటల నుండి 7గంటల వరకు సర్వభూపాల వాహనం, రాత్రి 8గంటల నుండి 9గంటల వరకు చంద్రప్రభవాహనసేవలపై ఊరేగారు. చక్రస్నానమహోత్సవాన భక్తులు స్వామివారి పవిత్రపుష్కరిణిలో పుణ్యస్నానాలాచరించారు. అత్యంత ప్రధానమైన గరుడసేవలోనూ లక్షలాదిమంది భక్తులు మాఢవీధుల్లోఉండి మలయప్పస్వామిని దర్శించుకుని ముక్తిపొందారు. గంట విడిదిలో ఊరేగిన ఒక్కో వాహనసేవను ఆద్యంతం భక్తులు భక్తితో వీక్షించి స్వామివారికి కర్పూరహారతులిచ్చారు. ఆపదమొక్కులవాడా గోవిందా...వేంకటరమణ గోవిందా,కరుణించుస్వామీ అంటూ వేడుకున్నారు. ఆలయ మాఢవీధుల్లో ఉన్న ప్రతి భక్తునికి సంతృప్తికరంగా, ఆనందంతో అన్నప్రసాదాలు, టీ, కాఫీ, మజ్జిగ, తాగునీరు ఇలా సకల సౌకర్యాలు అందించడంతో ఎంతో దూరంనుండి వచ్చిన భక్తులు పరవశమయ్యారు. ఈ వాహనసేవల్లో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు. టిటిడి ఇఓ శ్యామలరావు దంపతులు, అదనపు ఇఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఇఓ లోకనాథం. ఆలయ పేష్కార్ రామకృష్ణ, బోర్డు సభ్యులు జ్యోతులనెహ్రూ, ఎంఎస్‌రాజు, భానుప్రకాష్‌రెడ్డి, పనబాకలక్ష్మి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సదాశివరావు, నరేశ్, తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, టిటిడి సివిఎస్ఓ మణికంఠచందోలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీమన్నారాయణుడుగా సూర్యప్రభపై మలయప్ప

**తిరుమల,ఫిబ్రవరి 4ప్రభాతవార్తప్రతినిధి:** మాఘమాసనసప్తమితిధిన సూర్యజయంతి పురస్కరించుకుని మంగళవారం ఉదయం సప్తగిరీశుడు సూర్యప్రభవాహనంపై శ్రీమన్నారాయణుడిగా భక్తులను కటాక్షించాడు. ఏడాదిలో తొమ్మిది రోజులు బ్రహ్మోత్సవాలు జరిగితే సూర్యజయంతిన ఒకేరోజు ఏడు వాహనాలపై శ్రీనివాసుడు దర్శనమివ్వడం ప్రత్యేకత. మంగళవారం ఉదయం 5.30గంటలకు మలయప్ప స్వామిని ఆనంద నిలయంలో కొలువు దీరిన శ్రీమన్నారాయణుడిగా అలంకరించిన అర్చకులు వాహనమండపం వద్ద సూర్యప్రభవాహనంపై కొలువుదీర్చారు. అర్చకులు కర్పూర హారతులిచ్చి అనంతరం వాహనం కదిలింది. సూర్యనారాయణుడు సూర్యప్రభామధ్యస్తుడై దివ్యకిరణకాంతుల్లో ప్రకాశిస్తూ భక్తులను ఆరోగ్యవంతుల్నిచేస్తూ దర్శనమిచ్చాడు. ముందురోజురాత్రి నుండి దేవుని దర్శనం కోసం నిరీక్షించిన భక్తులకు ఒక్కసారిగా దర్శనం కలగడంతో గోవింద నామస్మరణలతో మాఢవీధులు మారుమోగాయి. సప్తఅశ్వవాహనంతో రూపొందించిన సూర్యప్రభవాహనంపై శ్రీమలయప్ప స్వామి కన్నులవిందుగా భక్తులకు అభయమిచ్చాడు. మాఢవీధుల్లో స్వామివారికి భక్తులు కర్పూరహారతులిచ్చి గోవిందా... వేంకటరమణ గోవిందా అంటూ నామస్మరణలతో తన్మయత్వం పొందారు.సూర్యుడు సకలరోగ నివారకుడు. ఆరోగ్యకారకుడు. ప్రకృతికి చైతన్యప్రదాత, ఔషధీపతిఅయిన



చంద్రుడుకూడా సూర్యతేజంవల్లనే ప్రకాశిస్తూ వృద్ధి పొందుతున్నారు. ఈ వాహనంలో స్వామివారి చుట్టూ ఉన్న సూర్యప్రభ సకల జీవుల చైతన్యప్రభ.సూర్యమండల మధ్యవర్తి శ్రీమన్నారయణుడే. తొలివాహనసేవలో పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు.

టిటిడి ఇఓ శ్యామల రావు దంపతులు, అదనపు ఇఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఇఓ లోకనాథం. ఆలయ పేష్కార్ రామకృష్ణ, బోర్డు సభ్యులు జ్యోతులనెహ్రూ, ఎంఎస్ రాజు, భానుప్రకాష్‌రెడ్డి, పనబాకలక్ష్మి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సదాశివరావు, నరేశ్, తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, టిటిడి సివిఎస్ఓ మణికంఠచందోలు పాల్గొన్నారు.

# రథసప్తమివేళ శ్రీవారిసేవలో న్యాయమూర్తులు

**తిరుమల,ఫిబ్రవరి 4ప్రభాత వార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో ఆద్యంతం సూర్యజయంతివేళ తనదైన సంతోషంగా ఊరేగిన మలయప్పస్వామి ఉత్సవమూర్తులను సామాన్యభక్తులేగాక న్యాయ మూర్తులు కూడా దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విఆర్‌కె



కృపాసాగర్, చెన్నై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కెఆర్ శ్రీరామ్, తెలంగాణా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇవి వేణుగోపాల్ కుటుంబంతో కలసి తిరుమలకు చేరుకున్నారు. ఉదయం ఉదయం విఐపి బ్రేక్‌లో స్వామివారిని దర్శించుకున్నారు. కుటుంబసమేతంగా ఆలయంవద్దకు విచ్చేసిన వీరికి టిటిడి అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. తొలుత ధ్వజస్తంభానికి మొక్కుకున్న న్యాయమూర్తులు ఆనందనిలయంలోనికి చేరుకుని శ్రీవేంకటేశ్వం స్వామివారిని దర్శించుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. రథసప్తమిన స్వామివారిని దర్శించుకోవడం ఆనందం వ్యక్తం చేశారు.

# లక్షలాదిమంది భక్తులకు సంతృప్తికర సేవలు

## - రథసప్తమి విజయవంతంపై ఇఓ,అదనపు ఇఓ

**తిరుమల,ఫిబ్రవరి 4ప్రభాతవార్తప్రతినిధి:** ఏడాదిలో మాఘమాసం సప్తమితిధిన ఏడుకొండలదేవుడు ఒకేరోజు ఏడువాహనాలపై దర్శనమివ్వడం విశేషం. ఇందుకోసం రెండులక్షలమంది భక్తులు అనేక రాష్ట్రాల నుండి తిరుమలకు తరలివచ్చారు. ఈ వాహనసేవల వీక్షణకు వచ్చిన



మాఢవీధుల్లో నిరీక్షించిన అశేషమందిభక్తులకు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఓ శ్యామలరావు, అదనపు ఇఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ అధికారులు, బోర్డుసభ్యులు,పోలీసు యంత్రాంగం శ్రీవారిసేవకులు నిరంతరాయంగా అదనపు సేవలు అందించడం అభినందనీయమని టిటిడి అధికారులు కొనియాడారు.రథసప్తమి ప్రశాంతంగా విజయవంతం కావడంలో ఉద్యోగులు, పోలీసులు, శ్రీవారి సేవకులు భక్తులకు చేసిన విశేష సేవలు ప్రశంసించారు. అందరూ అన్ని విభాగాలు సమ న్వయం చేసుకుని రథసప్తమినివిజయవంతం చేశారని మంగళవారం సాయంత్రం మీడియాతో తెలిపారు. నాలుగుమాఢవీధులలోని గ్యాలరీలలో వేచివున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాణ్యమైనఅన్నప్రసాదాలు పంపిణీచేయడం జరిగిందన్నారు. వాహనసేవలు దర్శించుకుని తిరిగి వెలుపలకు వెళ్ళేలా భక్తులు అసౌకర్యం గురికాకుండా నిర్దేశిత మార్గాల ద్వారా సిబ్బంది,పోలీసులతో శ్రీవారి సేవకులు సమన్వయంతో వ్యవహరించారన్నారు. ముఖ్యంగా తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, టిటిడి సివిఎస్ఓ మణికంఠచందోలు మాఢవీదులు, తిరుమల అంతటా తిరుగుతూ సమన్వయంతో వ్యవహరించాల్సిన తీరుపై పర్యవేక్షించారు.

వార్త

పరిపూర్ణమైన మనసుతో కలిసి పని చేయాలన్నదే జీవితం సూచించే అంశం. మనస్సు ఏకాగ్రతతో పని చేసినప్పుడే ఏకైక లక్ష్యం సిద్ధిస్తుంది.

న-విలియం జేమ్స్


# విద్య ఎవరి పరం?

నిధులు, విధుల కోసం కొట్లాడిన తెలంగాణకు ఇప్పుడు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ విసి నియామకాలు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల నియామకానికి సంబంధించి విడుదల చేసిన మార్గదర్శకాలను వ్యతిరేకించే పరిస్థితి ఎదురైంది. కొత్తమార్గదర్శకాలను బట్టి నిధులు ఇవ్వడంలో మీనమేషాలు లెక్కించే యుజిసి ఉన్నత విద్య నియామకాలపై ఆంక్షలు పెట్టడం సమంజసంగా లేదనే అభిప్రాయాన్ని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తంలు వ్యక్తం చేస్తున్నారు. యుజిసి ముసాయిదా ప్రకారం వర్సిటీల స్వతంత్రత దెబ్బతింటుందని విద్యావేత్తలు భావిస్తున్నారు. సమాఖ్య స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరించడం యుజిసికి తగదని చెప్పారు. ఈ మార్గదర్శకాల ముసాయిదాపై కేరళ, తమిళనాడు రాష్ట్రాలు కూడా వ్యతిరేకిస్తున్నాయి. యుజిసి ప్రతిపాదిత ముసాయిదాను అమల్లోకి వస్తే వర్సిటీల వైస్ ఛాన్సలర్ నియామకాల్లో రాష్ట్రాలకు ఫ్లాంటి నియంత్రణ అధికారం ఉండదు. కేంద్రం ఎవరినైనా నియమించవచ్చు. గ్రాడ్యుయేషన్, పీజీల్లో ఏ సబ్జెక్టు చదివినా, నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్‌లో అర్హత సాధించిన సబ్జెక్టుతో ప్రొఫెసర్ పోస్టులకు అర్హత పొందే అవకాశం ఇస్తే వారి బోధన సరైన స్థాయికి ఉండదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. యుజిసి తీరు ఇతర రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా ఇబ్బంది కలిగించే విధంగా ఉన్నందున అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు రాసేందుకు సమాయత్తమవుతున్నారు. యుజిసి కొత్త విద్యా విధానం 2020 కొత్త మార్గదర్శకాలను అమలు ఆధారంగా ఉన్నత విద్యాసంస్థలకు గ్రేడింగ్‌ని అందజేస్తాయి. ఇది సమాఖ్య స్ఫూర్తికి పూర్తి వ్యతిరేకం కాబట్టి అనేక రాష్ట్ర ప్రభుత్వాలు దీనిని వ్యతిరేకిస్తున్నాయి. విద్యపై రాష్ట్ర ప్రభుత్వమే 85 శాతం వ్యయపరుస్తోంది. అలాంటప్పుడు రాష్ట్ర విశ్వవిద్యాలయాలను కేంద్ర ప్రభుత్వం నియంత్రణలో ఉంచాలనుకోవడం సరైన పద్ధతి కాదు. ఈ మార్గదర్శకాలు రాష్ట్ర విద్యావ్యవస్థకు విరుద్ధంగా ఉన్నాయన్న విషయం ఈపాటికేవన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకిస్తున్నాయి. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రవేశాలకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష గ్రామీణ, ఆంగ్లేతర మాధ్యమ విద్యార్థులకు సీట్లనివ్వ నిరాకరిస్తే అది పెద్ద సంక్షోభానికి దారితీస్తుంది. విద్యార్థుల పాలిట నాలుగు సంవత్సరాల డిగ్రీ ఒక భారం మాత్రమే. బహుళ ప్రవేశ, నిష్క్రమణ వ్యవస్థలు విద్యార్థుల భవిష్యత్తును నష్టం చేయగలవు. ఉపాధ్యాయులకు లెక్కకు మించిన క్రమశిక్షణా చర్యలు వారిలో నైపుణ్యాన్ని తగ్గించగలవు. వైస్ ఛాన్సలర్లుగా బయట నిపుణులను నియామకం చేస్తే వ్యవస్థ వినాశనానికి దారితీస్తుంది. ఎందుకంటే రాజకీయ నాయకులు విశ్వవిద్యాలయ క్యాంపస్‌లలో ప్రవేశించి వారి ధోరణిలో వారు ప్రసంగించడం, రాజకీయ ప్రస్తావనలు వలనవిద్యా సంస్థలను కలుషితం చేయవచ్చు. ఇలాంటి ప్రతిపాదనలు విశ్వవిద్యాలయాల విద్యా నైపుణ్యాన్ని నాశనం చేస్తాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు బోధనేతర సంఘాలు కొత్త మార్గదర్శకాలతో నష్టపోతాయి. యుజిసి కొత్త మార్గదర్శకాలలో చెప్పుకోదగిన ప్రతికూలతలున్నాయి. ఇంతవరకు నడచిన విద్య విధానాలలో కేవలం అకడమిక్ అర్హతలున్న వారినే వైస్ ఛాన్సలర్‌గా ఎంపిక చేసేవారు. కొత్త ప్రతిపాదనలను బట్టి చూస్తే ఎంతో అత్యంత ప్రధానమైన ఈ పదవికి విద్యావేత్తలు కానక్కర్లేదు. విద్యార్హతలు లేనివారిని కూడా నియమించుకోగల అవకాశంఉంది. యూనివర్సిటీల ఛాన్సలర్‌లుగా గవర్నర్లను నియమించరాదని జస్టిస్ మదన్ మోహన్ పూంచి కమిటీ నిర్దేశించింది. కానీ దానికి భిన్నంగా విసిల నియామక కమిటీ ఛైర్పర్సన్ నియామకానికి గవర్నర్‌కు అధికారమిచ్చారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వాదినేతకు గవర్నర్‌కు సఖ్యత లేక తమిళనాడులో చాలా యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చివరికి వారి వివాదం సుప్రీం కోర్టు వరకు వెళ్లింది. ఇలాంటి పరిస్థితే గతంలో తెలంగాణలో కూడా ఉండేది. ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు రాష్ట్రంలో విద్యావ్యవస్థ కుప్పకూలిపోతుంది. కేంద్ర ప్రభుత్వజోక్యం ఎక్కువయ్యే పరిస్థితి ఉంటుంది. ఇక కాంట్రాక్టు టీచర్ల విషయానికొస్తే ఇంతవరకు ఉన్న పది శాతం నియామక నిబంధనకు నీళ్ళొదిలేశారు. ఇలాంటి నిబంధనలతో యుజిసి ముసాయిదాను యూనివర్సిటీ, కాలేజీ టీచర్ల సంఘాల సమాఖ్య పూర్తిగా వ్యతిరేకిస్తోంది. ఎన్నో నిబంధనలు విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా ఉన్నందున యుజిసి ప్రతిపాదనలను ఉపసంహరించుకోవడం మేలు. కాలేజీ టీచర్ల నియామకాలు, ప్రమోషన్‌లకు నిర్దేశించిన విధానాలు, విద్యా ప్రమాణాలు నిర్వహణ కోసం చేపట్టాల్సిన చర్యలపై ఫిబ్రవరి 5 లోగా అభిప్రాయాలు తెలపాలని కోరుతున్న యుజిసి ప్రతిపాద నలపై ఉన్నత విద్యావేత్తలు పెదవి విరుస్తున్నారు. ఆ నిర్ణయాలు ఏవీ ఉన్నత విద్యా ప్రమాణాలు పెంచేవి కావని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కొత్త ముసాయి దాను బట్టి ఉన్నత విద్యా నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం నుంచి తప్పించా లన్నదే యుజిసి ఆలోచనగా కనపడు తోంది. అకడమిక్ పర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ఆధారంగా టీచర్లు పనితీరు లెక్కించే విధానం ఉండేది. అలాగే ప్రమోషన్లు కూడా. తాజా నిబంధనల్లో ప్రతిభ ఆధారిత ప్రమోషన్ల విధానం ఆహ్వానించదగినదే! కాగా అందు కోసం రూపొందించిన సంక్లిష్టమైన విషయాలపై విద్యా వేత్తలు, మేధావుల సంఘాలతో చర్చించి నిర్ణయించడం మేలు! ఈ నిబంధనలు కొత్తగా ఉద్యోగాల్లోకి చేరే వారికి సమంజసం కాదని టీచర్ల సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.



అభిప్రాయాలు మార్చుకోలేని వ్యక్తి తన తప్పుల్ని సరిదిద్దుకోలేడు. నేటి కంటే రేపు ఎక్కువ వివేకం ప్రదర్శించాలనుకుంటే మనిషిలో మార్పు అవసరం.

ఎడ్వర్డ్



ఇతరుల పట్ల మీకున్న విశ్వాసం, అవిశ్వాసం అన్నవి మీ పట్ల మీకున్న ఆత్మవిశ్వాసం అపనమ్మకం అనే అంశాలకు సంబంధించి ఉంటాయి.

ఖలీల్ జిబ్రాన్

## ప్రజావాక్కు



### ఈసారి కూడా నిరాశే!

కేంద్ర ప్రభుత్వం గత శనివారం పార్లమెంటులో 2025-26 సంవత్సరానికి ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో ప్రైవేటు రంగం పి.యస్.యుసంస్థల్లో దశాబ్దాలుగాపనిచేసి పదవీ విరమణపొందిన ఉద్యోగులకు వర్తించేఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్1995 (ఇ.పి.యస్95) పథకం కింద వచ్చే పెన్షన్ 7500కు పెంచేప్రకటన ఆర్థికశాఖమంత్రి నిర్మలా సీతారామన్‌ప్రకటిస్తారని దేశవ్యాప్తంగా పెన్షన్ దారులు అంతా ఎంతో ఆశతో ఎదురుచూసారు. వేతనజీవులకు మాత్రమే కొంతఊరట కల్పించి పెన్షన్ దారుల విషయంలో ఏ విధమైన ప్రకటన లేకుండా చేతులు దులుపుకుంది. ఈసారి కూడా బడ్జెట్‌లో మినిమమ్ పెన్షన్ పెంపు ప్రకటన రాకపోవటంతో పెన్షన్‌దారులు అంతా చాలా నిరాశ చెందుతున్నారు. ఈ మధ్యకాలంలో కొన్ని రాష్ట్రాల్లో ఆ రాష్ట్ర ప్రభుత్వం ఏ చదువు,ఉద్యోగం చేయని వారికి నెలకు నాలుగు వేల రూపాయలు వృద్ధాప్య పింఛన్లు ఇస్తున్నాయి.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### చేతివృత్తులకు ఆర్థిక సహాయం

మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రధాన పథకాలలో పీఎంవి స్వనిధి కూడాఒకటి.చిరువ్యాపారులకు ఇది కల్పవృక్షంలాగా ఉంటుంది.ఈబడ్జెట్‌లో కూడా దీనికి అధిక నిధులు కేటాయించడం చిన్నవ్యాపారులకుబాసటగా ఉంటున్నది. దేశంలో ఈ పథకంకింద ఇప్పటికే 6.8మిలియన్ల మంది విధి వ్యాపారులు ఈపథకం కింద లబ్ధిపొందుతున్నారు. పట్టణ ప్రాంతాలలో ఉన్న ఇన్ ఫార్మల్ రంగం వారు చేతి వృత్తులు చేపట్టే వారికి ఆర్థిక సహాయం చేయ డం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఇక అంత మాత్రమే కాదు వీరికి జీవిత బీమా కూడా వర్తింప చేస్తే ఈ పథకం ఒక గేమ్ చేంజర్ అవుతుంది.

- భారత అవినాష్, జనగామ

### భారత రత్నగోల

బ్యాంకుల్లో కానీ పేరున్న మంచిసంస్థల్లోకానీ పెద్ద హోదాలో పనిచేస్తున్న వారు తమ పలుకుబడిని, పరపతిని ఉపయోగించి తమ వారుసులకి ఉద్యోగం ఇప్పించుకోవటమనేది గతంలోబాగా జరుగుతుండేది.అవార్డుల విషయంలోనూ ఇప్పుడు అలానేజరుగుతోంది.దేశానికి ఎంతగొప్ప సేవ చేసినవారికి ఇచ్చే భారతరత్న అవార్డును ఇవ్వాలంటూ కొందరు చాలా ప్రయత్నం చేస్తున్నారు.

-మిథునం, హైదరాబాద్

### పరిష్కారం కాని కేసుల పరిస్థితి ఏమిటి?

తిరుపతిలో తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన న్యాయ విచారణ కమిషన్‌విచారణ వలన ఏమైనా ప్రయోజనం ఆశించవచ్చా? ఇప్పటికే కల్తీ నెయ్యిపై జరిగిన దర్యాప్తు పరిస్థితి తెలియదు.అలాగే గతంలో పింక్‌డైమండ్ పోయిందని, దానిపై పలుఆరోపణలు చోటుచేసుకోవడం, పరువునష్టం దావా న్యాయస్థానం విచారణలో కొనసాగుతోంది?ఇవేకాకుండా టిటిడి నమోదు చేయించిన పలు కేసులు సంవత్సరాల తరబడి పరిష్కారానికి నోచుకోవడం లేదు! మరి ఇలాంటి విచారణలు ఎవరిని మభ్య పెట్టడానికి? తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి పెండింగ్‌లో ఉన్న కేసులు, దర్యాప్తులు, విచారణల స్థితి గతులతో ఓ శ్వేత పత్రం విడుదల చేయాలి. అలాగే వాటిని ఎప్పటిలోగా పరిష్కరిస్తారో కూడా ప్రజలకు చెప్పాలి! భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా పాలక మండలి పూర్తి పారదర్శకంగా పని చేస్తేనే విలువ, గౌరవం పెరుగుతుంది!

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### ప్రభుత్వ బడులను మెరుగుపరచాలి

ఇటీవల జరిగిన సర్వేలో పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ బడుల్లో కన్నాచాలా తక్కువ కనిపించింది. ప్రభుత్వపాఠశాలల్లో ఒకటవ తరగతి ప్రవేశాలు తక్కువగాఉన్నాయి. కారణాలెన్నో అయినా ప్రభుత్వం ప్రభుత్వ బడులను ఇంకా మెరుగు పరచాలి. ఇచ్చట రాయితీలున్న, బోధన,నాణ్యత, అజమాయిషీ ఇంకా పెరగాలి. బిడ్డల వయస్సు ప్రకారం అందరూ ప్రవేశానికి ప్రభుత్వ యంత్రాంగం, సామాజిక కార్యకర్తలకు పిలుపు నివ్వాలి. ఉత్తమ ప్రభుత్వ పాఠశాల్లో ఫలితాలను చెప్పాలి. మెరుగైన ఫలితాలు ఏ తరగతి గదిలో వారైనా కృషి ప్రధానం. మనం ఎన్నుకున్న ప్రభుత్వ ప్రయత్నాలకు మనసారా కృషి చేయాలి. వీలయితే ఖాళీ సీట్లు ఉన్నాయని పత్రిక ప్రకటన ఇవ్వొచ్చు.

-బొల్లోజు మెఘనాథం విశాఖపట్నం

### పేరు, ఫొటోలతో పనేంటి!

మాజీ ప్రధాన మంత్రి పేరుమీద పేదవారికి ఇండ్లు ఇవ్వకూడదట. బియ్యం, పప్పుదినుసులు చౌకగా లభించే రేషన్ దుకాణాల్లో ప్రస్తుత ప్రధాని ఫొటో ఉండి తీరాల్సిందేనట. లేదంటే మేం ఒక్క రూపాయి కూడా ఇచ్చేది లేదని అంటున్నారు. ఇలా అంటున్న వారికి కావలసింది మోడీకి మంచి పేరు రావడం బిజెపికి ప్రచారం లభించడం అంతేకాని ప్రజలకు మంచి జరగటం వీరికి అవసరం లేదు.ఎవరి ఫొటోలు ఉంటే ఏంటటా!

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# క్లీన్ ఎనర్జీ దిశగా భారత్ అడుగులు

**శిలాజఇంధనాల కంటేచాలా సురక్షితమైనది కావడం అణుశక్తి మరో ముఖ్యమైన ప్రయోజనం. ప్రపంచవ్యాప్తంగా సంభవించే ప్రతి ఐదుమరణాలలో ఒకటి వీటిఉద్గారాల కారణంగా సంభావిస్తాయంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఒక్క 2018లోనే, శిలాజ ఇంధనాలు ప్రపంచవ్యాప్తంగా 8.7మిలియన్ల మంది ప్రాణాలను హరించాయి. 70 సంవత్సరాలలో, కేవలం 1979 నాటి త్రీమైల్ ఐలాండ్ ప్రమాదం, 1986 చెర్నోబిల్ విపత్తు 2011లో సంభవించిన ఫుకుషిమా అణు విపత్తు మాత్రమే ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాయి. ఏదేమైనప్పటికీ అణుశక్తి సామర్థ్యంగల తొమ్మిది దేశాలలో ఒకటైన భారత్, విశ్వశాంతిని కాంక్షించే దేశంగా వసుధైక కుటుంబం అన్న భావనకు నిదర్శనంగా నిలవాలి.**

యేచన్ చంద్ర శేఖర్

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థల పారిశ్రామికీకరణ ప్రధానంగా బొగ్గు, సహజ వాయువు, పెట్రోలియం వంటి శిలాజ ఇంధనాల ద్వారా సాధ్యమైంది. ఇటీవలి సంవత్సరాలలో మాత్రమే ప్రపంచ దేశాలు సౌర పవన శక్తి వంటి ప్రత్యామ్నాయ, పునరుత్పాదక వనరులకు తెరలేపాయి. 1950లలో వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించిన అణు విద్యుత్ కేంద్రాలు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలకు శిలాజ ఇంధనాల కంటే చాలా తక్కువ కాలుష్య కారకాలను వెదజల్లే ప్రత్యామ్నాయ విద్యుదుత్పత్తి అవకాశాన్ని అందించాయి. 1970లలో తలెత్తిన ఇంధన సంక్షోభం ఆకాశాన్నంటిన చమురు ధరల నేపథ్యంలో మరిన్నిదేశాలు అణువిద్యుత్ కార్యక్రమాలను ప్రారంభించాలని నిర్ణయించుకోవడంతో ప్రపంచవ్యాప్తంగా 1970 నుండి 1985 మధ్యకాలంలో చాలా రియాక్టర్లు నిర్మించబడ్డాయి. నేడు, అణుశక్తి ప్రపంచ ఇంధన డిమాండ్‌లో దాదాపు 10 శాతం తీరుస్తోంది. 32 దేశాలలో ప్రస్తుతం 439 అణువిద్యుత్ కేంద్రాలు పనిచేస్తుండగా దాదాపు 55 కొత్త రియాక్టర్లు నిర్మాణంలో ఉన్నాయి. 2020లో, 13దేశాలు తమ మొత్తం విద్యుదుత్పత్తిలో కనీసం 25 శాతం అణుశక్తి ద్వారా సాధించాయి. అణుశక్తి ఉత్పాదనలో ఇప్పటివరకు అమెరికా, చైనా,ఫ్రాన్స్ మార్కెట్‌లో ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. అమెరికా60శాతంశిలాజ ఇంధనాల ద్వారా 40 శాతం పునరుత్పాదక అణుశక్తిద్వారా విద్యుదుత్పత్తి చేస్తోంది. చమురు దిగుమతులను విచ్ఛిన్నం చేయాలనే అంతిమ లక్ష్యంతో ఫ్రాన్స్1970లలో తన అణు విద్యుత్ పరిశ్రమను విస్తరించనారంభించింది. ఈ చర్యభారీ పరిమాణంలో ఉద్గారాలను తగ్గించడంతో పాటు పటిష్టమైన ఆర్థిక వ్యవస్థకు దోహదం చేసింది. ప్రస్తుతం ఫ్రాన్స్ 56 ఆపరేటింగ్ రియాక్టర్లతో మొత్తం విద్యుదుత్పత్తిలో 70శాతం అణుశక్తిపై ఆధారపడుతోంది. భారత ప్రభుత్వం కూడా 2030 నాటికి మొత్తం దేశీయ విద్యుదుత్పత్తిలో 50 శాతం అణుశక్తి వంటి కార్బన్‌ఉద్గారాలను విడుదల చేయనివనరుల నుండి ఉత్పత్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగడంతో పాటు 2040నాటికి 11,000 మెగావాట్ల కొత్త అణు విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని కూడా జోడించాలని ఆశిస్తోంది. అణుశక్తి తక్కువ గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను ఉత్పత్తిచేస్తుంది కాబట్టి దీనిని స్వచ్ఛమైన శక్తి (క్లీన్ ఎనర్జీ) వనరుగా పరిగణిస్తారు. 2024-25 ఆర్థికసర్వేలో, భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థికసలహాదారు భారతదేశం తక్కువ కార్బన్ ఆర్థిక వ్యవస్థకు మారడంలో అణుశక్తి ప్రాముఖ్యతను ప్రముఖంగా ప్రస్తావించడం, ఇది ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద తక్కువ కార్బన్ విద్యుత్ వనరు కావడంతో 2047 నాటికి కనీసం 100 గిగావాట్ల అణుశక్తిని అభివృద్ధిచేయాలని భారత ప్రభుత్వం సంకల్పించింది. ఫిబ్రవరి 1న పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2025-26 వార్షిక బడ్జెట్‌లో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ రూ.20,000 కోట్లతో అణుశక్తి మిషన్ ఏర్పాటును ప్రతిపాదించారు. ఈ మిషన్ 2033 నాటికి కనీసం ఐదు స్వదేశీ చిన్న మాడ్యులర్ రియాక్టర్లను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో పరిశోధన, అభివృద్ధిపై దృష్టిసారిస్తోంది. చిన్న అణు విచ్ఛిత్తి రియాక్టర్లను కర్మాగారాల్లో అభివృద్ధి చేసి, తరువాత ఇతర ప్రదేశాల్లో స్థాపించవచ్చు. ఇవి సాధారణంగా సాంప్రదాయ అణు రియాక్టర్ల కంటే తక్కువ సామర్థ్యం కలిగి ఉంటాయి. ప్రస్తుతం, భారతదేశంలో శిలాజేతర ఇంధన వనరులనుండి చేపడుతున్న మొత్తం శక్తి ఉత్పత్తిలో అణుశక్తి వాటా కేవలం 2.49శాతం మాత్రమే. దేశంలో అణుశక్తి ఉత్పాదన నెమ్మదిగా ఉన్నప్పటికీ, బడ్జెట్ కేటాయింపుతో, వేగం పుంజుకుంటుందని నిపుణులు భావిస్తున్నారు. భారతదేశంలో అణు విద్యుత్ కేంద్రాలను నిర్వహిస్తున్న న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పీసిఐఎల్), మొదటిసారిగా భారత్ చిన్న రియాక్టర్లను



ఏర్పాటు చేయడానికి ప్రైవేట్ కంపెనీల నుండి పెట్టుబడులను ఆహ్వానించడం ద్వారా దేశ అణువిద్యుత్ రంగాన్ని వికేంద్రీకరించడానికి అధికారిక చర్యలు చేపట్టింది. ఆరు సంవత్సరాల తర్వాత, గత సంవత్సరం, గుజరాత్‌లోని ఒక అణు విద్యుత్ కేంద్రంలో 700 మెగావాట్ల సామర్థ్యం గల రెండు యూనిట్లను ప్రారంభించిన ఎన్పీసిఐఎల్ ఇప్పుడు సంవత్సరానికి ఒక అణు రియాక్టర్‌ను ప్రారంభించాలని యోచిస్తోంది. టాటా పవర్ ఈ రంగంలోకి ప్రవేశించాలని యోచిస్తున్న ప్రైవేట్ కంపెనీలలో మొదటిది కాగారిలయన్స్ ఇండస్ట్రీస్, ఎల్ అండ్ టి, అదానీ గ్రూప్, వేదాంత కూడా అణుశక్తిలో పెట్టుబడులకు యోచిస్తున్నట్లు సమాచారం. ఈ రంగంలో ప్రైవేటు భాగస్వామ్యం వలన సాంకేతికపురోగతి, కార్యాచరణ సామర్థ్యం పెంపు, ఉత్పాదక ఖర్చుల తగ్గింపు, భద్రతా ప్రమాణాలను మెరుగు, అధిక మూలధన అవకాశం, భారీ అణుప్రాజెక్టుల ఆర్థిక సవాళ్ల పరిష్కారం, పోటీతత్వం, ఉత్తమ పద్ధతుల అమలు, అత్యాధునిక సాంకేతికత పరిజ్ఞాన లభ్యత, ఉపాధి అవకాశాలు లాంటివి సానుకూల అంశాలు. కాగా, ఖర్చులను తగ్గించే విధానాల కారణంగా భద్రతా ప్రమాణాల రాజీవలన ప్రమాదాలకు ఆస్కారం, సున్నితమైన అణు సాంకేతిక పరిజ్ఞానాల నిర్వహణలో జవాబుదారీతనం, పారదర్శకత లోపించడం, ప్రైవేట్ భాగస్వామ్యం వలన కీలకమైన జాతీయ మౌలిక సదుపాయాలపై విదేశీ యాజమాన్యం, నియంత్రణ,పరిమితనియంత్రణ, లాభదాయకతపై దృష్టి కారణంగా పర్యావరణ పరిరక్షణ, కార్మికుల భద్రత అణుశక్తి దీర్ఘకాలిక స్థిరత్వంపై రాజీ పడే అవకాశం లాంటివి ప్రతికూలాంశాలు. దాదాపు సున్నా కార్బన్ డయాక్సైడ్ లేదా ఇతర గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను ఉత్పత్తి చేయని కారణంగా అణుశక్తిని తరచుగా క్లీన్ ఎనర్జీ టెక్నాలజీ అని పిలుస్తారు. ఇతర పద్ధతుల ద్వారా శక్తి ఉత్పత్తి కోసం శిలాజ ఇంధనాలను కాల్చడం ద్వారా వెలువడే కాలుష్య కారకాలను అణుశక్తి ఉత్పత్తితో నిరోధించవచ్చు. ఇది యురేనియం అణువులను విభజించి విచ్ఛిత్తి ప్రక్రియ ద్వారా శక్తిని ఉత్పత్తి చేస్తుంది. విచ్ఛిత్తి ద్వారా విడుదలయ్యే వేడిని ఆవిరిని సృష్టించడానికి ఉపయోగిస్తారు. ఇది శిలాజ ఇంధనాల ద్వారా విడుదలయ్యే హానికారకమైన ఉప ఉత్పత్తులు లేకుండా విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి టర్బైన్‌ను తిరిగేలా చేస్తుంది. బొగ్గు, చమురు లేదా గ్యాస్ విద్యుత్ ప్లాంట్ల మాదిరిగా అణు విద్యుత్ ప్లాంట్లు విద్యుత్ ఉత్పాదన సమయంలో కార్బన్ డై ఆక్సైడ్ ను ఉత్పత్తి చేయవు. ప్రపంచంలోని కార్బన్ రహిత విద్యుత్తులో మూడింట ఒక వంతు విద్యుత్తు అణు రియాక్టర్ల ద్వారా ఉత్పత్తి కావడమే కాకుండా వాతావరణ మార్పు లక్ష్యాలను చేరుకోవడంలో కూడా కీలక భూమికనిర్వహిస్తాయి. ఉద్గారాలను తగ్గించడంలో ఫ్రాన్స్ సాధించిన విజయాన్ని అణుశక్తి ప్రధాన అనుకూలాంశానికి స్పష్టమైన ఉదాహరణగా పేర్కొనవచ్చు. అణుశక్తి శుభ్రంగా ఉండి గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను విడుదల చేయకుండా కాలుష్యరహిత శక్తిని అందిస్తుంది. చాలామంది భావిస్తున్నట్లుగా కాకుండా, అణు కర్మాగారాలలోని శీతలీకరణ టవర్లు నీటి ఆవిరిని మాత్రమే విడుదల చేయడంతో వాతావరణంలోకి ఎటువంటి కాలుష్యకారక లేదా రేడియోధార్మిక పదార్థాలు విడుదల కావు. ప్రస్తుతం విశ్వవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అన్ని శక్తి ప్రత్యామ్నాయాలతో పోలిస్తే, అణుశక్తి నిజానికి అత్యంత పరిశుభ్రమైన వనరులలో ఒకటి. అణుశక్తిని గ్రీన్‌సోర్స్ ఆఫ్ ఎనర్జీగా వర్గీకరించడం ద్వారా యూరోపియన్ కమిషన్ ఇటీవల అణుశక్తిపై స్పష్టమైన వైఖరిని తీసుకుంది. అణు రియాక్టర్ల నుండి వచ్చే అత్యంత రేడియోధార్మిక విషపూరిత ఉప ఉత్పత్తులు పదివేల సంవత్సరాల పాటు రేడియోధార్మికతను కలిగి ఉంటాయి. అయినప్పటికీ, వాతావరణ మార్పు కంటే కూడా దీనిని చాలా సులభంగా పరిష్కరించగల పర్యావరణ సమస్యగా పరిగణిస్తారు. దీనికి ప్రధాన కారణం ఏమిటంటే, అణుశక్తిఉత్పత్తి ద్వారా ఉత్పత్తి అయ్యే అణువ్యర్థాలలో 90శాతం వరకు పునర్వినియోగించవచ్చు. శిలాజఇంధనాల కంటేచాలా సురకితమైనది కావడం అణుశక్తి మరో ముఖ్యమైన ప్రయోజనం. ప్రపంచవ్యాప్తంగా సంభవించే ప్రతి ఐదుమరణాలలో ఒకటి వీటిఉద్గారాల కారణంగా సంభావిస్తాయంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఒక్క 2018లోనే, శిలాజ ఇంధనాలు ప్రపంచవ్యాప్తంగా 8.7మిలియన్ల మంది ప్రాణాలను హరించాయి. 70 సంవత్సరాలలో, కేవలం 1979 నాటి త్రీమైల్ ఐలాండ్ ప్రమాదం, 1986 చెర్నోబిల్ విపత్తు 2011లో సంభవించిన ఫుకుషిమా అణు విపత్తు మాత్రమే ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాయి. ఏదేమైనప్పటికీ అణుశక్తి సామర్థ్యం గల తొమ్మిది దేశాలలో ఒకటైన భారత్, విశ్వశాంతినికాంక్షి ంచే దేశంగా వసుధైక కుటుంబం అన్న భావనకు నిదర్శనంగా నిలవాలి. ●

# రూపాయి పతనాన్ని ఆపలేరా..!

మేకిరి దామోదర్

అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత్ రూపాయి మారకపు విలువ భారీగా పతనం అవుతోంది. గతంలో ఎన్నడు లేని విధంగా రూపాయి విలువ ఆల్‌టైం కనిష్టానికి పడిపోయి, రూ.87.29 క్షీణించి పాతాళానికి పడిపోయింది. ఇంతేకాదు రూపాయి పతనం ఇంకా ఉందనే ఆందోళన వ్యక్తం అవుతుంది. ఈ ప్రభావం ఇప్పటికే వివిధ రంగాలపై కనిపిస్తుంది. విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు ఫీజులు ఖర్చులు నిమిత్తం గతంలో కంటే అధికమొత్తంలో చెల్లించాల్సి వస్తుంది, తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. నిత్యవసర వస్తువుల ధరలు మండిపోతున్నాయి. స్టాక్ మార్కెట్లు కుదేలవుతూ లక్షల కోట్లమేర మదుపర్ల సంపద ఆవిరి అయిపోతుంది. దిగుమతులు ఖరీదైపోతున్నాయి. ఈపరిస్థితి ఎంత కాలం ఉంటుందనే విషయాన్ని ఆర్థిక నిపుణులు అంచనా వేయలేకపోతున్నారు. అమెరికా అధ్యక్షుడు బాధ్యతలు తీసుకున్న వెంటనే ట్రంప్ ప్రకటిస్తున్న నిర్ణయాలు, విధానాల వల్ల డాలర్ ఇంకా బలపడి వర్ధమాన దేశాల కరెన్సీలు బలహీనపడే పరిస్థితి ఉందని చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధర పెరుగుతుంది. దీనివల్ల దిగుమతులు భారం అధికమై దేశానికి ఆర్థికలోటు తీవ్రమోతుంది. రూపాయి విలువ క్షీణించడానికి మరో కారణం ఆర్థిక పరిస్థితుల్లో ద్రవ్యోల్బణం పెరగడంతో కార్పొరేట్ సంస్థల ఆదాయాలు లాభాలు తగ్గుతున్నాయి. ఆర్థిక కార్యకలాపాలు మందగించి ఉద్యోగాల్లో కోత, సరుకుల సరఫరా తగ్గడం వంటి సవాళ్లు ఎదురు అవుతున్నాయి. ఇవన్నీ రూపాయి విలువపడిపోవడానికి దోహదపడుతున్నాయి. అమెరికా డాలర్ విలువ రూపాయితో పోల్చితే ఈ సంవత్సరానికి90కి వరకు చేరిన ఆశ్చర్యపడాల్సింది లేదని నిపుణులు పేర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడమే దీనికి పరిష్కారం అని నిపుణులు సూచిస్తున్నారు. రూపాయి బలపడినప్పుడేఇబ్బందులు తగ్గుతాయని, ధరల్లో స్థిరత్వం సాధించవచ్చని వివరిస్తున్నారు. అంతర్జాతీయ ద్రవ్యమార్కెట్లో రూపాయివిలువ భారత కరెన్సీ చరిత్రలోనే అత్యంత కనిష్ట దశకు పతనమవుతోంది. అమెరికన్ డాలర్‌తో పోలిస్తే 87.29 కనిష్ట స్థాయికి దిగజారింది. 2015 66.15/ 2016,67.93/ 2017 63.87/2018,69.77/ 2019,71.38/2020,73.07/ 2021,74.34/ 2022,82.74/ 2023,83.21/2024, 84.70/ డిసెంబర్ 3 దాక. ఆధారం లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు. తాజాగా 3,జనవరి, 2025న, రూ. 87.29పాతాళానికి దిగజారింది.ఎగుమతుల కన్నా దిగుమతులు ఎక్కువగా ఉండడం, కరెంటు ఖాతా లోటు, ముడి చమురు ధరలు పెరుగుదల తదితర అంతర్జాతీయ, దేశీయంగా ఆర్థిక క్రమశిక్షణ లేమి. దుబారా పెరిగిపోవడం ఎగుమతులు పెంచి దిగుమతులు తగ్గించుకోవడంలో పాలన విధానంలో చిత్తశుద్ధి లేకపోవడం లాంటి తదితర విధానాల మూలంగా రూపాయి పతనానికి దారితీస్తుంది. మన దేశ జనాభాలో 60శాతం,35ఏళ్ల లోపువారే. ఈ యువశక్తిని జనాభాలో సగభాగమైన మహిళా శక్తిని నిపుణ వనరులుగా తీర్చిదిద్ది ఉపాధి,ఉద్యోగ అవకాశాలు కల్పించబడాలి.అలా దేశ ఉత్పాదక శక్తి పెంచుకోవడం వల్ల ప్రగతికిదారులు పడతాయి. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా మారబోతుందన్న సర్కారీ ప్రచారంతోడు జీడీపీ మెరుపులకు సమాంతరంగా జనం బతుకుల్లో వెలుగులు నింపాలి.అంటే ఉపాధి సహిత అభివృద్ధి జరగాలి. మన దేశం వ్యవసాయ ఆధారిత జనాభా 60శాతంకు పైగా ఉంటారు. అందువల్ల వ్యవసాయం,పారిశ్రామిక రంగాల్లో సంపన్న దేశాలతో పోటీపడి అభివృద్ధిని సాధించాలి. అతిప్రధానంగా దిగుమతులపై దృష్టిసారించి, ఆయా దిగుమతుల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించి ఎగుమతులు చేసే స్థాయికి చేరుకునే విధానాలు రూపొందించాలి.మన దేశంలో అవినీతి,నిర్లక్ష్యం సమూలంగా నిర్మూలించబడాలి. దేశ సంపద గుప్పెడు మంది చేతుల్లో కేంద్రీకృతం కాకుండా చేస్తూ, సమంగా పంచబడినప్పుడే సమ్మిళిత ప్రగతి సాధ్యపడుతుంది. అలాంటి చిత్తశుద్ధితో కూడిన విధానాలు అమలు చేయాలి. ప్రజాస్వామ్య దేశంలో బహుళ పార్టీల పాలన విధానంలో అధికార దాహంతో దేశ ఆర్థిక పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా ఓటు బ్యాంకు పథకాలకు చరమగీతం పాడాలి. ●

# డొనాల్డ్ ట్రంప్ అనాలోచిత చర్య!

కనుమ ఎల్లారెడ్డి

ఇటీవల 47 వ అధ్యక్షుడిగా అమెరికా పగ్గాలు చేపట్టిన ట్రంప్ పలుచర్యలు తీసుకుంటున్నారు.అందులో చాలా వరకు వివాదాస్పదమైనవిగా ఉన్నాయి. దేశాలపై సుంకాలు విధించటం ప్రక్కన పెడితే, జన్మతః పౌరసత్వం కలకలం సృష్టించింది. ఫిబ్రవరి 20,2025 లోపు పిల్లలకే అమెరికా పౌరసత్వం వస్తుంది అని ఓ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. దీనిపై దుమారం చెలరేగడంతో డెమోక్రటిక్ పాలిత రాష్టాలు కోర్టుకు ఎక్కాయి. ట్రంప్ ఉత్తర్వు తాత్కాలికంగా నిలుపు చేస్తున్నాం అని ప్రకటించాయి. అమెరికా రాజ్యాంగంలో ఉన్న 14వ అధికరణం అమెరికాలో పుట్టిన పిల్లలకు పౌరసత్వం కల్పిస్తోంది. ట్రంప్‌కు విశేషమైన అధికారాలు ఉండొచ్చు. అయితే అమెరికా రాజ్యాంగం మార్చటం అంత సులభమైన పనికాదు. అయినా ట్రంప్ మొండిగా ముందుకు వెళుతున్నారు. అమెరికా, అమెరికా వాసులకే అని స్పష్టమైన ఆర్డర్ జారీ చేశారు. బాగానే ఉంది. పూర్వం నుంచి విదేశాల నుంచి వచ్చి అమెరికాలో స్థిరపడిన విదేశీయులు ఎందరో అమెరికా పౌరసత్వం కలిగి ఉన్నారు. ఉదాహరణకు భారత మూలాలు ఉన్న సునీతా విలియమ్స్ అమెరికా పతాకాన్ని రెపరెప లాడించారు.అంతేందుకు ఉపాధ్యక్షుడు భార్య ఉష, ట్రంప్ భార్య, అమెరికా అధ్యక్ష పదవికి పోటీ చేసిన డెమోక్రటిక్ నేత కమల హ్యారీస్ విదేశీయులే వారికి అమెరికా పౌరసత్వం ఉంది. అలా ఎంతో మంది అమెరికా పౌరసత్వం కలిగి ఉన్నారు. వీరి పౌరసత్వం మాటేమిటి? దూకుడు నిర్ణయాలలో ఇవి కూడా ఉండాలి. అలా ఏమి ఉండదు. అందరికీ ఒకే నిర్ణయం ఉండాలి. అమెరికా గడ్డ మీద అమెరికా వాసులే ఉండాలి అనే నిర్ణయం ఎందుకు తీసుకోకూడదు. వాళ్లు ఎప్పటి నుంచో అమెరికా పౌరసత్వం కలిగి ఉన్నారనే కదా! మీకు ఉన్న అధికారంతో వారి పౌరసత్వం కూడా రద్దు చేయవచ్చుకదా! దీనికి నిబంధనలు అడ్డువస్తాయి. విమర్శలు చెలరేగుతాయి. అందుకే వారి జోలికి వెళ్లకుండా తన అధికారంతో ఇప్పటి నుంచి విదేశీయులు ఎవరికీ అమెరికాలో జన్మించినా పౌరసత్వం ఇవ్వకూడదు అనే ఆర్డర్ జారీ చేశారు. ఇది రాజ్యాంగ విరుద్ధం అని పలువురు అభిప్రాయపడ్డారు. ట్రంప్ కన్నా ముందు ఉద్దండులైన వారు అమెరికా పీఠం ఎక్కారు. వారు కదపని పౌరసత్వాన్ని ట్రంప్ కదపటంతో మేధావులు పెదవి విరుస్తున్నారు. ఇది అమలులోకి రావటం కష్టంగా ఉంటుంది.



అంతలోపు మరో అధ్యక్షుడు వచ్చి యధాతథం అంటారు. అప్పుడు మళ్ళీ విదేశీయుల పిల్లలు అమెరికాలో పుడితే అమెరికా పౌరసత్వం వస్తుంది అని ప్రకటన చేస్తే, ట్రంప్ నిర్ణయం అభాసు పాలుఅవుతుంది. ట్రంప్ ఇటువంటి నిర్ణయాలు కాదు తీసుకోవాల్సింది అమెరికా అగ్రభాగంగా ఉండాలి. పౌరులు ఎవరైనా భద్రత కలిగి ఉండాలి. సుస్థిర ప్రగతి, దేశాలతో చక్కని దౌత్యవిధానాలు, అందరికీ అంగీకారమైన చర్యలు తీసుకోవాలి. విశ్వం శాంతిగా ఉండాలి అంటే అమెరికా విదేశీ విధానం అందరూ హర్షించే విధంగా ఉండాలి. పలు సంస్కరణలు తీసుకురావాలి కానిపౌరసత్వం వంటివి కాదు. ముందు ఐక్యరాజ్య సమితి, భద్రతా మండలిని శాశ్వత సభ్యుల సంఖ్య పెంచాలి. యుద్ధం అనే మాట ఎక్కడా వినపడకూడదు. శాంతికి బాటలు వేయాలి. దుర్భేధ్యంగా అమెరికా రక్షణ వ్యవస్థ ఉండాలి. విదేశీ, స్వదేశీ ఉద్యోగులకు స్వర్గధామంగా ఉండాలి. నేరం చేసింది ఎవరైనా శిక్షలు కఠినంగా ఉండాలి. అమెరికాలో ఎక్కడా అవాంఛనీయ చర్యలు జరగకుండా చూడాలి. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో విషయాలు వస్తాయి. వీటన్నీటి మీద పాలన దృష్టి పెట్టి, పారదర్శక పరిపాలన అందించాలి. అనాలోచిత విషయాలు విడనాడాలి. స్వదేశీ, విదేశీ పౌరులనుఒక్కటిగానే చూడాలి. వివక్ష ఎక్కడా ఉండకూడదు. అమెరికా అంటే దేశాలన్నీ తలతిప్పే విధంగా ఉండాలి. కనుక ఎటువంటి అనాలోచిత, వివాదస్పద నిర్ణయాలు తీసుకోకుండా పరిపాలన మెరుగ్గా సాగించాలి. ప్రస్తుతం అమెరికాలోఉద్యోగాలు కొంత తగ్గినా, ప్రతిభ ఉన్నవారికి వెతుక్కుంటూ వస్తున్నాయి. కొందరికి రావడం లేదు. ఉద్యోగాలు రాని వారి పరిస్థితి ఆందోళనగా ఉంది. వారు ఎక్కడా అంటే వివిధ మాల్స్, రెస్టారెంట్‌లలో పని చేయకూడదు అని ట్రంప్ ఓ కండిషన్ పెట్టారు. ఇది వరకు ఏ అధ్యక్షుడు ఇటువంటి చర్యలు చేపట్టలేదు. ఏ దేశం వారైనా ఎక్కడైనా చట్టబద్ధంగా పని చేసుకునే వెసులుబాటు కల్పించాలి. ఇప్పటికే అనేక వినతులు భారత ప్రధానికి వెళ్లాయి. ఆ పరిస్థితి చర్చించటానికి మరికొన్ని దౌత్య విషయాలలో రెండు దేశాల పటిష్ట సంబంధాల కోసం భారత ప్రధాని అమెరికా రాబోతున్నారు అనే అంచనా ఉంది. మోడీ పర్యటనలోనైనా అమెరికాలో విద్యనభ్యసిస్తున్న పౌరులకు మేలుకలుగవచ్చు. తద్వారా పరిస్థితులలో మార్పులు రావొచ్చు. ఒకింత భారత్‌కు మేలుజరగవచ్చు అనే ఆశాభావం కనిపిస్తోంది. మోడీ కూడా ట్రంప్‌ను భారత్‌కు ఆహ్వానించవచ్చు. రెండు దేశాలు కలసి ముందడుగు వేస్తే ఇక తిరుగు ఉండదు. ప్రపంచచిత్రపటంలోనే కొత్త శకానికి నాంది అవుతుంది. ప్రగతి పథంలో రెండు దేశాలు పయనిస్తాయని ఆశీద్దాం. ●

# విజయవాడ వార్త

## అనూహ్య పరిణామాల మధ్య నూతన చైర్‌పర్సన్‌గా మండవ కృష్ణకుమారి ఎన్నిక

**నందిగామ ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** గత రెండు రోజుల నుంచి ఉత్కంఠ భరితంగా కొనసాగిన నందిగామ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక మంగళవారం నాటికి తెరపడింది. ఈ చైర్మన్ పదవి కోసం ఎందరో ఆశావాదులు పోటీపడ్డ అనూహ్య పరిణామాల మధ్య 10 వ కౌన్సిలర్ అయినమండవ కృష్ణకుమారి పేరు తెర మీదకు రావడం విశేషం, అయితే మండవ కృష్ణకుమారికి మద్దతు పలికిన 14 మంది కౌన్సిలర్లు ఎక్స్ అఫీషియల్ నెంబర్ అయినటువంటి ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో కలిపి 15 మంది చైర్మన్ పదవికి ఆమోదంతో తెలపడంతో ఎన్నికల అధికారి ఆర్టీఓకే బాలకృష్ణ మండవ కృష్ణకుమారి నందిగామ చైర్‌పర్సన్‌గా ఎన్నికైనట్లు మంగళవారం అందరి నడుమ ప్రకటించడం జరిగినది. నందిగామ మున్సిపాలిటీ నూతన చైర్ పర్సన్‌గా ఎన్నికైన మండవ కృష్ణకుమారిని నందిగామ శాసనసభ్యురాలు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య మండవకృష్ణ కుమారిని అభినందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఈవి రమణబాబు పాల్గొన్నారు. అనంతరం పట్టణ మండలంలో గలపలువురు ప్రముఖులతో పాటు ముఖ్యమైన రాజకీయ నాయులు అభినందనలు తెలపడం జరిగినది.

## సిఎం చంద్రబాబును కలిసిన సోనూసూధ్

**ఎ కొండూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** భారతదేశంలోని రాష్ట్రాల్లో ఆర్థిక లోటుతో ఉన్న నవ్యాంధ్ర ప్రదేశ్ ఎపిస్టేట్ బాలివుడ్ నటుడు సోనూసూద్ 'సూద్ చారిటీ' ఫౌండేషన్ ద్వారా నవ్యాంధ్రప్రదేశ్ విజనరీ సిఎం చంద్రబాబు ప్రభుత్వానికి ఆరోగ్యరంగంలో అత్యవసర మౌలిక సదుపాయాల కల్పనకు అమరావతిలో సిఎం చంద్రబాబును కలిసి సోనూసూద్ 4 అంబులెన్స్‌లు విరాళమివ్వడం శుభపరిణామమని బాలివుడ్ నటుడు సోనూసూద్ ఉదార స్వభావాన్ని సేవాభావాన్ని మానవతావాదాన్ని ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం తిరువూరు ఎ కొండూరు గంపలగూడెం విస్సన్నపేట మండలాల ఎస్సీ ఎస్టీ బిసి ముస్లీం మైనార్టీ వర్గాల పేద ప్రజలు, రోగులు ప్రశంసించారు. మహారాష్ట్రలోని ముంబాయికి చెందిన నటుడు సోనూసూద్ నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి వెళ్లి



అక్కడ సిఎం చంద్రబాబును కలిసి 4 అంబులెన్స్‌లు విరాళమిచ్చి చంద్రబాబు విజనరీ సిఎం అని భారతదేశంలోని భారతీయులందరికి మరెందరో రాజకీయ నాయకుల స్ఫూర్తి అని సామాన్య ప్రజల కోసం నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి కోసం పోలవరం ప్రాజెక్ట్ కోసం పరిశ్రమల స్థాపన పెట్టుబడుల ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించి నవ్యాంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చడం కోసం సిఎం చంద్రబాబు తపనను నటుడు సోనూసూధ్ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించడం సోనూసూద్ నిష్కళంక సేవా దృక్పదానికి గీటురాయి అని ప్రజలు వేనోళ్ల పొగడటం విశేషం ఈ తిరువూరు నియోజకవర్గంలోని తిరువూరు గంపలగూడెం విస్సన్నపేట ఎ కొండూరు మండలాల్లోని అనేక మంది రోగుకలకు వివిధ రకాల ఆపరేషన్ల కొరకు మరెన్నో సేవా కార్యక్రమాలకు కోట్లాది రూపాయల ఆస్తులను తాకట్టుపెట్టి సోనూసూద్ ఆర్థికంగా సాయం అందించి బాధిత కుటుబాల గుండెల్లో ఒక శ్రీరాముడు ఒక అల్లా ఒక జీసెస్ (ఏసుప్రభు)లా కొలువై ఉన్నాడని నియోజకవర్గ బాధితులు నటుడు సోనూసూధ్ మానవత్వాన్ని దాతృత్వాన్ని సేవాభావాన్ని ఉదార స్వభావాన్ని కీర్తిస్తున్నారు.

## వైభవంగా శ్రీ భద్రావతి సమేత భావనాఋషి కళ్యాణం

**విజయవాడ, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** విజయవాడలో శ్రీ భద్రావతి భావనాఋషి స్వామివార్ల కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా మంగళవారం నిర్వహించారు. పద్మశాలీయ కుల కమిటీ సభ్యుల దంపతులు గోలి భాస్కరరావు దంపతులు, కొల్లి సాంబశివరావు దంపతులు, డి మురళీకృష్ణ దంపతులు, అవ్వరు బుల్లబ్బాయి దంపతులు తదితర 9 మంది దంపతులు కళ్యాణం నిర్వహించారు.



విశిష్ట అతిథులుగా ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, బిజెపి జిల్లాధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, టిడిపి నేత క్రాంతికుమార్, పి శ్రీధర్, సందం అబద్దయ్య పద్మశాలీయ కార్పొరేషన్ చైర్మన్, చిల్లపల్లి శ్రీనివాసరావు, తదితర ప్రముఖులతో పాటు పద్మశాలీయులు పాల్గొన్నారు.

## మే 10న కొమెడ్ కె, యుని గేజ్ ప్రవేశ పరీక్ష

**విజయవాడ, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** కర్ణాటకలోని 150 పైగా ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజ్‌లతో పాటు దేశవ్యాప్తంగా వున్న 50 కి పైగా ప్రైవేట్, అటానమస్, డీమ్డ్ యూనివర్సిటీల్లో బిఇ, బిటెక్ కోర్సుల్లో ప్రవేశం కోసం కామన్ ఎంట్రన్స్ టెస్ట్ కొమెడ్-కె, యుని-గేజ్ 2025 ప్రవేశ పరీక్షను మే 10న దేశవ్యాప్తంగా 400 కేంద్రాల్లో నిర్వహిస్తామని, పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు మార్చి 15వరకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కొమెడ్ కె ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ డా కె కుమార్ వెల్లడించారు. విజయవాడలో మీడియాతో ఆయన మాట్లాడుతూ తాము నిర్వహించే ఈ పరీక్ష ద్వారా ఐదు దశాబ్దాలుగా ఉన్నత విద్యలో అగ్రస్థానంలో వున్న కర్నాటకలోని ప్రఖ్యాత ప్రైవేట్ ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలతో పాటు దేశవ్యాప్తంగా యునిగేజ్ సభ్య ప్రైవేట్ అటానమస్, డీమ్డ్ యూనివర్సిటీల్లో అడ్మిషన్లు ఇస్తారన్నారు.

## ఆయుష్మాన్ భారత్‌పై అవగాహన సదస్సు

**తాడేపల్లి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశ డే జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ విజయప్రకాశ్, ఆయుష్మాన్ భారత పథకం మరియు డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకం గురించి ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో



స్థానిక ప్రభుత్వ వైద్యులు డాక్టర్ పి.శాంతకుమార్, డాక్టర్ ఎం.అనుషా, సిహెచ్ఓసి గురుకుమార్, శెట్టి బాలస్వామి, కె.శ్రీనివాసరావు, రమాదేవి, వైద్యమిత్ర కందుల సూర్యనారాయణ మరియు ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## డిఎస్సీ వ్యాయామ ఉపాధ్యాయ అభ్యర్థులకు మోడల్ పేపర్,పుస్తకాలు పంపిణీ

**గుంటూరు స్పోర్ట్స్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** వేణు స్పోర్ట్స్ అండ్ కల్చరల్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ గుంటూరు వారి ఆధ్వర్యంలో తారక రామానగరలోని వేణు బ్యాడ్మింటన అకాడమీలో రాబోయే డిఎస్సీకి ప్రిపేర్ అవుతున్న పీఈటి అభ్యర్థులకు ధృవన్ పబ్లికేషన్స్ వారు ప్రచురించిన డిఎస్సీ మోడల్ టెస్ట్ పుస్తకాలను ఆడిటర్,జిల్లా బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు దామవర్ల శ్రీనివాసరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పుస్తకాల వలన డిఎస్సీకి ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రాబోయే డిఎస్సీలో ఉద్యోగాన్ని సంపాదించి ఉన్నతస్థాయి క్రీడాకారులను తయారుచేయాలని కోరారు. తమ వెల్ఫేర్ సొసైటీ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను త్వరలో చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి వేణు మాట్లాడుతూ క్రీడాకారులకు తమ సొసైటీ ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కోశాధికారి సిహెచ్ రత్నాకర్, సంయుక్త కార్యదర్శి రామకోటి, ఎన్టీఆర్ స్టేడియం హెచ్ఓడి, అథ్లెటిక్స్ కోచ్ భాస్కర రామకృష్ణ, గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ కార్యదర్శి జివిఎస్ ప్రసాద్, అంకాల సుబ్బారావు, బి.కిరణ్‌కుమార్ రెడ్డిలు పాల్గొన్నారు.

## పురపాలక సంఘ ప్రభకు కమిషనర్ పూజలు

**నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** నరసరావుపేట పురపాలక సంఘ ప్రభకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ జశ్వంత్‌రావు పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కోటప్పకొండ వద్ద జరిగే త్రికోటేశ్వరస్వామి జాతరకు మున్సిపల్ కార్యాలయం నుండి ప్రభను తరలించడం సాంప్రదాయంగా వస్తుందన్నారు. ఇటువంటి ఆచారాన్ని కొనసాగిస్తూ ప్రభను ఈ ఏడాది కూడా కొండకు తరలిస్తామన్నారు. త్రికోటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కమిషనర్ జశ్వంత్‌రావుతో పాటు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



## పూరిల్లు దగ్ధమైన కుటుంబానికి టిడిపి నాయకులు ఆర్థిక సహాయం

**అమృతలూరు, ఫిబ్రవరి4, ప్రభాతవార్త:** ఇటీవల ఇంటూరు గ్రామంలో పూరిల్లు దగ్ధమైన తాళ్లపల్లి సీతారామయ్య కుటుంబానికి తెలుగు దేశం పార్టీ తరపున ఇంటూరు సాగునీటి సంఘం అధ్యక్షులు బోరుగడ్డ శామ్యూల్, టిడిపి జిల్లా ఎస్సీ సెల్ నాయకులు పాములపాటి వెంకట సుబ్బారావు, టిఎన్ఎస్ఎఫ్ వేమూరు నియోజకవర్గం ఉపాధ్యక్షులు బోరుగడ్డ ఆనంద్ రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పి.శ్రీనివాసరావు, ఘంటా రామకృష్ణ, కాట్రగడ్డ లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.



## జగ్గయ్యపేట పట్టణంలోని అన్ని వార్డుల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ

**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** జగ్గయ్యపేట పట్టణంలోని అన్ని వార్డుల్లో నెలకున్న సమస్యల పరిష్కారానికి తగిన కార్యాచరణ రూపొందిస్తూ ప్రాధాన్యతా క్రమంలో నిర్వహించనున్నట్లు స్థానిక ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ అన్నారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కూటమి నేతలతో కలిసి పట్టణంలోని విద్యానగర్, కౌతావారి అగ్రహారం పాలేఇ బ్రిడ్జి ప్రాంతాలను మంగళవారం ఎంఎల్ఏ



రాజగోపాల్ పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సంభవించిన భారీ వర్షాలు, వరదల కారణంగా కె అగ్రహారం వద్దగల పాలేటి బ్రిడ్జిపై గుంటలుపడి శిధిలమైందన్నారు. శివరాత్రి పర్వదిన వేడుకలు ముక్త్యాల భవానీముక్తేశ్వరస్వామి దేవస్థానంలో భారీ ఎత్తున జరుగుతుంటాయని, కోటి లింగ హరిహర మహాక్షేత్ర దర్శనం, పవిత్ర కృష్ణానది పుణ్యస్నానాలకు కూడా రద్దీ పెనుగుతుందన్నారు. దాదాపు లక్ష మంది భక్తులు, యాత్రికులు ముక్త్యాలకు తరలివచ్చే సందర్భంలో పాలేటి బ్రిడ్జి మరమ్మతులు అత్యావశ్యమయ్యాయన్నారు. ఈప్రాంతంలోని వాణిజ్య సముదాయాల యాజమాన్యాలను సిఎస్ఆర్ నిధులు కేటాయించాలని కోరామన్నారు. అలాగే జిల్లా కలెక్టర్ లక్ష్మీ శా కూడా బ్రిడ్జి మరమ్మతులకు నిధులు అందించాలని విన్నవించామన్నారు. కాగా మంగళవారం ఉదయం పట్టణంలోని దుర్గాపురంలో పర్యటించిన ఎంఎల్ఏ రాజగోపాల్, చైర్మన్ రాఘవేంద్ర, కౌన్సిలర్ వేదులాపురి అలేఖ్యాసైదా నివాశిత ప్రాంతవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లో-ఓల్టేజ్ సమస్య, వీధుల్లో విద్యుత్ స్తంబాల ఏర్పాటు, వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తదనంతరం తన నివాసంలో కలిసి ఎంఆర్‌పిఎస్ కార్యకర్తలు, నాయకులతో ఛలో హైదరాబాద్ పోస్టర్‌ను నేతలు రాజగోపాల్, రాఘవేంద్ర ఆవిష్కరించారు. ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లో జరుగనున్న వెయ్యి గొంతుకలు, లక్ష డప్పులు మహాసభ నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. అలాగే జగ్గయ్యపేట పట్టణంలోని తొర్రగుంటపాలెంలో నాలుగు రోడ్ల కూడలిలో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ ఏర్పాటు భూమి పూజకు విచ్చేయాలని కోర్ కమిటి ప్రతినిధులు ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్‌ను, చైర్మన్ రాఘవేంద్ర, ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు-మాజీమంత్రి నెట్టెం రఘురామ్‌లను కలుసుకుని ప్రత్యేకంగా ఆహ్వానించారు.

## అధిష్టానం ఆదేశాలమేరకు మండవకృష్ణ కుమారి చైర్ పర్సన్ ఎన్నిక : ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య

**నందిగామ ఫిబ్రవరి 04 ప్రభాతవార్త :** సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మంత్రులు నారా లోకేశ్ నారాయణ నిర్ణయమే మా అందరి నిర్ణయంమేరకే మండవ కృష్ణకుమారి మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఎన్నికచేసినట్లు నందిగామ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ఈసందర్భంగా పార్టీ కార్యాలయ వద్ద విప్ సౌమ్య మీడియాతో మాట్లాడుతూ అధిష్టానం ఆదేశాల మేరకే అందరి ఆమోదంతోనే ఛైర్‌పర్సన్ ఎన్నికను ఏకగ్రీవం చేసినట్లు ఆమె తెలిపారు. డమ్మీ అని అంటూ కొన్ని కోయిలలు ముందే కూసైయి ఈరోజు ఎవరు డమ్మీ అయ్యారో తెలుసు కోవాలన్నారు. నందిగామ నియోజకవర్గ ప్రజానీకానికి ఈరోజు మీరు ఏం సమాధానం చెబుతారని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్



వారిని ప్రశ్నించారు. నోటికి ఏదివస్తే అది మాట్లాడటం సరైన పద్దతి కాదని మీరు ఎప్పటికైనా మంచి మనుషులుగా మారాలని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్‌వారికి హిత బోదచేశారు. నేడు వైసీపీ బోర్డు పక్కకు నెట్టి 15 మంది కౌన్సిలర్ల బలంతో నందిగామ మున్సిపాలిటీపై కూటమి జెండాను ఎగరవేశామన్నారు. గతంలో వైసిపి కౌన్సిలర్లు ఆ పార్టీని వీడు దూరంగా వెళ్లి ఆ తర్వాత మీపై ఏం మాట్లాడారో రాష్ట్రం అంతా చూశారని ఎద్దేవ చేశారు. మీకు లాగా కమిషన్లకు కక్కుర్తి పడి నందిగామ మున్సిపాలిటీని భ్రష్టు పట్టించారని ఆమె అన్నారు. రాబోయే కాలంలో కూటమి ప్రభుత్వ నేతృత్వంలో నందిగామ మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని ప్రభుత్వ విప్ సౌమ్య మీడియా ముందు తెలియజేశారు. నాకు సహకరించిన కౌన్సిలర్లు అందరికీ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ సౌమ్య పేరు పేరున ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కోట వీరబాబు నియోజకవర్గం పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు కంచికచర్ల నందిగామ మండల టిడిపి పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు వీరంకి వీరాస్వామి మబాజీ జెడ్పిటిసి నాయకులు ప్రసాదరావు మైనార్టీ నాయకులు ఎండి అల్లి పాషా ఉన్నం నరసరావు మేకుల సుధాకర్ కొండూరు వెంకట్రావు తదితర కౌన్సిలర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీ

**గుంటూరు తూర్పు, (కార్పోరేషన్) ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** ఫిబ్రవరి 4వ తేదీ ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ సమగ్ర వైద్యశాల నందలి నాట్కో క్యాన్సర్ సెంటర్ సెమినార్ హాల్ నందు క్యాన్సర్‌వ్యాధిపై




అవగాహన సదస్సు నిర్వహించారు. నాట్కో వైద్యులు నర్సింగ్ సిబ్బందితో పాటు గుంటూరు వైద్య కళాశాల, ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో వివిధ విభాగాలలో పని చేస్తున్న వైద్య కళాశాల, ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో వివిధ విభాగాలలో పని చేస్తున్న పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్యులు, హౌస్ సర్జన్‌లు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి మాట్లాడుతూ ఆధునిక జీవితంలో మానవుడు ఇలాంటి వ్యాధుల బారిన పడకుండా, ఒత్తిడిని అధిగమించేందుకు యోగా, ధ్యానం వంటి కార్యక్రమాలలో పాల్గొనాలని, ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని అన్నారు. నాట్కో వైద్యులు డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ వెంకారెడ్డి, డాక్టర్ మాధురి, డాక్టర్ అనిల్‌కుమార్ లు క్యాన్సర్ రావడానికి కారణాలు, నిర్ధారణ, నివారణ, చికిత్స పద్ధతులు గురించి వివరించారు. కార్యక్రమంలో లైజనింగ్ ఆఫీసర్ డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మురళీ, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయకుమారి పాల్గొన్నారు.

## లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా పంట పొలాలకు నీరు అందించడానికి పనులు ప్రారంభం

**పెదకాకాని, ఫిబ్రవరి4, ప్రభాతవార్త:** మండల పరిధిలోని అనుమర్లపూడి, తంగెళ్లమూడి గ్రామాలరైతులు పండించే పంటకు సరైన సమయంలో నీరు అందట్లేదని పండించే పంట ఎండిపోతుందని ఎన్నికలప్రచారంలో ఉన్నప్పుడు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ దృష్టికి రెండు గ్రామాల రైతులు తీసుకురాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఇచ్చిన మాటకోసం మంగళవారం నీటి పారుదల అధికారులను కొమ్మూరుకాలువ, కోపల్లె,



గుడివాడ నుండి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా రెండు గ్రామాలకు నీరు అందించటం కోసం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రతిపాదనలు తయారు చేయుటకు పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అధికారులకు సూచించారు. లిఫ్ట్‌ఇరిగేషన్ ద్వారా పంటకు నీరు ఇవ్వటానికి ప్రయత్నం చేస్తున్న ఎమ్మెల్యేకి రెండు గ్రామాల రైతులు హర్షధ్వానాల ద్వారా ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు వలివేటి మురళి, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## జగ్గయ్యపేటలో పలువురు అధికారులపై కేసు నమోదు

**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** జగ్గయ్యపేట పట్టణలోని జామియా మసీదు షాపింగ్ కాంప్లెక్స్‌లోగల ఫుట్‌వేర్‌ను బలప్రయోగంతో ఖాళీ చేయించారన్న సంఘటనపై ఉప్పెల్లి రవి అనే వ్యాపారి ఇచ్చిన ఫిర్యాదుతో పలువురు అధికారులపై పోలీసు కేసు నమోదైంది. ఫిర్యాది రవి తెలిపిన వివరాల ప్రకారం మసీదు కమిటీ అధ్యక్షులు షేక్ జలీల్, వక్ఫ్‌బోర్డు సిఇఓలతోపాటు ఎస్ఐ జి రాజుపై కూడా కేసు నమోదుచేశారు. గత సంవత్సరం మారి చ్నెలలో జామియా మసీదు షాపింగ్ కాంప్లెక్స్ లో దుకాణాన్ని లీజుకు తీసుకున్న ఉప్పెల్లి రవి చెప్పుల వ్యాపారం చేస్తూ జీవిస్తున్నారు. అయితే ముందస్తు నోటీసు జారీ చేయకుండా వక్ఫ్‌బోర్డు, పోలీస్, రెవిన్యూ అధికారుల సమక్షంలో షట్టర్ పగులగొట్టి దౌర్జన్యంగా ఖాళీ చేయించినట్లు రవి ఫిర్యాదు చేశారు. దీంతో చట్టపరంగా కేసు నమోదైంది.

## విద్యా సంస్థలకు కృష్ణాజలాల పైప్‌లైన్‌తో వాటర్ సరఫరా చేయాలి

### -తెదేపా ఎస్టీ విభాగం నేత గోపిరాజు వినతి

**ఎ కొండూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశాను తెలుగుదేశం పార్టీ గిరిజన విభాగం నాయకుడు బి గోపిరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గోపిరాజు మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఎ కొండూరు మండలంలో సుమారు 50కోట్ల జలజీవన్ మిషన్ కింద ఏర్పాటు చేస్తున్న కృష్ణాజలాల పైప్‌లైన్ ఓవర్ ట్యాంకుల ద్వారా మండలంలోని కృష్ణారావుపాలెంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల కళాశాల చైతన్య నగర్ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాలకు కృష్ణాజలాలు అందించే విధంగా చర్యలు



తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశను కోరినట్లు గోపిరాజు తెలిపారు. ఆర్‌డబ్లుఎస్ అధికారులకు అన్ని విద్యా సంస్థలకు పైప్‌లైన్ ఏర్పాటు చేసి కృష్ణా వాటర్ అందించాలని ఆదేశించారని గోపిరాజు తెలిపారు. అలాగే మండలంలో ఎతైన కొండ ప్రాంతంపై పవన విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలని కలెక్టర్ లక్ష్మీశను కోరినట్లు కలెక్టర్ లక్ష్మీశ సానుకూలంగా స్పందించారని గోపిరాజు ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు.

## బాలోత్సవ కరపత్రం ఆవిష్కరించిన ఎంఈవో-1

**తిరువూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** తిరువూరు ఎంఈవో ఆఫీసులో మంగళవారం బాలోత్సవం కరపత్రమును ఎంఈవో1 శ్యామ్ సుందరరావు ఆవిష్కరించారు. ఆ క్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను ప్రతిభా పాటవాలను వెలికి తీయడానికి ఇటువంటి బాలోత్సవాలు ఎంతో ఉపయోగపడతాయని తెలియచేశారు. కార్యక్రమంలో తిరువూరు బాలోత్సవం



నిర్వాహక సభ్యులు ఎం హరికృష్ణ, ఎల్ గంగాధర్, కె పాపారావు, పి శీనయ్య, పి శోబనబాబు, పి రామకృష్ణ, సత్యనారాయణ, ఎం రమేష్ పాల్గొన్నారు.

## కృష్ణ గుంటూరు పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కందుల వెంకట్రావు

కంచికచర్ల ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: మంగళవారం కంచికచర్ల మండల ఆఫీస్ ఆవరణలోని విశ్రాంతి ఉద్యోగుల భవనంలో సాయి సిద్దార్థ విద్యాసంస్థల అదినేత కందుల వెంకట్రావు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల వెంకట్రావు మాట్లాడుతూ పూర్వపు విద్యార్థులు ఈ ప్రాంత పట్టభద్రులు కోరిక మేరకు ఈ ఎన్నికల్లో నిలిచానని తన గెలుపునకు పట్టభద్రులందరూ కృషి చేయాలని కోరుకుంటున్నానని ఎంతోమంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించానని



నందిగామ కోచింగ్ సెంటర్లో జేఈఈ విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నాము అని విద్యపరంగా విద్యార్థులకు ఎల్లప్పుడూ సహృదయంతో అందుబాటులో ఉంటూ మన ప్రాంత విద్యార్థులకు విద్యాబోధనలు చేస్తూ సుదీర్ఘకాలం నుంచి విద్యాసంస్థల్లో ఉంటున్నామని ఎమ్మెల్సీ ఎన్నికల్లో నేను గెలిచిన తర్వాత చేయబోయే పనులు కూడా ఈ సందర్భంగా తెలుపుతున్నానని ప్రతి రూపాయి విద్యకు దూరంగా ఉన్న విద్యార్థులకు చేరేలా కృషి చేస్తానని నా జీతంలో నుంచి కూడా ప్రతి రూపాయి వారికే ఖర్చు చేస్తానని ఎమ్మెల్సీగా గెలిచిన వెంటనే కృష్ణగుంటూరు ప్రాంతాలలో నిరుద్యోగులైన పట్టభద్రులకు ప్రభుత్వ ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పించేందుకు అవిశ్రాంత కృషి చేస్తానని తెలిపారు.

## యూత్ ఫర్ మై భారత్ శిబిరంలో పాల్గొన్న వివిఐటి విద్యార్థులు

**పెదకాకాని, ఫిబ్రవరి4, ప్రభాతవార్త:** నేషనల్ స్వయం సేవక్(ఎన్.ఎస్.ఎస్) ఆధ్వర్యంలో అస్సాంలోని అస్సాం అగ్రికల్చరలయూనివర్శిటి నందు జనవరి 21నుండి 27 వరకూ నిర్వహించిన జాతి సమగ్రతాశిబిరం యూత్ ఫర్ మై భారత్ నకు వివిఐటి కళాశాలకు చెందినబి.వి.అజయ్ కుమార్ సీహెచ్ జీవన ఇద్దరు విద్యార్థులు హజరయ్యారని వివిఐటి కళాశాల ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. యువతను శక్తివంతం చేయడానికి భారత ప్రభుత్వం ప్రారభించిన మేరా యువ భారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరానికి దేశవ్యాప్తంగా 16రాష్ట్రాల నుండి 200 మంది ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులను ఎంపికకాగా కేవలం వివిఐటి కళాశాల నుండి ఈసి ఈ విభాగానికి చెందిన బి.వి.అజయ్‌కుమార్ సి.ఎస్.ఈ విభాగానికి చెందిన సిహెచ్,జీవన ఎంపిక కావడం విశేషం అని వివరించారు. కళాశాల ఎన్.ఎస్.ఎస్ బృందం ద్వారా గ్రామాలలో ప్రత్యేక శిబిరాలు, సార్వత్రిక ఎన్నికల సమయంలో ఓటరు అవగాహనా సదసులు. పలు సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొన్న తీరును పరిగణలోనికి తీసుకుని ఈ విద్యార్థులు ఎంపిక చేయబడ్డారని తెలిపారు. శిబిరంలోని విద్యార్థులు సమైక్యతా, నాయకత్వ



లక్షణాలు, దేశభక్తి అంశాలపై చర్చలు, సామూహిక కార్యక్రమాలలో పాల్గొన్నారని తెలిపారు. ఆంధ్రతెలగాణ రాష్ట్రాలనుండి పాల్గొన్నా 10మంది విద్యార్థులతో కలిసి తెలుగు సంస్కృతిని ప్రతిభింబించేలా కొలాటం, కూచిపూడి నృత్యం, రంగవల్లులను ఈశిబిరంలో ప్రదర్శించారని తెలిపారు. అనంతరం అజయకుమార్, జీవనలను ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్‌ఛైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపాల్ డా॥వై.మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ డా॥కె.గిరిబాబు, ఎన్.ఎస్.ఎస్.ప్రోగ్రామ్ ఆఫీసర్ డా॥ ఐ.ఎల్.కె భక్తసింగ్ అభినందించారు.

## ఆర్ట్స్ విభాగాన్ని సందర్శించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక సాంస్కృతిక శాఖ చైర్‌పర్సన్


**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** ఏఎన్‌యులోని ఫైన్ ఆర్ట్స్ విభాగాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక సాంస్కృతిక శాఖ చైర్‌పర్సన్ తేజస్విని పొడవాటి మంగళవారం సందర్శించారు. విభాగంలోని అధ్యాపకులు, విద్యార్థులను కలసి ముఖాముఖి చర్చించారు. ఈ సందర్భంగా



విద్యార్థులు చిత్రీకరించిన చిత్రాలను తిలకించి వారిలోఉన్న సృజనాత్మకతను అభినందించారు. జాతీయస్థాయి చిత్రకళ సంత మన రాష్ట్రంలోఏర్పాటుచేస్తామని అందులో యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం వైస్ చాన్సలర్ ఆచార్య గంగాధర రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో కళల అభివృద్ధిని ప్రోత్సహించాలని దానికి అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి తమ వంతు కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎన్.వి.కృష్ణారావు, దూరవిద్య పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్, అసిస్టెంట్ కోఆర్డినేటర పి.దేవకాంత్, అధ్యాపకులు బి.జాన్ రత్నబాబు, శేఖర్‌బాబు, సిఎస్ఆర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎం.వి. రమణ, వై.రాధాకృష్ణ, టిఎన్ఎస్ఎఫ్ విద్యార్థి సంఘం అధ్యక్షుడు బత్తుల హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భద్రావతి సమేత భావనారుషి స్వామివారి కళ్యాణ మహోత్సవం

**మంగళగిరి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామివారి కళ్యాణ మహోత్సవంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత చిల్లపల్లి శ్రీనివాసరావుకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి



వేద ఆశీర్వచనం, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. కళ్యాణ మహోత్సవంలో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, పద్మశాలీయ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, శ్రీపద్మశాలీయ సేవా సంఘం సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కోటప్పకొండ జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే



**నరసరావుపేట, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన కోటప్పకొండ వద్ద ఈ నెల 26న జరిగే కొండ జాతర ఏర్పాట్లను శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండ వద్ద భక్తులకొరకు చేస్తున్న ఏర్పాట్లును పరిశీలించడం జరిగిందన్నారు. శివరాత్రి తిరునాళ్ళకు ఇరవై లక్షల మంది భక్తులు హాజరౌతారని, లక్షల సంఖ్యలో స్వామివారి దర్శనం చేసుకుంటారని తెలిపారు. వారికి అవసరమైనటువంటి మంచినీరు, క్యూలైన్లు, స్వామివారి లడ్డూ, అరిసె ప్రసాదాలను అందుబాటులో ఉంచామన్నారు. భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలియజేశారు. సాగర్ కెనాల్ వద్ద నిర్మాణంలో ఉన్న శివ కుటుంబం పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలిచ్చామన్నారు. తిరునాళ్ళకు వచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా ట్రాఫిక్‌కు సంబంధించి ముందస్తు చర్యలు అవసరమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలియజేశారు.

**రొంపిచర్లలో ఎమ్మెల్యే పర్యటన...**

మండలంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పర్యటించారు. కొనకంచివారిపాలెం గ్రామంలో పార్టీ నాయకులు పొనుగోటి వెంకటేశ్వర్లు మాతృమూర్తి సామ్రాజ్యం అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. వారిని ఎమ్మెల్యే అరవింద్‌బాబు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎన్ఆర్ఐ వైద్యశాలలో మెరుగైన వైద్యసేవలను అందించాలని వైద్యులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు.

## వైభవంగా భావనఋషి కళ్యాణం



**సత్తెనపల్లి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** పట్టణంలోని 20,24 వార్డుల పరిధిలో ఉన్న దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. భావనఋషి స్వామివారి కళ్యాణ మహోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అదే విధంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకొని పూజలు చేసిన అనంతరం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వివిధ హోదాలలో ఉన్న జిల్లా, రాష్ట్ర, నియోజకవర్గ, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## పుచ్చలపల్లి సుందరయ్య కళా నిలయ జాతీయ స్థాయి అహ్వాన నాటికల కరపత్రాల ఆవిష్కరణ



**యడ్లపాడు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** పుచ్చలపల్లి సుందరయ్య కళా నిలయం జాతీయస్థాయి అహ్వాన నాటికల పోటీలు ఏప్రిల్ 4,5,6 తేదీలలో నిర్వహించుతున్నట్లు కళానిలయం వ్యవస్థాపకులు, తెలుగు నాటక రంగం పరిషత్తుల సమ్మేళన వేదిక అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు తెలిపారు. యడ్లపాడు పోపూరి రామారావు విజ్ఞాన కేంద్రంలో మంగళవారం పోటీ నాటికల ఎంపికల కరపత్రాన్ని అవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పరిషత్ నందు వినూత్న తరహాలో నాటికల పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. గతంలో పుచ్చలపల్లి సుందరయ్య స్మారక నాటక ఉత్సవాల కమిటీగా ఉన్న సంస్థను పుచ్చలపల్లి సుందరయ్య కళానిళయంగా మార్పు చేయడం జరిగిందన్నారు. నాటిక ప్రదర్శన పారితోషికాలతో పాటు అయా విభాగాలలో ఉత్తమ ప్రతిభా పాటవాళ్లను ప్రదర్శించిన వారిని గుర్తించి రచన, దర్శకులు, నటీనటులకు వేరువేరుగా నగదు పారితోషికాలను అందించనున్నట్లు వెల్లడించారు. పోటీల నిర్వహణకు విభిన్న తరహాలో పలు రంగాలకు చెందిన 12మంది న్యాయ నిర్ణేతలుగా ఉండేవారు న్యావాది,జర్నలిస్టు, ఉపాధ్యాయులు, గృహిణి, రైతు, వ్యాపారవేత్త వివిధ వర్గాలకు చెందిన వారిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. వీరు గత మూడేళ్లుగా ఉప న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించినట్లు తెలిపారు. వీరు ఇచ్చిన మార్కుల అధారంగా ప్రధమ, ద్వితీయ, తృతీయ విభాగాల్లో బహుమతులు అందజేయటం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా మూడు రోజులు పాటు జరిగే ఈ కార్యక్రమాలకు గ్రామంలో ఇంటింటికి తిరిగి అహ్వాన పత్రాలు ద్వారా అహ్వానించడం జరుగుతుందన్నారు. ఈ అహ్వానాలతో పాటు ప్రత్యేక కూపన్లు అందజేసి అకూపన్ల ద్వారా ప్రతిరోజు డ్రా తీయటం జరుగుతుందని, ఈ కూపన్లు ద్వారా పోటీలకు హాజరయ్యే రోజుకు 30మంది చొప్పున ఎంపిక చేసి 90మందికి ప్రత్యక్ష ప్రోత్సాహక బహుమతులు అందిస్తామన్నారు. ఈ మూడు రోజులపాటు గ్రామంలో పండుగ వాతావరణం నెలకొలనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రదరశన పోటీ నాటికలు వివరాలు తెలియజేశారు. కార్యక్రమంలో పుచ్చలపల్లి సుందరయ్య కళా నిలయం నిర్వాహకులు ముత్తవరపు రామారావు, నూతలపాటి మాధవరావు, జరుగుల శంకరరావు, పోపూరి నాగేశ్వరరావు, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

..ప్రదర్శించే నాటికల వివరాలు : ఏప్రిల్ 4వ తేది శుక్రవారం అమరావతి అర్ట్స్ గుంటూరువారి చిగురుమేఘం, రచన కావూరి సత్యనారాయణ, దర్శకత్వం ఏపూరి హరిబాబు, ఉషోదయ కళానికేతన్ కట్రపాడు వారి కిడ్నాప్, రచన, దర్శకత్వం చెరుకూరి సాంబశివరావు, అరవింద్ అర్ట్స్ తాడేపల్లి వారి విడాకులు కావాలి, మూలకథ పొత్తూరి విజయలక్ష్మి, నాటకీకరణ వల్లూరు శివప్రసాద్, దర్శకత్వం గంగోత్రి సాయి, 5వ తేది శనివారం శ్రీసాయి అర్ట్స్ కొలకలూరు వారి జనరల్ బోగీలు, రచన పిటి మాధవ్, దర్శకత్వం గోపరాజు విజయ్, యువభేరి ధియేటర్స్ హైదరాబాద్ వారి నా శత్రువు, రచన అక్కల తామేశ్వరయ్య, దర్శకత్వం వడ్డాన సత్యనారాయణ, కళానికేతన్ వీరన్నపాలెం వారి ఋతువు లేని కాలం, రచన అగస్త్య, దర్శకత్వం వైబి చౌదరి, రసఘురి పొన్నూరు వారి గురితప్పిన వేట, మూలకథ శ్రీసుధ మోదుగ, నాకీకరణ పిన్నమనుని మృత్యుంజయ రావు, దర్శకత్వం వైయస్ కృష్ణేశ్వరరావు, 6వ తేది అదివారం అమృత లహరి గుంటూరు వారి నాన్న నేనోచ్చేస్తా, రచన తాళాబత్తుల వెంకటేశ్వరరావు, దర్శకత్వం అమృతలహరి, మైత్రి కళానిలయం విజయవాడ వారి బ్రహ్మ స్వరూపం, మూలకథ, నాటకీకరణ స్నిగ్ధ, దర్శకత్వం టివి పురుషోత్తం, ప్రత్యేక ప్రదర్శన మానవత యడ్లపాడు వారి బావా ఎప్పుడు వచ్చితీవు రచన కీశే వివి భవాని ప్రసాద్, దర్శకత్వం జరుగుల శంకరరావు ప్రదర్శించటం జరుగుతుంది.

## క్రమశిక్షణ, దేశభక్తిని ఎన్‌సిసి అందిస్తుంది : జేసి



**నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** విద్యార్థులలో క్రమశిక్షణ, దేశభక్తిని ఎన్‌సిసి పెంచుతుందని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్‌గనోరే అన్నారు. నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల జూబిలేషన్ 2కె25లో ఎన్‌సిసి క్యాడెట్స్‌కు ఇంటర్ కళాశాల పోటీలను నిర్వహించారు. ఛైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. వైస్ ఛైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌లు మాట్లాడారు. అన్ని కళాశాలల నుండి పెద్ద సంఖ్యలో ఎన్‌సిసి క్యాడెట్స్ హాజరు కావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఓడినా, గెలిచినా క్రీడా స్ఫూర్తిని పెంపొందించే విధంగా విద్యార్థులు గొప్ప ప్రయత్నం చేయాలన్నారు. స్క్వాడ్ డ్రిల్‌లో ఎన్ఇసి కళాశాల, బాపట్ల ఉమెన్స్ కళాశాల ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచాయి. అదే విధంగా గార్డ్‌ఆఫ్‌హానర్‌లో ఎన్ఇసి, ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ప్రథమ, ద్వితీయ, టగ్‌ఆఫ్‌వార్‌లో ఎన్ఇసి ప్రథమ, ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచాయి. గ్రూప్ డ్యాన్స్‌లో ఎన్ఇసి కళాశాల, జెడ్పీ హైస్కూల్, కె.ఎల్.యూనివర్శిటీలు 1,2,3 స్థానాలలో నిలిచాయి. ఎన్‌సిసి అధికారి ఎం.రాజేష్‌బాబు, హవల్దార్ రమేష్ పోటీలను పర్యవేక్షించారు.

## విజ్ఞాన్స్ విద్యార్థినికి తైక్వాండోలో బంగారు పతకం



**పొన్నూరు, ఫిబ్రవరి 4,ప్రభాతవార్త:** చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ విద్యార్థినికి తైక్వాండోలో జాతీయస్థాయి బంగారు పతకం సాధించిందని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ తమ యూనివర్సిటీలో రెండో సంవత్సరం సీఎస్ఈ చదువుతున్న ఆర్ కళాజ్యోత్స్న అనే విద్యార్థిని ఇటీవల తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణ స్టేట్ తైక్వాండో అసోసియేషన్ నిర్వహించిన 40వ జీతీయ సీనియర్ తైక్వాండో చాంపియన్‌షిప్- 2024-2025లో బంగారు పతకం సాధించిందని తెలిపారు. తమ విద్యార్థిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున అండర్ 67కిలోల సీనియర్ ఉమెన్ కేటగిరీలో పాల్గొని బంగారు పతకం కైవసం చేసుకొందని తెలిపారు. ఫైనల్లో కర్ణాటక రాష్ట్రం తరపున పాల్గొన్న విద్యార్థిని మీద మొదటి రౌండ్‌లో 5-0, రెండో రౌండ్‌లో 8-3తేడాతో ఘన విజయం సాధించిందని చెప్పారు. బంగారు పతకం సాధించిన ఆర్ కళా జ్యోత్స్నను విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి(ఎమ్మెస్, ఎఫ్‌పీఓఎస్), రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, ఫిజికల్ డైరెక్టర్లు, కోచ్‌లు, విద్యార్థులు అభినందించారు.

## మూడు చక్రాల రిక్షాలు పంపిణీ చేసిన కలెక్టర్, ఎస్పీ



**నరసరావుపేట, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావులు మంగళవారం మూడు చక్రాల రిక్షాలను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ, పరిసర ప్రాంతాల్లో చెత్తను సేకరించి జీవనం సాగిస్తున్న వారు అటువంటి పనులు మానుకోవాలన్నారు. మరో పనులకు మారి ఆదాయ మార్గాలను చూసుకోవాలన్నారు. చంద్రబాబునాయుడు కాలనీకి చెందిన ఇరువురికి మూడు చక్రాల రిక్షాలను అందజేశారు. పేద కుటుంబాలలోని పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలన్నారు. ప్రభుత్వం కేజీ నుండి పిజీ వరకు ఉచిత విద్యను అందిస్తుందన్నారు. చదువుతోనే పేదరికం నుండి ఏ కుటుంబం అయినా బయటకు వస్తుందన్నారు. చిన్నారుల కోసం ఏర్పాట చేసిన అంగన్‌వాడీ సెంటర్‌లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావులు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మురళీ, ఆర్డీవో మధులత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గ్రూప్‌మోడ్‌లో కౌలుదారులకు రుణాలు



**పొన్నూరు, ఫిబ్రవరి 4,ప్రభాతవార్త:** కౌలు రైతులకు గ్రూప్ మోడ్‌లో రుణాలు తీసుకొనే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి దేగల వెంకట్రామయ్య తెలిపారు. మండల పరిధిలోని ములుకుదురు, మాచవరం గ్రామాల్లో మంగళ వారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. అసలు భూమిలేని కౌలు రైతులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు.ప్రభుత్వం ఇచ్చిన కౌలుదారు పత్రాలతో ఒక గ్రూపుగా ఏర్పడినట్లయితే రుణ సౌకర్యం పొందవచ్చన్నారు. వివరాలతో దగ్గర్లోని రైతు సేవా కేంద్రానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా మొక్కజొన్న, మినుము, పెసర పంటలను పరిశీలించారు. పూత పిందె పెరగడానికి అవసమైన ఫార్మేషన్ నెంబర్ 4ను 400గ్రాములు ఒక ఎకరానికి 200లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. అదేవిధంగా నీటి ఎద్దడిని తట్టుకునేందుకు పొటాషియం నైట్రేట్ ఒక కిలో ఒక ఎకరానికి 200లీటర్ల నీటిలో పిచికారి చేయాలన్నారు. మొక్కజొన్న పంట కూడా జుట్టు బయటకు వచ్చే దశలో ఉందన్నారు. పీసు ఏర్పడే సమయం కనుక నీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## సిఅర్పిఎఫ్ కానిస్టేబుల్ మూర్తయ్యకు నివాళులు అర్పించిన ప్రత్తిపాటి



**యడ్లపాడు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** మండల పరిధిలోని సోలస గ్రామానికి చెందిన సిఅర్పిఎఫ్(2006వ బ్యాచ్)కానిస్టేబుల్ చిన మూర్తయ్య చెందగా వారి పార్ధివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి, అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు మాజీ మ ంత్రివర్యులు స్దానిక శానసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు. అయనతోపాటు జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తోట రాజా రమేష్, మండల టిడీపి పార్టీ అధ్యక్షులు కామినేని సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు. సిఅర్‌పిఎఫ్ కానిస్టేబుల్ చిన మూర్తయ్య పార్ధివదేహాన్ని పలువురు సందర్శించారు. ఇందులో ప్రధానంగా విధులలో ఉండి శలవులో ఇంటికి వచ్చి గుండెపోటుకు గురై మరణించటంతో మంగళవారం అయన పార్ధివదేహాన్ని అధికార పోలీసు లాచనాలతో అంత్యక్రియలను స్దానికంగానే నిర్వహించారు.

## 10వ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



**దుర్గి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** అడిగొప్పల, ఓబులేశునిపల్లె పాఠశాలల 10వ తరగతి విద్యార్థులకు మంగళవారం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. శ్రీతులసి ఎడ్యుకేషన్ ట్రస్ట్ పంపిణీ సహకారంతో ఎస్‌టీయు రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను 128 మంది విద్యార్థిని, విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ యస్‌టీయు వారు రూపొందించబడిన తమ సంస్థ సహకారంతో అందించిన స్టడీ మెటీరియల్‌ను ఉపయోగించుకొని మంచి మార్కులతో విజయం సాధించాలన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదవటానికి స్కాలర్‌షిప్, పరీక్షల సమయంలో పౌష్టికాహారం కూడా అందిస్తామన్నారు. పరీక్షా సామాగ్రిని కూడా అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌టీయు నాయకులు జి.హెచ్ ఆనంతరామయ్య, టి.శ్రీనివాసరావు, వీరేశ్వరరావు, భీమా అప్పారావు, బూసాని శివకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఆలపాటిని గెలిపించాలి

### -మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



**పొన్నూరు, ఫిబ్రవరి 4,ప్రభాతవార్త:** కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మన టిడిపి తరపున మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పోటి చేస్తున్నారని, ఆయనకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కోరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత కార్యాలయంలోని మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు, మాజీ మంత్రి స్వర్గీయ ధూళిపాళ్ళ వీరయ్యచౌదరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ శాసనమండలిలో మన పార్టీ తరపున సంఖ్యా బలాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలన్నారు. ఆలపాటి గెలుపుకు ప్రతి కార్యకర్త, నాయకుడు సైనికుడిలా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాదల వెంకటేశ్వరరావు, బండ్లమూడి బాబూరావు, బొర్రు రామారావు, పఠాన్ పిరోజ్‌ఖాన్, యరసాని శ్రీరామమూర్తి, అలపర్తి చంద్రమోహన్, మగ్బుల్‌బేగ్, లక్ష్మీనారాయణచౌదరి, చలమశెట్టి సీతారామయ్య, పిన్నమనేని కోటేశ్వరరావు, తాడికొండ సుధీర్ తదితరులున్నారు.

## ఉపాధ్యాయుల హక్కులను కాపాడిన కామ్రేడ్ ముఖ్దుం మొహియుద్దీన్



**చిలకలూరిపేట,ఫిబ్రవరి4,ప్రభాతవార్త:** ఉపాధ్యాయ హక్కులను కాపాడేందుకు కామ్రేడ్ ముఖ్దుం మొహియుద్దిన్ ఎంతగానో కృషిచేశారని యస్.టి.యు రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని యస్.టి.యు ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన ముఖ్దుం మొహియుద్దిన్ 118వ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కోటేశ్వరరావు మాట్లాడారు. ఈ సందర్భంగా కె కోటేశ్వరరావు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనలో విద్య,ఉపాధ్యాయుల హక్కులను కాపాడేందుకు ముఖ్దుం మొహియుద్దిన్ నివాసంలో సమావేశమైన కొద్దిమంది ఉపాధ్యాయులతో స్వతంత్ర ఉపాధ్యాయ సంఘాన్ని ముఖ్దుం మొహియుద్దిన్ నాంది పలికారు. 1947 జూన్9వ తేదిన నాటి ప్రభుత్వం 1890 ఉత్తర్వుల ప్రకారం సంఘానికి గుర్తింపు లభించిందని తెలిపారు. హైదరాబాద్ టీచర్స్ యూనియన్‌గా వెలిసిన ఆ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ అనంతరం సంఘాన్ని స్దాపించిన వ్యక్తి కామ్రేడ్ ముఖ్దుం మొహియుద్దిన్ అని తెలిపారు. నల్గొండ జిల్లా హుజూర్‌నగర్ శాసనసభనుండి ఎన్నికై సమసమాజ స్దాపనకోసం, నమ్మిన సిద్దాంతానికి జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు ముఖ్దుం మొహియుద్దిన్ గుర్తుగా 1972 ఆగష్టు17న హైదరాబాద్‌లో ముఖ్దుం భవన్ ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమానికి ముందు ముఖ్దుం మొహియుద్దిన్ చిత్రపటానికి నాయకులు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు పోటు శ్రీనివాసరావు, నియోజకవర్గ సంఘ నాయకులు వినుకొండ అక్కయ్య, మేకల కోటేశ్వరరావు, ఇనకొల్లు అంకమ్మరావు, మురికిపూడి చిన వెంకటస్వామి, కుంభా ఎడుకొండలు, సోమ్లానాయక్, హనుమంతానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## లక్షడప్పులు వేలగొంతులు ర్యాలీని జయప్రదం చేయండి



**దుర్గి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** హైదరాబాద్‌లో ఈనెల 7న జరిగే లక్షడప్పులు....వేలగొంతులు మాదిగల భారీ సాంస్కృతిక ర్యాలీని జయప్రదం చేయాలని ఎమ్మార్పీయస్ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు కందుకూరి రమేష్ మాదిగ కోరారు. దా బ్లీ వాల్‌పోస్టర్‌ను స్థానిక ఎమా ర్పీయస్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. మాన్యశ్రీ మందా కృష్ణమాదిగ ఆధ్వర్యంలో జరిగే ఈ భారీ సదస్సులో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో యంఆఎఫ్ దుర్గి మండల అధ్యక్షులు రాయపాటి కిశోర్‌మాదిగ, చాట్ల దీనయ్య, రాయపాటి మాణిక్యరావు, బొల్లెదుల బుల్లి, రాయపాటి కోటేశ్వరరావు, హరిబాబు, గోపిగాడు చిన్నోడు, కోటి, ఏసయ్య, బాబురావు, నాగరాజు, కందుల సాగర్, మంచు సుబ్బయ్య, అందుగుల సాగర్, మాచర్ల దావీదు, ప్రవీణ్, చాట్ల కిశోర్, శ్రీపతి కాశయ్య, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## మునిసిపల్ ఛైర్మన్ షేక్ రఫానీని పరామర్శించిన గౌడ కార్పోరేషన్ డైరెక్టర్ కందుల రమణ



**చిలకలూరిపేట,ఫిబ్రవరి4,ప్రభాతవార్త:** చిలకలూరిపేట మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫానీ ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకోవడం జరిగింది. విషయం తెలుసుకున్న గౌడ కార్పోరేషన్ డైరెక్టర్ కందుల రమణ, మున్సిపల్ కౌన్సిలర్ గంగా శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం ఛైర్మన్ రఫానీ ఇంటికి వెళ్ళి ఆయన ఆరోగ్య పరిస్దితిని అడిగి తెలుసుకున్నారు, లీలా కృష్ణ వెంకట్‌లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జంతుహింసను మానండి జంతు ప్రేమికులు కాండి



**దుర్గి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** జంతుహింసను మాని, జంతు ప్రేమికులు అవ్వాలని పిరమిడ్ సభ్యులు రాజ్యలక్ష్మీ అన్నారు. మంగళవారం ధ్యానం చేసే పద్ధతి వలన కలిగే ప్రయోజనాలపై దుర్గిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యానం చేసే పద్ధతి దాని వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. ధ్యానం వలన సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. ధ్యానం అంటే శ్వాసమీద జాస, ధ్యానం సర్వరోగ నివారిణి, జ్ఞానం సత్యజ్ఞాన ప్రసాదిని, ధా ్యనం సకల భోగ కారిని అని ప్రచారం నిర్వహించారు. అడిగొప్పలలో లూబిని పిరమిడ్ ధ్యాన మందిర నిర్మాణానికి భాగస్వాములు కావాలని కోరారు.

## ఘనంగా ముఖ్దుం మొహిద్దీన్ జయంతి వేడుకలు



**పొన్నూరు, ఫిబ్రవరి 4,ప్రభాతవార్త:** స్థానిక ఎస్టీయు కార్యాలయంలో ప్రముఖ వృద్ధ కవి తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట నాయకుడు ముఖ్దుం మొహిద్దీన్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగాజరిగిన సమావేశానికి పి.నరేష్‌కుమార్ అధ్యక్షత వహించారు. సమావేశంలో ఎస్టీయు ప్రాంతీయ కార్యదర్శి ముజాఫర్ జానీ మాట్లాడుతూ తెలంగాణా నైజాం నవాబు నిరంకుశ పాలనకు వ్యతిరేకముగా ప్రజలను తన కవితల ద్వారా, పాటల ద్వారా చైతన్య పరిచి రైతాంగ సాయుధ పోరాటం నిర్వహించిన నాయకులలో ప్రముఖుడని చెప్పారు. అయ్యా నీ బాంచెన్ దొర, నీ కాళ్ళ మొక్కుతా ద్వారా అన్న ప్రజలచేత గన్(తుపాకి) పట్టించిన వీరుడని అన్నారు. మొహిద్దీన్ ప్రముఖ ఉర్దూ కవి అని నేటి యువకులు ఉపాధ్యాయులు ఆయన ఆశయ సాధన కోసం నడుంబిగించి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. తొలుత ముఖ్దుం మొహిద్దీన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చలపతిరావు, సూరిశెట్టి శ్రీనివాసరావు, అబ్దుల్ హమీద్, నూరుద్దీన్, కె.రమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నిషేదిత పాలథిన్ కవర్ల విక్రయాలపై నిఘా,దాడులు


### -మునిసిపల్ కమీషనర్ పి శ్రీహరిబాబు



**చిలకలూరిపేటటౌన్,ఫిబ్రవరి4,ప్రభాతవార్త:** పర్యావరణానికి, పట్టణ పారిశుధ్యానికి, ప్రజల ఆరోగ్యానికి హని కలిగిస్తున్న పాలథిన్ కవర్లను ప్రజలు వినియోగించరాదని మున్సిపల్ కమీషనర్ హరిబాబు తెలిపారు. మంగళవారం కమీషనర్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలథిన్‌కవర్లు వినియోగిస్తే చర్యలు తీసుకుంటా మని అన్నారు. 120 మైక్రాన్ల కన్నా తక్కువ మైక్రాన్స్ కలిగిన పాలథిన్ కవర్లు వినియోగించాని, విక్రయించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆహార పదార్ధాలను, వేడిటీ తదితర వాటికి ప్లాస్టిక్ కవర్లు వినియోగించడం వలన ప్లాస్టిక్ కరిగి శరీరంలోకి వెళ్లి క్యాన్సర్ తదితర అనర్ధాలకు కారణం అవుతుందని వివరించారు. వ్యాపారుల తమ లాభాల కొరకు తక్కువ మందం ఉన్న కవర్లు నలుపు, ఇతర రంగులలో ఉన్న కవర్లను సైతం యదేచ్చగా విక్రయిస్తున్నారని, కూరగాయలు, నిత్యావసర సరుకులను వాటిలో పెట్టి సరఫరా చేయడం జరుగుతుందని చెప్పారు. వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుందన్నారు. ఇంటినుండి వచ్చే సమయంలోనే ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా సంచులు తెచ్చుకోవాలని కమీషనర్ సూచించారు.

## ప్రతి ఒక్కరూ క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

### -లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళ అధ్యక్షురాలు అనసూయాదేవి



**పొన్నూరు, ఫిబ్రవరి 4,ప్రభాతవార్త:** ప్రస్తుతం ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న వ్యాధ్యుల్లో క్యాన్సర్ ఒకటని, ఈ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళ అధ్యక్షురాలు మన్నవ అనసూయాదేవి అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఓ మహిళలకు ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా అనసూయాదేవి మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని, పేపర్ కప్పులు, పేపర్ ప్లేట్లు వాడడం కూడా సరియైన విధానం కాదన్నారు. పేపర్ కప్పులు, పేపర్ ప్లేట్స్ వల్ల కూడా క్యాన్సర్ సంక్రమించే అవకాశాలున్నాయని వైద్యులు సూచిస్తున్నారన్నారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం క్యాన్సర్ వ్యాధి గ్రస్తులు ఎక్కువగా కనిపిస్తున్నారన్నారు. క్యాన్సర్‌లలో కూడా వివిధ రకాలు ఉన్నాయన్నారు. క్యాన్సర్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పరాశరం శేషుకుమారి, బి.శబలాదేవి, జి.కృష్ణకుమారి, ఎం.అమరేశ్వరి, కె.శోభ, పి.మోహనలక్ష్మి, పి.లక్ష్మీకుమారి తదితరులున్నారు.

## పెనుగొండ శ్రీవాసవీ పీఠం పీఠాధిపత్యం స్వీకరించనున్న శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి స్వామి



**తెనాలి, ఫిబ్రవరి 4 (ప్రభాతవార్త) :** అఖిల భారత శ్రీ వాసవి పెనుగొండ క్షేత్రమునకు పీఠాధిపతిగా, తెనాలి శ్రీ విద్యాపీఠం నిర్వాహకులు శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి స్వామి పీఠాధిపత్య స్వీకరించుటకు ముహుర్ధము నిర్ణయమైనది. పెనుగొండ శ్రీవాసవీమాత క్షేత్రములో ఈనెల 6,7,8తేదీలలో ఎంతో వైభవంగా నిర్వహించే కార్యక్రమాలలో శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి స్వామి పెనుగొండ పీఠాధిపత్యం స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా స్థానిక గంగానమ్మపేటలోని శ్రీ విద్యాపీఠంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి స్వామి ఉత్సవ కార్యాచరణను వివరించారు. శ్రీసాలిగ్రామ మఠం ప్రధాన కార్యదర్శి రావూరి సుబ్బారావు మాట్లాడుతూ అత్యంత వైభవముగా నిర్వహించే పట్టాభిషేక మహోత్సవానికి తెనాలి, పరిసర ప్రాంత భక్తులు విచ్చేసి పట్టాభిషేక మహోత్సవాన్ని తిలకించి తీర్ధ ప్రసాదాలు స్వీకరించి, శ్రీ వాసవి అమ్మవారి అనుగ్రహం పొందవలసిందిగా కోరారు. ఈ సమావేశంలో ట్రస్ట్ అధ్యక్షులు నంబూరు వెంకట కృష్ణమూర్తి, కోశాధికారి గోపు రామకృష్ణ, ముద్దాబత్తుని రమణయ్య, రఘునాధ్ గుప్తా, పెనుగొండ వెంకటేశ్వరరావు, పోలిశెట్టి సురేష్, అద్దంకి మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## బొప్పూడి కొండమీద ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు



**చిలకలూరిపేటరూరల్, ఫిబ్రవరి4, ప్రభాతవార్త:** మండలంలోని బొప్పూడి గ్రామంలో కొండపై వేంచేసియున్న వీరాంజనేయస్వామి దేవస్దానంలో స్వామివారికి మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి తమలపాకు పూజ, వడమాల సేవ నిర్వహించారు. వందలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్ధప్రసాదాలు స్వీకరించారు.

## అన్నప్రసాద వితరణ

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం నిర్వహించారు. 110 మంది నిరుపేదలకు జనసేన నాయకులు అప్పాపురపు నరేంద్ర ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న పెద్దలు మాట్లాడుతూ నరేంద్ర చేస్తున్న సేవలను కొనియాడారు. కమిటీ సభ్యులు కట్టా శంకరరావు, పోతుగంటి రామకోటేశ్వరరావు, దివ్వెల శ్రీనివాసరావు, నరసింహారావు, చేపూరి నాగేశ్వరరావు, కట్టమూరి అప్పారావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు సేవా కార్యక్రమాలు చేస్తున్నవారిని అభినందించారు.



## ప్రియురాలుతో సహజీవనం చేస్తున్న భర్తకు దేహశుద్ధి చేసిన భార్య

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** ప్రియురాలుతో సహజీవనం చేస్తున్న భర్తను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని భార్య, ఆమె తరపు బంధువులు దేహశుద్ధి చేసి పోలీసులకు మంగళవారం అప్పగించారు. ఈ సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ప్లాస్టిక్ వస్తువులు అమ్ముకుంటూ జీవనం సాగించే ఆకుల వాసుకు నవ్యశ్రీని ఇచ్చి వివాహం చేశారు. అయితే గత కొద్దికాలంగా భార్యకు కనిపించకుండా వాసు తప్పించుకుతిరుగుతున్నాడు. దీంతో వారు పట్టణంలోని ఓ ఇంట్లో ప్రియురాలితో కలిసి వాసు జీవిస్తున్నాడనే సమాచారంతో భార్య నవ్యశ్రీ, వారి బంధువులు ఇంటి వద్దకు వెళ్లారు. వాసు తప్పించుకునే ప్రయత్నం చేయగా వారు పట్టుకున్నారు. ప్రియురాలికి, భర్తకు దేహశుద్ధి చేసి వారిని పోలీసులకు అప్పగించారు. కాగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# పల్లెకు రహదారుల శోభ

**పెదకూరపాడు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** పల్లె పండుగ పేరుతో గ్రామీణ రోడ్లకు మంచి రోజులు వచ్చాయని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చొరవతో ఎప్పుడూ లేని విధంగా కొత్తగా సిమెంట్ రహదారులు నిర్మిస్తున్నామని జిల్లా



తెలుగుదేశంపార్టీ కార్యదర్శి అర్తిమళ్ళ రమేష్ అన్నారు. రామాపురం గ్రామంలో రూ.8 లక్షలతో నిర్మించిన ఐదు సి.సి.రహదారులను ఏఈ రమేష్‌తో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. కూటమి ప్రభుత్వం రాకతో కేవలం మూడు మాసాల వ్యవధిలో దాదాపు రూ.37 కోట్లతో సి.సి., బిటి రహదారులు, గోకులం షెడ్లు రూపుదిద్దుకున్నాయన్నారు. ఒక పెదకూరపాడు మండలంలో ఆరు పనులకు సంబంధించి రూ.4 కోట్లతో పనులు 90 శాతం పూర్తి చేసుకున్నాయన్నారు. పంచాయితీ నిధులతో పెద్ద ఎత్తున సి.సి. రహదారులు, సైడ్ కాలువల పనులు జరుగుతున్నాయన్నారు. త్వరలో మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో రామాపురం నేతలు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా భద్రావతి సమేత భావనా ఋషి కళ్యాణం

**పెదకూరపాడు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** రథసప్తమిని పురస్కరించుకొని పెదకూరపాడు భద్రావతి సమేత భావనాఋషి దేవాలయంలో స్వామివార్లకు కళ్యాణ మహోత్సవం మంగళవారం నిర్వహించారు. ఆలయ అర్చకులు నుదురుపాటి హనుమంతరావు శర్మ, హరినాథ్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు, కళ్యాణం జరిపించారు. ముందుగా కలిసే స్థాపనతో గౌరీ పూజ, పంచామృతాలతో అభిషేకములు, భద్రావతి సమేత భావన ఋషి స్వామివార్లకు కళ్యాణం ఘనంగా నిర్వహించారు. మేళ తాళాలతో స్వామివారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారి కళ్యాణాన్ని తిలకించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు పూజారి హనుమంతరావుశర్మ తీర్థ ప్రసాదాలు అందజేశారు.



## ఆశ్రమంలో సేవా కార్యక్రమం

**రాజుపాలెం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** మండలంలోని కొండమోడు పరిధిలో ఉన్న దీనమ్మ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వహిస్తున్న అనాథ ఆశ్రమంలో మంగళవారం సేవా కార్యక్రమాలను నిర్వహించారు. గోగినేని కళ్యాణ్ - వాణిల కుమారుడు విరాజ్‌సాయి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. అనంతరం అన్నదాన కార్య క్రమాన్ని నిర్వహించారు. సబ్బులు, పేస్ట్‌లు, కొబ్బరినూనె, షాంపులను అందించారు. కార్యక్రమంలో గోగినేని భువిక్‌సాయి, నూతక్కి సాంబశివరావు పాల్గొన్నారు.



## శ్రీ అమరేశ్వరస్వామి దేవస్థానంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేష పూజలు

**అమరావతి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా అమరావతి సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ బాల చాముండికా సమేత అమరేశ్వరస్వామి దేవస్థానంలో ఉపాలయమైన సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానంలో మంగళవారం స్వామివారికి అత్యంత భక్తి శ్రద్ధలతో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరణ చేసి ఆలయ అర్చకులు శంకరమంచి రాజేష్ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి సునీల్‌కుమార్ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.



## మూడు పూరిళ్ళు దగ్ధం

**నిజాంపట్నం, ఫిబ్రవరి 4, ప్రభాతవార్తః** మండలంలోని కొమరవోలు ఎస్‌సి కాలనీలో జరిగిన అగ్నిప్రమాదంలో మూడు పూరిళ్ళు పూర్తిగా దగ్ధమయ్యాయి. వివరాల్లోకి వెళితే కొమరవోలు ఎస్‌సి కాలనీలో నివశిస్తున్న గుమ్మడి పరిశుద్ధరావు, కుమారులు రాజేంద్రప్రసాద్, భాస్కరరావులకు చెందిన పూరిళ్ళు మంగళవారం ఉదయం విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్ కారణంగా దగ్ధమయ్యాయని బాధితులు తెలిపారు. అగ్నిప్రమాదంలో పూరిళ్ళు పూర్తిగా కాలిపోయాయి. సకాలంలో ఫైర్‌సిబ్బంది, గ్రామస్థులు స్పందించి మంటలను అదుపుచేశారు. పెనుప్రమాదం తప్పింది. ఇళ్ళలోని గృహోపకరణాలు, సామానులు పూర్తిగా కాలిపోవటంతో గృహాల యజమానులు నిరాశ్రయులయ్యారు.



## అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం

**నిజాంపట్నం, ఫిబ్రవరి 4, ప్రభాతవార్తః** అగ్నిప్రమాద బాధితులను ఆదుకోవటం కనీసధర్మమని జడ్‌పిటిసి నర్రా సుబ్బయ్య అనాన్నరు. మంగళవారం మండలంలోని కొమరవోలు ఎస్‌సి కాలనీలో జరిగిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన 3 కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే నష్టపరిహారం త్వరగా వచ్చేలా చూస్తానన్నారు. పక్కా గృహాలు నిర్మించుకోవాలని, ప్రభుత్వం నుంచి పక్కా గృహాలు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామప్రజలు పాల్గొన్నారు.



## చనిపోయిన కోళ్లను తినరాదు

**రేపల్లె(నిజాంపట్నం), ఫిబ్రవరి 4, ప్రభాతవార్తః** చనిపోయిన కోళ్ళను తినరాదని పశుసంవర్ధకశాఖ ఎడి నాంచారయ్య హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ చనిపోయిన కోళ్లను కాల్చివేయటం, లేదంటే మూడు అడుగుల గోయి తీసి పాతిపెట్టాలని సూచించారు. చనిపోయిన కోళ్ళను కాలవలలో, రోడ్డుమార్జిన్‌లలో పడవేయరాదన్నారు. ఆరోగ్యంగా ఉన్న కోళ్లను మాత్రమే తినాలని సూచించారు. ఫౌల్ట్రి యజమానులు బయోసెక్యూరిటీ మెజర్స్ తీసుకోవాలని షెడ్డులలో బ్లీచింగ్ పౌడరు ఒకరోజు, మరుసటి రోజు ఫినాయిల్‌తో షెడ్డులను శుభ్రం చేయాలని కోరారు. వైరస్ కారణంగా కోళ్ళు, బ్రాయిలర్స్, లేయర్స్ పెద్దఎత్తున ఉమ్మడి గోదావరి జిల్లాల్లో చనిపోయాయని, వైరస్ నిర్ధారణ కోసం శాంపిల్స్ సేకరించి వెటర్నరీ బయోలాజికల్ రీసెర్స్ ఇన్స్టిట్యూట్ పూణేకు పంపారని రిజల్ట్ కోస ం చూస్తున్నారని తెలిపారు.

## ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో ఎమ్మెల్సీగా గెలిపించాలి : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,ఫిబ్రవరి4,ప్రభాతవార్త:** ఉమ్మడి గుంటూరు,కృష్ణ జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలు ఈనెల 27వతేదిన జరగనున్నాయి. ఆ ఎన్నికలలో పట్టభద్రుల నియోజక వర్గ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయుచున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మాజీమంత్రి నియోజక వర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు కోరారు. మంగళవారం పట్టణ టిడిపి కార్యాలయంలో జరిగిన ఎన్నికల ఆత్మీయ సమావేశానికి ప్రత్తిపాటి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ యువజన నాయకుడిగా శాసనసభ్యుడిగా, మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి అఖండ



విజయం సాధించేలా కృషి చేయాలని కోరారు. కేంద్రంలో నరేంద్రమోడీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందునే రాష్ట్ర ప్రజలు నిర్భయంగా ప్రశాంతంగా జీవిస్తున్నారన్నది కాదనలేని వాస్తవం అని ప్రత్తిపాటి తెలిపారు.వైసిపి ప్రభుత్వంలా దుర్మార్గ రాజకీయం కూటమి ప్రభుత్వం చేయదన్నారు. జగన్ దుర్మార్గం, విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని కాపాడి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గత సంవత్సరం జరిగిన ఎన్నికలలో ప్రజలు చారిత్రకమైన తీర్పును ఇచ్చారని, వారి విశ్వాసం నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. దేశంలోనే అపార అనుభవం ఉన్న నాయకుడు పరిపాలనాదక్షుడుగా చంద్రబాబునాయుడుకు మంచి పేరు ఉందనీ, కీలక సంస్కరణలను అమలు చేస్తున్నారని ఆలపాటి కొనియాడారు. ప్రత్తిపాటి పుల్లారావు ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు దమ్ము, ధైర్యం ఉన్న వారందరిని చేర్చుకొని పార్టీకి నూతన ఉత్తేజం ఇచ్చారని ఆలపాటి తెలిపారు. జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రతి ఒక్క ఓటు అవసరం అని భావించి పార్టీ నాయకులు కార్యకర్తలు గెలుపుకు కృషి చేయాలని ఆలపాటి కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు దాసరి ఉషారాణి,ఎన్నికల ఇన్‌ఛార్జ్ దినేష్‌రెడ్డి, జనసేన పార్టీ నియోజక వర్గ ఇన్‌ఛార్జ్ తోట రాజారమేష్, బి.జె.పి. నియోజకవర్గ కన్వీనర్ తాటిపర్తి జయరామిరెడ్డి, టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, జవ్వాజి మదనమోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, అమరా రమాదేవి, నియోజక వర్గ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పురుషోత్తమపట్నం అంకమ్మ తల్లి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, ఫిబ్రవరి4, ప్రభాతవార్త:** పట్టణంలోని పురుషోత్తమపట్నం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అంకమ్మ తల్లి దేవస్థానం 29వ తిరుణాళ్ళ మహోత్సవంలో మాజీ మంత్రి, నియోజకవర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం పాల్గొ న్నారు. సిరిమాను ఊరేగింపు సందర్భంగా ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల నియోజక వర్గ పరిశీలకులు దినేష్ రెడ్డి, జనసేన పార్టీ నియోజక వర్గ కన్వీనర్ తోట రాజారమేష్, తోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ కాపునాడు పోస్టరును ఆవిష్కరించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్

**చిలకలూరిపేట, ఫిబ్రవరి4, ప్రభాతవార్త:** ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల కూటమి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు నాడు మద్దతు తెలియజేస్తున్నట్టు ముద్రించిన పోస్టర్లను మంగళవారం టిడిపి కార్యాలయంలలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి, నియోజక వర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌ఛార్జ్ దినేష్ రెడ్డి, జనసేన పార్టీ నియోజక వర్గ ఇన్‌ఛార్జ్ తోట రాజారమేష్, భారతీయ జనతా పార్టీ నియోజక వర్గ కన్వీనర్ తాటిపర్తి జయరామిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు మల్లెల శివనాగేశ్వరరావు,రాష్ట్ర కాపునాడు వర్కింగ్ ప్రెసిడెంట్ అంకిరెడ్డి రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



## పెదవడ్లపూడి సాయిబాబా దేవస్థానంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి ప్రత్యేక పూజలు

**చిలకలూరిపేట,ఫిబ్రవరి4,ప్రభాతవార్త:** మంగళగిరి నియోజకవర్గం పెదవడ్లపూడి గ్రామంలో వేంచేసియున్న సాయిబాబా దేవస్థానం 19వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం మాజీమంత్రి, నియోజకవర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొని దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా పరిషత్ మాజీచైర్మన్, బిజెపి సీనియర్ నాయకులు, ఆలయకమిటి చైర్మన్ పాతూరి నాగభూషణం ప్రత్తిపాటిని, రామినేని ఫౌండేషన్ చైర్మన్ రామినేని ధర్మతేజను సత్కరించారు. అనంతరం ప్రత్తిపాటి దేవాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలను సందర్శించి గోసేవలో పాల్గొని నిర్వాహకులను అభినందించారు.

## అప్పలస్వామి గుడిలో అరుణ హోమం

**తెనాలి, ఫిబ్రవరి 4 (ప్రభాతవార్త) :** స్థానిక మారీసుపేటలోని అప్పలస్వామి గుడిగా విరాజిల్లుతున్న శ్రీకోదండ రామస్వామి వారి దేవస్థానంలో రథసప్తమి సందర్భంగా లక్ష్మీ గణపతి నవగ్రహ, రుద్ర సహిత, అరుణ హోమం మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ధర్మకర్త లంక శివానంద్‌కుమార్, ఆలయ సమన్వయకర్త విష్ణుభట్ల ఆంజనేయశాస్త్రి పర్యవేక్షణలో నిర్వహించిన యజ్ఞపూలలో ధర్మకర్తలు కునపల్లి నారాయణస్వామి, లంక శివానంద్‌కుమార్, లంక శివాంజనేయప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ ఆరోగ్యంతో సుఖ సంతోషాలతో ఉండాలని లోకా సమస్త సుఖినోభవంతు అనే నినాదంతో అరుణ హోమం నిర్వహించామని ఆలయ ధర్మకర్త లంక శివానందకుమార్ తెలిపారు.



## రథసప్తమి వేళ సూర్యప్రభ వాహనంపై వైకుంఠపుర వాసుడు

**తెనాలి, ఫిబ్రవరి 4 (ప్రభాతవార్త) :** శ్రీలక్ష్మీ పద్మావతి సమేతుడైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారు సప్తాశ్వముల వాహనంపై పట్టణ ప్రజలకు దర్శనమిచ్చారు. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో విశిష్ట పూజలు నిర్వహించిన అర్చక స్వాములు, స్వామి వారిని అమ్మవారు సప్తస్వముల వాహనంపై ఆసీనులను చేసి, పట్టణములు నగరోత్సవం నిర్వహించారు. ఆలయ సహాయ కమీషనర్ వి.అనుపమ, ధర్మకర్తల మండలి చైర్మన్ కుంభం సాయిబాబు, మండలి సభ్యులు ఆధ్వర్యంలో నగరోత్సవ శోభాయాత్ర విశేషంగా నిర్వహించారు.



## ఎపి అసెంబ్లీలో కూడా ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించాలి -బిజెఆర్ కమిటీ

**తెనాలి, ఫిబ్రవరి 4 (ప్రభాతవార్త) :** తెలంగాణా ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లుకు అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించిన తీరుగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఎస్సీ వర్గీకరణ బిల్లు విషయంలో మాదిగ సామాజిక వర్గం ఆశలను ఆకాంక్షలను నెరవేర్చే విధంగా ఆమోదం తెలపాలని బిజెఆర్ కమిటీ నాయకులు మేకల సురేష్‌బాబు పేర్కొన్నారు. స్థానిక మారీసుపేటలోని బీజేఆర్ కమిటీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో సురేష్‌బాబు మాట్లాడుతూ హైదరాబాదులో ఈనెల 7వ తేదిన నిర్వహించనున్న లక్ష డబ్బులు, వేయి గొంతుకలు కార్యక్రమంలో మాదిగ సామాజిక వర్గంలోని యావన్మంది పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కొండముది బోసుబాబు మాట్లాడుతూ మాదిగల ఆత్మ గౌరవాన్ని చాటుతూ నిర్వహించే లక్ష డబ్బులు వేయి గొంతుకలు కార్యక్రమంలో సంఘీయులు స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా ఎపి ప్రభుత్వం వర్గీకరణ బిల్లును ఏకగ్రీవ మద్దతు తెలపాలన్నారు. ఈ సందర్భంగా ప్రచార పోస్టర్లను ఆవిష్కరించి, హలో మాదగ చలో హైదరాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ సమావేశంలో బిజెఆర్ కమిటీ కార్యదర్శి నలుకుర్తి సద్గుణరావు, ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు అలపర్తి చిన్ని, పినపాటి వందనరాజు, బడుగు సురేష్, కె.శరత్, తెనాలి రాజేష్, కొత్తపల్లి చిరంజీవి, పి.ఆదం, వివిధ విభాగాల సభ్యులు పాల్గొన్నారు.



## ఎన్ఎస్ఎన్ కళాశాలలో 6న నేషనల్ వర్క్‌షాప్

**నరసరావుపేట, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో ఈ నెల 6వతేదీ గురువారం నేషనల్ వర్క్‌షాప్ జరుగుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్ మంగళవారం తెలియజేశారు. వర్క్‌షాప్‌కు సంబంధించిన బ్రోచర్లను కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయ్‌కుమార్, నాగసరపు సుబ్బరాయగుప్తా లు ఆవిష్కరించారు. రీసోర్స్ పర్సన్‌గా డాక్టర్ డి.శ్రీనివాస్ హాజరౌతారని తెలియజేశారు. నాగార్జున యూనివర్శిటీ నుండి వారు పాల్గొంటారని, జెఎన్‌టియు



కళాశాలకు చెందిన చంద్రశేఖర్ హాజరౌతారన్నారు. డిఎన్ఏ, హెచ్‌పిఎల్‌సి ప్రయోగాలలో ఇటీవల వచ్చిన సాంకేతిక టెక్నిక్స్‌ను ప్రయోగపూర్వకంగా వివరించడం జరుగుతుందన్నారు. వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ ఐ.సదాశివారెడ్డి, కో కన్వీనర్ పి.శ్రీనివాసరావు, ఆర్.వేణుమాధవ్‌లు పాల్గొన్నారు. వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయ్‌కుమార్, నాగసరపు సుబ్బరాయగుప్తాలు సూచించారు.

## కిషోర బాలికలు క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహనతో మెలగాలి : డాక్టర్ శారద

**తెనాలి, ఫిబ్రవరి 4 (ప్రభాతవార్త) :** ఆరోగ్య బాగ్యంతోనే అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతామని క్యాన్సర్ వ్యాది పట్ల పరిపూర్ణ అవగాహన అవసరమని డాక్టర్ శారద సర్వీస్ సొసైటీ నిర్వాహకులు డాక్టర్ శారద పేర్కొన్నారు. ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక కొత్తపేటలోని మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో డి3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బాలికలకు క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. స్కూల్ హెచ్ఎంఎస్ రాజ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో డాక్టర్ శారద మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా క్యాన్సర్ ఎన్ని విధాలుగా వస్తుంది, రాకుండా ఎలా నివారించుకోవాలో వివరించారు. బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ లక్షణాలను తెలియజేశారు. గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ గురించి వివరించారు. లోపలి పొరలో, క్యాన్సర్ వస్తే నివారణ చర్యలు అరుదుగా ఉన్నాయన్నారు. క్యాన్సర్ లక్షణాలు దరిచేరకుండా 9నుండి 15సంవత్సరాల లోపు బాలికలు హెచ్‌పివి వ్యాక్సిన్ రెండు డోసులు తీసుకోవాలన్నారు. 40 సంవత్సరాల లోపు మహిళలు మూడు డోసులు తీసుకోవాలన్నారు. గర్భసంచి ఎలా ఉంటుందో, డెమో ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో కనపర్తి బెన్హర్, అలపర్తి వెంకటేశ్వరరావు, బిటివిఎస్ నారాయణ, ఏవి ప్రసాద్, ఉపాధ్యాయునీలు, విద్యార్థులు పాల్గొన్నారు.



## సుబ్రహ్మణ్యపురంలో కొలువు తీరనున్న శ్రీ సర్వహితేశ్వర స్వామి

**తెనాలి, ఫిబ్రవరి 4 (ప్రభాతవార్త) :** ఆధ్యాత్మిక చింతనకు ఆలవాలమైన తెనాలి ప్రాంతంలో భక్తులే స్వయముగా అభిషేకములు నిర్వహించుకునేందుకు వీలుగా శ్రీ బాలాంబికా సమేత శ్రీ సర్వహితేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి సమాయత్తమవుతున్నట్లు మహా విద్యాపీఠం కార్యవర్గం పేర్కొన్నారు. మండలంలోని పెదరావూరు శివారు సుబ్రహ్మణేశ్వరపురంలో వేంచేసియున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి ప్రక్కనే, నూతనంగా శ్రీశంకర విజయేంద్ర సరస్వతి మహా స్వామి వారి దివ్య అనుగ్రహంతో ఈనెల 10వ తేదిన నూతన శివాలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించనున్నట్లు మహా విద్యాపీఠం ముఖ్యులు చింతపల్లి సుబ్రహ్మణ్యేశ్వర శర్మ పేర్కొన్నారు. మంగళవారం శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారి సన్నిధానంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సుబ్రహ్మణ్య శర్మ మాట్లాడుతూ ఐదు సంవత్సరముల క్రితం శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారి ఆలయాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. అదే విధంగా స్వామి అనుగ్రహంతో ఈనెల 10వ తేదిన ఉదయం 11గంటల32నిమిషాలకు, శ్రీలక్ష్మీ గణపతి శ్రీబాలాంబికా సమేత శ్రీ సర్వహితేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆస్తికులు అందరూ దేవాలయ నిర్మాణంలో తమకు తోచిన విధంగా భాగస్వాములు కావాలని కోరారు. శ్రీ సర్వహితేశ్వర స్వామి ఆలయ విశిష్టతను వివరిస్తూ శివాలయాల్లో అర్చకులు మాత్రమే అభిషేకములు నిర్వహిస్తారని, నూతనముగా నిర్మించనున్న శ్రీ సర్వహితేశ్వర స్వామి సన్నిధానంలో భక్తులే స్వయముగా స్వామికి అభిషేకములు నిర్వహించుకునే సదవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో శుభలగ్న పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాలడుగు లక్ష్మణరావు, సిహెచ్ లక్ష్మీ నరసింహామూర్తి, శుభంశర్మ తదితర భక్తులు పాల్గొన్నారు. కాగా రథసప్తమి ప్రాధాన్యతను చాటుతూ మహా విద్యాపీఠం ప్రాంగణంలో అరుణ హోమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదములు పంపిణీ చేశారు.



## సప్తవర్ణ సూర్య యంత్రానికి ప్రత్యేక పూజలు

**తెనాలి, ఫిబ్రవరి 4 (ప్రభాతవార్త) :** ఆరోగ్య భాస్కర అనుగ్రహ సిద్ధికి సప్తవర్ణ సూర్య యంత్ర పూజలకు ఎంతో ప్రాధాన్యత ఉందని ప్రధాన అయ్యప్ప దేవాలయం గురుస్వామి సూర్యోపాసకులు దుర్భ హరిబాబు స్వామి పేర్కొన్నారు. రదసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక బాలాజీరావుపేట అయ్యప్పపురంలో వేంచేసియున్న ప్రధాన అయ్యప్ప దేవాలయ ప్రాంగణంలో, సూర్యోపాషకులు దుర్భా హరిబాబు స్వామి స్వయంగా సప్తవర్ణములతో సూర్య యంత్రాన్ని తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్య యంత్ర పితామహులు సద్గురు రాందాస్ మహారాజ్, తాతయ్య స్వామి శిష్యరికంలో సూర్యారాధన ప్రాధాన్యతను చాటుతూ ప్రతి సంవత్సరం రథసప్తమికి సూర్య యంత్ర పూజలు నిర్విఘ్నముగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హుం ఖం ఖ:కోల్కాయ నమ: అనే మంత్రం మననం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం, ఐశ్వర్యం సిద్ధిస్తాయని చెబుతూ భక్తులకు మంత్ర మననం చేయు తీరును వివరించారు. భక్తులు విశేషంగా సూర్య యంత్ర పూజలలో పాల్గొన్నారు. అనంతరం యావన్మంది భక్తులకు తీర్థ ప్రసాదములు, తోరములు పంపిణీ చేశారు.



## ఎన్‌సిసి విద్యార్థుల ప్రతిభ

**నరసరావుపేట, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** మండలంలోని లింగంగుంట్ల శంకరభారతీపురం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఎన్ఈసి కళాశాలలో జరిగిన జూబ్లియేషన్ 2కె25లో నిర్వహించిన పోటీలలో పాల్గొని బహుమతులు సాధించారు. మంగళవారం ఏపి, తెలంగాణ రాష్ట్రాల పరిధిలోని ఐదు జిల్లాల నుండి ఎన్‌సిసి క్యాడెట్స్ పాల్గొన్నారు. స్క్వాడ్ డ్రిల్‌లో మొదటిస్థానం, టగ్‌ఆఫ్‌వార్‌లో ద్వితీయ స్థానం, గ్రూప్ డ్యాన్స్‌లో ద్వితీయస్థానం సాధించారు. ఆయా విభాగాలకు బండి రవికుమార్ కమాండర్‌గా వ్యవహరించారు. ఐక్యత, క్రమశిక్షణ ఆశయంగా ఎన్‌సిసి విద్యార్థులు వారి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను హెచ్ఎం ఎం.పార్వతీ అభినందించారు. ట్రైనర్ పమ్మి వెంకటరెడ్డి, ఫాతిమాలు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## సంపద తయారీ కేంద్రాల పరిశీలన

**నకరికల్లు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** మండలంలోని పలు గ్రామాలలో ఉన్న సంపద తయారీ కేంద్రాలను ఈవోపిఆర్‌డి కె.వి.ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. పంచాయితీ అధికారి విజయభాస్కరరెడ్డి ఆదేశాల మేరకు ఎంపిడిఓ కాశయ్య సూచనల మేరకు ఈ కార్యక్రమం జరిగిందన్నారు. మండలంలోని దేచవరం, రూపెనగుంట్ల, తురకపాలెం గ్రామాలలో సంపద తయారీ కేంద్రాలను తనిఖీ చేశారు. పంచాయితీ కార్యదర్శులు ఈ నెల 15వతేదీ లోపు మండలంలోని అన్ని షెడ్డుల నుండి వర్మీకంపోస్ట్ ఎరువును తయారు చేయాలని ఆదేశాలిచ్చారు.

# 'భవానీ వార్డ్ 1997' ప్రీ రిలీజ్ ఈవెంట్

హారర్, సస్పెన్స్, థ్రిల్లర్ కాన్సెప్ట్‌తో 'భవానీ వార్డ్ 1997' చిత్రాన్ని జీడీఆర్ మోషన్ పిక్చర్, విభూ మీడియా సమర్పణలో చంద్రకాంతసోలంకి, జీడీ నరసింహా నిర్మించారు. ఈ మూవీకి జీడీ నరసింహా దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో గాయత్రీ గుప్తా, గణేష్ రెడ్డి, పూజా కేంద్రే, సాయి సతీష్, జబర్దస్త్ అప్పారావు, ఈశ్వర్ బాబు ధూళిపూడి తదితరులు నటించారు. ఈమూవీ ఫిబ్రవరి 7న రిలీజ్ కాబోతోంది. ఈ క్రమంలో సోమవారం నాడు ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నిర్మాత రాజ్ కందుకూరి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ ఈవెంట్‌లో,ప్రముఖ నిర్మాత రాజ్ కందుకూరి మాట్లాడుతూ, "భవానీ వార్డ్ 1997' ఈ మూవీ టైటిల్ పోస్టర్‌ను నేనే లాంఛ్ చేశారు. సాయి సతీష్ పిలవడం వల్లే నేను ఇక్కడకు వచ్చాను. సినిమా రిలీజ్ టైం దగ్గర పడుతుంటే టీంకు ఓ టెన్షన్ ఉంటుంది. ఈ సినిమాను ఎంతో కష్టపడి చేశారు. అది వీళ్ల మాటల్లోనే అర్థం అవుతోంది. ఇక ఆడియెన్స్ ఇచ్చే రిజల్ట్ కోసం వీరంతా ఎదురుచూస్తున్నారు. వీళ్ల టెన్షన్ పోగొట్టేందుకు, మోరల్ సపోర్ట్ ఇచ్చేందుకు వచ్చాను. కంటెంట్ ఉన్న సినిమాలే ఇప్పుడు ఆడుతున్నాయి. ఈ చిత్రంలో కంటెంట్ ఉందని నేను నమ్ముతున్నాను. నాకు హారర్ చిత్రాలంటే చాలా ఇష్టం. ఈ మూవీ పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. చిన్న చిత్రాలే పెద్ద సౌండ్ చేస్తున్నాయి. ఇలాంటి సినిమాలకు మీడియా సపోర్ట్ ఇవ్వాలి. ఫిబ్రవరి 7న రాబోతోన్న ఈ మూవీని అందరూ చూసి సక్సెస్ చేయండి' అని అన్నారు. దర్శకుడు జి.డి. నరసింహా మాట్లాడుతూ, 'మా సినిమా ఈవెంట్‌కు వచ్చి సపోర్ట్ చేసిన రాజ్ కందుకూరికి థాంక్స్. సీనియర్ జర్నలిస్ట్ రాంబాబు మాకోసం వచ్చి సపోర్ట్ చేశారు. ఈ ప్రయాణంలో నాకు అండగా నిలిచిన సాయి సతీష్‌కి థాంక్స్. మా సినిమాలో ప్రతీ ఒక్కరూ అద్భుతంగా నటించారు. గణేష్, పూజా కేంద్రే ఇలా అన్ని పాత్రలకు మంచి రెస్పాన్స్ వస్తుంది. మ్యూజిక్ మీ అందరినీ భయపెట్టేలా ఉంటుంది. విజువల్స్ చాలా కొత్తగా ఉంటాయి. ఫిబ్రవరి 7న మా చిత్రం రాబోతోంది. అదే రోజున తండేల్ కూడా రాబోతోంది. అన్ని సినిమాలు చూసి సపోర్ట్ చేయండి. హారర్ చిత్రాలను ఇష్టపడే వారందరికీ మా భవానీ వార్డ్ 1997 నచ్చుతుంది' అని అన్నారు.



# 'హరి హర వీరమల్లు' విజయం సాధిస్తాం..


పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా తాను నిర్మిస్తున్న భారీ చిత్రం హరి హర వీరమల్లు ఘన విజయం సాధిస్తుందని ప్రముఖ నిర్మాత ఎ.ఎం. రత్నం నమ్మకం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 4న తన పుట్టినరోజు సందర్భంగా ప్రకటన విడుదల చేసిన ఎ.ఎం.రత్నం, హరి హర వీరమల్లుతో పవన్ కళ్యాణ్ అభిమానులతో పాటు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయే చిత్రాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. భారతదేశం గర్వించదగ్గ నిర్మాతలలో ఒకరు ఎ.ఎం. రత్నం. కేవలం నిర్మాతగానే కాకుండా గీత రచయితగా, రచయితగా,దర్శకుడిగా తెలుగు, తమిళ సినీ పరిశ్రమలలో తనదైన ముద్ర వేశారు. ఎ.ఎం.రత్నం 1953 ఫిబ్రవరి 4వ తేదీన నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డి పాలెంలో జన్మించారు. సినిమానే తన జీవితంగా భావించి, అసాధారణ కృషితో అంచెలంచెలుగా ఎదుగుతూ భారతీయ సినీ దిగ్గజాలతో ఒకరిగా నిలిచారు. కర్తవ్యం వంటి మహిళా సాధికారత సబ్జెక్ట్‌తో నిర్మాతగా ప్రయాణాన్ని ప్రారంభించిన ఎ.ఎం.రత్నం, తొలి చిత్రంతోనే చరిత్రలో నిలిచిపోయే అడుగు వేశారు. నిర్మాతగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా తన సినీ ప్రయాణంలో ఆయన ఎల్లప్పుడూ నైతికత, సామాజిక బాధ్యతను కొనసాగించారు. సమాజంపై చెడు ప్రభావాన్ని చూపించే చిత్రాలను ఎ.ఎం.రత్నం ఎప్పుడూ నిర్మించలేదు. కుటుంబ విలువలు, ఐక్యత గురించి చెప్పే పెద్దరికం, సంకల్పం వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు ఎ.ఎం.రత్నం. నిర్మాతగా కూడా నైతికత, సామాజిక బాధ్యతతో ఇండియన్, నట్పుక్కాగ, కథలర్ దినం, ఖుషి, బాయ్స్, గిల్లి, 7/జి రెయిన్‌బో కాలనీ వంటి చిత్రాలను నిర్మించారు. మెగా బడ్జెట్ చిత్రాల నిర్మాతగా పేరుగాంచిన ఈ దిగ్గజ నిర్మాత, ఎ.ఆర్. రెహమాన్, శంకర్ వంటి భారతీయ సినిమా దిగ్గజాలతో పలు సినిమాలకు చేతులు కలిపారు. అలాగే స్నేహం కోసం చిత్రానికి మెగాస్టార్ చిరంజీవితో కలిసి పనిచేశారు.






# 'ది అవార్డ్ 1996' ట్రైలర్ విడుదల

దేశానికి రైతన్న ఎంత ముఖ్యమో.. దేహానికి నేతన్న అంతే ముఖ్యం. అలాంటి చేనేత రంగంలో ప్రతిభా వంతులైన కళాకారులు దళారుల చేతుల్లో ఎలా మోసపోతున్నారనే కథాంశంతో భూదాన్ పోచంపల్లికి చెందిన యువ దర్శకుడు బడుగు విజయ్ కుమార్ దర్శకత్వం వహించిన చిత్రం ది అవార్డ్ 1996. పలు యదార్థ సంఘటన ఆధారంగా మెగా మేజ్ ఎంటర్ టైన్మెంట్స్ పతాకంపై శ్రీకాంత్ సి సమర్పణలో చిరందాసు ధనుంజయ్ నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో సురేష్ ప్రొడక్షన్స్ అధినేత శ్రీ సురేష్ బాబుగారి చేతుల ది అవార్డ్ ట్రైలర్ ను విడుదల చేశారు. ట్రైలర్ ఆద్యంతం వీక్షించిన సురేష్ బాబు దర్శక నిర్మాతలు, నటీ నటులు, సాంకేతిక నిపుణులను అభినందించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ, ది అవార్డు 1996 ట్రైలర్ చాలా బాగుంది. మంచి హృదయంతో ఈ సినిమా తీశారు. చేనేత కళాకారులు, వారి సమస్యలను సమాజానికి చూపించాలను కోవడం అభినందనీయం. సోషల్ రిలవెంట్ టాఫిక్ ఇది, ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుంది అన్నారు. అనంతరం చిత్ర యూనిట్‌కు సంబంధించిన ఇతర వివరాలను సురేష్ బాబు అడిగి తెలుసుకున్నారు. తమ మూవీ ట్రైలర్‌ను సురేష్‌బాబు విడుదల చేయడం పట్ల నిర్మాత ధనుంజయ్ ఆనందం వ్యక్తం చేశారు. ఎంతో అను భవం ఉన్న నిర్మాత సురేష్ బాబుకు ట్రైలర్‌నచ్చడం, సినిమా గురించి అడిగి తెలుసు కోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ట్రైలర్ కంటే సినిమాలో ప్రేక్షకులకు ఆకట్టుకునే ఎన్నో అంశాలున్నాయన్నారు. త్వరలోనే ది అవార్డ్‌ను ప్రేక్షకుల ముందు కు తీసుకొస్తామని తెలిపారు. ఈ చిత్రంలో శివరామ్ రెడ్డి, సాయి చందన జంటగా నటించగా బన్నీ అభిరన్ కీలక పాత్ర పోషించారు. సంగీతం: ప్రశాంత్ మార్క్, సినిమాటోగ్రాఫర్: లింగా గౌడ్, ఎడిటింగ్:



# ఫ్యూర్ లవ్ స్టోరీ 'తండేల్'

యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య, సాయి పల్లవి హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'తండేల్'. చందూ మొండేటి దర్శకత్వంలో మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో గీతాఆర్ట్స్ బ్యానర్‌పై ఫ్యాషనేట్ ప్రొడ్యూసర్ బన్నీవాసు నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న ప్రపంచ వ్యాప్తంగా భారీగా విడుదల కానుంది. ఇప్పటికే రిలీజైన ప్రమోషన్స్ కంటెంట్ హ్యూజ్ బజ్‌ని క్రియేట్ చేసింది. ఈ రోజు నిర్మాత బన్నీవాసు విలేకరుల సమావేశంలో 'తండేల్' విశేషాల్ని పంచుకున్నారు.




**'తండేల్' ఎలా స్టార్ట్ అయ్యింది?**

నా క్లాస్ మేట్ భాను. తను కో ప్రొడ్యూసర్‌గా కూడా చేస్తాడు. రైటర్ కార్తిక్ దగ్గర ఈ కథ విని బావుందని నా దగ్గరికి తీసుకొచ్చాడు. కార్తిక్ చెప్పిన కథలో ఎసెన్స్ నాకు చాలా నచ్చింది. తనది కూడా మత్సలేశ్యం ఊరు పక్కనే. అక్కడ స్ఫూర్తి పొంది కథని రాసుకున్నాడు. పాయింట్ నాకు చాలా నచ్చింది. కార్తికేయ 2 తర్వాత చందుకి ఈ కథ వినమన్నాను. తనకీ చాలా నచ్చింది. అలా డెవలప్ చేసుకుంటూ వచ్చాం.

**తండేల్ టైటిల్ జస్టిఫికేషన్ ఏమిటి?**

మత్సలేశ్యం అనే ఊరుని భేస్ చేసుకుని తీసుకున్న కథ ఇది. ఇక్కడి వారు గుజరాత్ పోర్ట్‌కి ఫిషింగ్ కి వెళ్తారు. అక్కడ బోట్లు వున్న వారికి బిరుదులు వుంటాయి. మెయిన్ లీడర్‌ని తండేల్ అంటారు. ఇది గుజరాతీ వర్డ్.

**తండేల్ అవుట్ పుట్ చూసి నాగార్జున రెస్పాన్స్ ఏమిటి?** రీసెంట్‌గా ఆయన్ని నేను కలవలేదు. అయితే కంటెంట్ ఆయనకి బాగా నచ్చిందని చైతన్య చెప్పారు. **చైతుకి ఈ కథ ఎప్పుడు చెప్పారు?** నాలుగేళ్ల క్రితం ఓ ఇన్విటేషన్ ఇవ్వడానికి వెళ్లాను. ఈ మధ్య విన్న మంచి కథ ఏమిటని అడిగారు. అప్పుడు ఈ కథ గురించి చెప్పాను. ఆయనకి పాయింట్ చాలా నచ్చింది. భలే వుంది మనం చేస్తున్నామని అన్నారు. అయితే ఇందులో ఫిషర్ మ్యాన్ క్యారెక్టర్, సముద్రంలోకి వెళ్లిన తర్వాత నెలల పాటు స్నానం వుండదు, అంతా ఒరిజినల్ లా షూట్ చేయాలని అనుకుంటున్నాం.. యాస కూడా వుంటుందని చెప్పాను. ఖినేను వర్క్ చేస్తాఖినని చెప్పారు. ఆయన ఈ పాత్ర కోసం మోల్డ్ అయిన విధానం అద్భుతం. ఆడియన్స్ అందరికీ ఫెబ్రవరి 7న చైతు సర్ ప్రైజ్ ఇస్తారు. చివరి అరగంట కుమ్మేశారు. సాయి పల్లవి సినిమా చూసి నేను మామూలుగా చేసుకుంటూ వెళ్లాను.

**దేవిశ్రీ మ్యూజిక్ గురించి?** ఇది రూటెడ్ స్టోరీ. నేచురల్‌గా షూట్ చేశాం. అంత నేచురల్‌గా మ్యూజిక్ కూడా వుంటుంది. ఇప్పటికే పాటలు బ్లాక్ బస్టర్ అయ్యాయి.

**ఇందులో సిజీ వర్క్ ఉందా?** ఇందులో తుపాన్ ఎపిసోడ్ తప్పితే మిగతా సీన్స్ అన్నీ ఒరిజినల్ సముద్రంలోనే షూట్ చేశాం. ప్రతి షాట్ ఒరిజినల్‌గా వుంటుంది. షామ్ దత్ అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. ఈ సినిమాని కేరళ, మంగళూరు, గోవా, వైజాగ్ ఇలా నెంబర్ అఫ్ లోకేషన్స్‌లో షూట్ చేశాం. ఈ సినిమాకి చేసినంత అవుట్ డోర్ ఏ సినిమాకి చేయలేదు. ఆర్ట్ వర్క్ కూడా అద్భుతంగా వుంటుంది. ఈ కథ చెప్పే విధానం నేచురల్‌గా వుండాలి. ప్రతి ఫేస్ కొత్తగా ఫ్రెష్‌గా వుండాలి. అందుకే చాలా వరకూ కొత్త ఫేసస్‌ని తీసుకున్నాం.

**ట్రైలర్‌లో దాదాపుగా కథ చెప్పిన భావన కలిగింది?** ట్రైలర్‌లో చూసింది తక్కువే. అందరికి తెలియనిది సినిమాలో చాలా వుంది. జైల్లో ఎలాంటి ఇన్సిడెంట్స్ ఎదురుకున్నారో ఎవరికీ తెలీదు. సినిమాలో చాలా ఇంట్రస్టింగ్ కంటెంట్ వుంది.


# 28న వరల్డ్ వైడ్ 'శబ్దం' రిలీజ్

'వైశాలి'తో సూపర్‌హిట్‌ని అందించిన హీరో ఆది పినిశెట్టి, దర్శకుడు అరివళగన్‌లు రెండోసారి మరో ఇంట్రస్టింగ్ సూపర్‌నేచురల్ క్రైమ్ థ్రిల్లర్ 'శబ్దం' కోసం చేతులు కలిపారు. 7బి ఫిల్మ్స్ శివ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన ఫస్ట్ లుక్ పోస్టర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజా మేకర్స్ 'శబ్దం' రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. ఈ చిత్రం ఫిబ్రవరి 28, 2025న తెలుగు, తమిళం, కన్నడ హిందీ భాషలలో ఒకేసారి ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల అవుతుందని మేకర్స్ అఫీషియల్‌గా ప్రకటించారు. 'వైశాలి'లో 'వాటర్' హారర్ ఎలిమెంట్‌తో అందరినీ ఆకట్టుకున్న దర్శకుడు అరివజగన్ ఈ సినిమాలో 'సౌండ్' అనే సూపర్ నేచురల్ ఫ్యాక్టర్‌గా ఉపయోగించారు. లక్ష్మీ మీనన్ ఈ సినిమాలో హీరోయిన్. సిమ్రాన్, లైలా, రెడిన్ కింగ్స్లి, ఎంఎస్ భాస్కర్, రాజీవ్ మీనన్ వంటి ప్రముఖ నటులు ఈ చిత్రంలో నటిస్తున్నారు. 7జి ఫిల్మ్స్ శివ తమిళ చిత్ర పరిశ్రమలో 225కి పైగా చిత్రాలను పంపిణీ చేసి ద్రౌపతి, రుద్ర తాండవం వంటి చిత్రాలను సహ నిర్మాతగా చేయడం ద్వారా ప్రముఖ స్థానాన్ని కలిగి వుంది. ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మించడం ద్వారా ఆయన ఇప్పుడు నిర్మాతగా తన ప్రయాణాన్ని ప్రారంభించారు. ఇది ఇప్పటివరకు ఆది కెరీర్‌లో మొదటి భారీ బడ్జెట్ చిత్రం. ఈ చిత్రం అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించబడింది, ప్రేక్షకులకు 'హారర్' స్టయిల్‌లో కొత్త తరహా సినిమా అనుభవాన్ని అందిస్తుంది. సంగీత దర్శకుడు తమన్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందించారు, ఈ సినిమా సౌండ్ ఆధారంగా రూపొందినందున, ఈ చిత్రానికి అవుట్ స్టాండింగ్ ఆడియోగ్రఫీని టి ఉదయ్ కుమార్ సమకూర్చారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులుతుది దశకు చేరుకునాయి. ప్రేక్షకులు గొప్ప సినిమాటిక్ అనుభవాన్ని పొందేలా విజువల్ ఎఫెక్ట్స్, సౌండ్ ఎఫెక్ట్స్ ఉండబోతున్నాయి. ఈ చిత్రం వి సినిమాస్ ద్వారా ఆంధ్ర, తెలంగాణలో గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. తారాగణం: ఆది పినిశెట్టి, సిమ్రాన్, లైలా, లక్ష్మీ మీనన్, రెడిన్ కింగ్స్లి, ఎం.ఎస్. భాస్కర్, రాజీవ్ మీనన్ బ్యానర్: 7జి ఫిల్మ్స్, నిర్మాత: శివ డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: అరుణ్ బత్మనాబన్, స్టంట్‌లు: స్టన్నర్ సామ్.



# 'కాంత' ఫస్ట్ లుక్ పోస్టర్లు

రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా, దుల్కర్ సల్మాన్ వేఫేరర్ ఫిల్మ్స్, ప్రఖ్యాత సురేష్ ప్రొడక్షన్స్ భాగస్వామ్యంతో, సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన మల్టీ లింగ్వెల్ ఫిల్మ్ కాంతను నిర్మిస్తోంది. ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్ లీడ్ రోల్‌లో నటించగా, భాగ్యశ్రీ ఫీమేల్ లీడ్‌గా, సముద్రఖని కీలకపాత్రలో కనిపించనున్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కాంత ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దుల్కర్ సల్మాన్ 13 సంవత్సరాల చిత్ర పరిశ్రమలో అద్భుతమైన ప్రయాణం పూర్తి చేసుకున్న సందర్భంగా విడుదల చేశారు. నిర్మాతలు విడుదల చేసిన రెండు పోస్టర్లు దుల్కర్ సల్మాన్‌ను కొత్త హెయిర్ స్టైల్‌తో కూడిన సూట్‌లో అద్భుతంగా, ఇంటెన్స్ అవతార్‌లో చూపిస్తున్నాయి. ఒక పోస్టర్‌లో ఆయన సిగరెట్ తాగుతున్నట్లు, మరొక పోస్టర్‌లో ఆయన ఫెరోషియస్ ఎక్స్ ప్రెషన్‌తో కనిపించారు. 1950ల మద్రాస్ నేపథ్యంలో తెరకెక్కిన కాంత ఆ ఎరాలో మానవ సంబంధాలు, సామాజిక, సంక్లిష్టతలను ప్రజెంట్ చేస్తోంది. దుల్కర్ సల్మాన్ 2012లో అరంగేట్రం చేసినప్పటి సక్సెస్‌ఫుల్‌గా కెరీర్‌ని కొనసాగిస్తున్నారు. తన ప్రతిభ, అంకితభావంతో ప్రశంసలు అందుకున్నాడు. బెంగళూరు డేస్, కన్నుమ్ కన్నుమ్ కొలయాడితల్, ఓ కాదల్ కన్మణి, మహానటి కురుప్ వంటి ప్రసిద్ధ చిత్రాల నుంచి సీతా రామం లక్కీ భాస్కర్ వంటి ఇటీవలి భారీ విజయాలతో దూసుకుపోతున్నారు. కాంత సినిమాను అభిమానులకు చూపించడమే కాకుండా, దుల్కర్ సల్మాన్ 13వ సంవత్సరం సినీ జీవితంలో అద్భుతమైన మైలురాయిని జరుపు కుంటున్నందుకు మేము చాలా సంతోషంగా ఉన్నాము అని నెట్‌ఫ్లిక్స్‌లో గతంలో ది హంట్ ఫర్ వీరప్పన్ అనే డాక్యుమెంటరీ సిరీస్‌ను అందించిన చిత్ర దర్శకుడు సెల్వమణి సెల్వ రాజ్ అన్నారు. ఈ చిత్రం, నటుడి కెరీర్ లాగానే గొప్ప ప్రయాణాన్ని ప్రతిబింబిస్తుంది అన్నారు. ఈ సినిమా రానా దగ్గుబాటి నేతృత్వంలోని స్పిరిట్ మీడియా రూపంలో రెండు ప్రముఖ నిర్మాణ సంస్థలను ఒకచోట చేర్చింది, ఇది అతని తాతగారు, దిగ్గజ డి. రామానాయుడు యొక్క అద్భుతమైన వారసత్వాన్ని ముందుకు తీసుకువెళుతుంది మరోవైపు, మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి కుమారుడు దుల్కర్ సల్మాన్ నేతృత్వంలోని వేఫేరర్ ఫిల్మ్స్ కూడా భాగమైయింది.



# సస్పెన్స్ మూవీ 'ఒక పథకం ప్రకారం'

సంచలన దర్శకుడు పూరి జగన్నాథ్ సోదరుడు సాయిరామ్ శంకర్ నటించిన సీట్ ఎడ్జ్ సస్పెన్స్ థ్రిల్లర్ ఒక పథకం ప్రకారం. వినోద్ విహాన్ ఫిల్మ్స్ విహారి సినిమా హౌస్ ప్రై. లిమిటెడ్ బ్యానర్స్‌పై గార్లపాటి రమేష్‌తో కలిసి నిర్మిస్తూ వినోద్ కుమార్ విజయన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. శ్రీలక్ష్మి ఫిలిమ్స్‌పై బాపిరాజు ఈ మూవీని రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ ఎత్తున రిలీజ్ చేస్తున్నారు. రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటంతో ప్రమోషన్స్‌లో భాగంగా దర్శక, నిర్మాత వినోద్ కుమార్ విజయన్ మీడియాతో ముచ్చటించారు. ఆయన చెప్పిన ఆసక్తికరమైన విషయాలివే..**మీ సినీ జర్నీ ఎలా ప్రారంభమైంది? మాలీవుడ్‌లో మీరు చేసిన చిత్రాలేంటి?** చాలా చిన్న వయసులో మాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చాను. నేను అక్కడ ప్రొడక్షన్ చేశాను. చాలా చిత్రాలను నిర్మించాను. దర్శకత్వం వహించాను. నేను చేసిన చిత్రాలకు జాతీయ అవార్డులు కూడా వచ్చాయి. ఫాహద్ ఫాజిల్‌ను, గోపీ సుందర్ వంటి వారిని ఇండస్ట్రీకి నేనే పరిచయం చేశాను. ఇప్పుడు మమ్ముట్టి సర్, ఫాహద్ ఫాజిల్‌లతో ప్రాజెక్టులు కూడా చేస్తున్నాను.




**ఒక పథకం ప్రకారం సినిమా జర్నీ ఎలా ప్రారంభమైంది?**

చిన్నప్పుడు మా ఇంటి పక్కన తెలుగు వాళ్లుండే వారు. వారింట్లోనే నేను ఎక్కువగా ఉండేవాడ్ని. అలా నాకు తెలుగు అలవాటు అయింది. ఆ టైంలో వారింట్లో నేను ఎన్టీఆర్ సినిమాలు చూసేవాడిని. తెలుగులో నాకు సినిమా చేయాలని ఎప్పటి నుంచో ఉంది. పైగా నాకు సాయి రామ్ శంకర్ ఎప్పటి నుంచో తెలుసు. మేం ఇద్దరం చాలా మంచి స్నేహితులం. ఓ సారి ఈ కథ గురించి చెప్పాను. అలా ఈ జర్నీ ప్రారంభమైంది.

**ఒక పథకం ప్రకారం ఎలా ఉండబోతోంది? కాన్సెప్ట్ ఏంటి?**

ఇది ఒక స్క్రీన్ ప్లే బేస్డ్ మూవీ. ప్రతీ శుక్రవారం ఎన్నో సినిమాలు వస్తుంటాయి. ఈ శుక్రవారం మాత్రం ప్రేక్షకులు చాలా కొత్త ఎక్స్‌పీరియెన్స్‌ను చూడబోతోన్నారు. సినిమా స్టార్టింగ్ నుంచి ఎండింగ్ వరకు సీటు అంచున కూర్చోబెట్టేలా ఉంటుంది. ఇంటర్వెల్‌లోనే విలన్ ఎవరో కనిపెట్టండని ముందే సవాల్ విసురుతున్నాం.

**ఒక పథకం ప్రకారం ప్రమోషన్స్‌ను ఎలా ప్లాన్ చేశారు?** ఇంటర్వెల్ తరువాత విలన్ ఎవరో కనిపెడితే పది వేలు ఇస్తా మని అంటున్నాం.

# 'కర్మ స్థలం' ఫస్ట్ లుక్ లాంచ్

రాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై శ్రీనివాస్ సుబ్రహ్మణ్య నిర్మాణంలో రాకీ షెర్మన్ తెరకెక్కించిన చిత్రం 'కర్మ స్థలం'. ఈ సినిమాలో అర్చనశాస్త్రి, మితాలి చౌహాన్, వినోద్ అల్వా, కలకేయ ప్రభాకర్, బాలగం సంజయ్, నాగ మహేష్, దిల్ రమేష్, చిత్రం శ్రీను ముఖ్య పాత్రలు పోషించారు. పాన్‌ఇండియా రేంజ్‌లో ఈచిత్రాన్ని రిలీజ్ చేయబోతున్నారు. ఈ క్రమంలో ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. కర్మస్థలం అంటూ రిలీజ్‌చేసిన ఈ పోస్టర్‌లో కనిపించిన పాత్రలు, ఆ పోస్టర్‌ను డిజైన్ చేసిన తీరు ఆకట్టుకునేలా ఉంది. ఇక అర్చనా లుక్, గెటప్ ఈ పోస్టర్‌లో హైలెట్ అవుతోంది. బ్యాక్ గ్రౌండ్‌లో అమ్మవారి షాడో కనిపించడం చూస్తుంటే.. ఈ చిత్రానికి ఏ రేంజ్‌లో వీఎఫ్ఎక్స్ ను వాడారో అర్థం చేసుకోవచ్చు. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌తో సినిమా మీద అంచనాలు పెంచేశారు. ఫస్ట్ లుక్ లాంచ్ చేసిన అనంతరం.. హీరోయిన్ అర్చన మాట్లాడుతూ, 'మహిషాసుర మర్దిని కాన్సెప్ట్‌తో ఈ మూవీని తెరకెక్కించారు. ఇంత మంచి సబ్జెక్ట్‌ని, కర్మ స్థలం వంటి అద్భుతమైన టైటిల్‌తో సినిమాను తెరకెక్కించిన రాకీ గారికి థాంక్స్. కథను చెప్పేందుకు వచ్చినప్పుడు రాకీని చూసి కొత్త వాడు కదా.. ఎలా తీస్తారో అని అనుకున్నాను. కానీ కథను అద్భుతంగా నెరేట్ చేశారు. కథను చాలా మంది అద్భుతంగా చెబుతారు. ఈ సినిమాకు పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్' అని అన్నారు. దర్శకుడు రాకీ షెర్మన్ మాట్లాడుతూ, 'కర్మ స్థలం' సినిమాకి మేం అంతా ప్రాణం పెట్టి, ఎంతో ఇష్టంతో పని చేశాం. వీఎఫ్ఎక్స్ పనుల వల్ల ఈ చిత్రం ఆలస్యం అవుతూ వచ్చింది. పాన్ ఇండియా రేంజ్‌లో ఆకట్టుకునేలా ఈ సినిమా ఉంటుంది. నిర్మాత శ్రీనివాస్ నా వెన్నంటి ఉండి నడిపించారు. ఈ చిత్రానికి పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్' అని అన్నారు. నిర్మాత శ్రీనివాస్ సుబ్రహ్మణ్య మాట్లాడుతూ, 'కర్మ స్థలం' సినిమాను ఎంతో కష్టపడి చేశాం. మా దర్శకుడు ఈ మూవీని పాన్ ఇండియా రేంజ్‌లో అందరినీ ఆకట్టుకునేలా చేశారు. అర్చన గారు అద్భుతంగా నటించారు. మా సినిమా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. సంగీత దర్శకుడు ఎం.ఎల్. రాజా మాట్లాడుతూ, 'నా మీద నమ్మకం పెట్టి నాకు ఈ అవకాశాన్ని ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. పాటలు చాలా బాగా వచ్చాయి. ముమ్ముందు అవి రిలీజ్ కాబోతున్నాయి. అందరికీ నచ్చేలా ఈ చిత్రం ఉంటుంది' అని అన్నారు.



5-2Pg5.qxd:5-2Pg5.qxd 01/01/01 8:20 AM Page 1




# అంతరిక్షంలో ఏం జరుగుతోంది?

## మన నావిగేషన్ ఉపగ్రహం పనిచేస్తుందా! కూలిపోతుందా?

## భూకేంద్రాల నుంచి అలుపెరగకుండా శ్రమిస్తున్న శాస్త్రవేత్తలు

## ఇప్పటికీ అసలు కక్ష్యను చేరని ఎన్‌విఎస్-2



రాకెట్ ప్రయోగానికి ముందు క్లీన్ రూంలో నావిగేషన్ ఉపగ్రహానికి తుది పరీక్షలు చేస్తున్న దృశ్యం (ఫైల్)

**శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:** భారత నావిగేషన్ ఉపగ్రహం ఎన్‌విఎస్2 ఇస్రో శాస్త్రవేత్తలను కంటికి కునుకు లేకుండా చేస్తోంది. ఈ ఉపగ్రహం ప్రస్తుతం అంతరిక్షంలో పరిభ్రమించకుండా ఒక్కచోటనే ఉండిపోయినట్లు తెలుస్తోంది. నావిగేషన్ సేవల కోసం శ్రీహరికోట నుంచి గత నెల 29న జిఎస్‌ఎల్‌వి-ఎఫ్15 రాకెట్ ద్వారా 2,250 కిలోల బరువు ఉన్న ఎన్‌విఎస్-02 ఉపగ్రహాన్ని ఇస్రో అంతరిక్షంలోకి చేర్చింది. సాధారణంగా నిర్ణీత కక్ష్యకు కొంచెం అటుఇటూ వెళ్లినప్పటికీ ఉపగ్రహంలోని లామ్‌ను మండించి ఖచ్చితమైన కక్ష్యకు చేరుస్తారు. ఈ వ్యవస్థ ఒక్క జిఎస్‌ఎల్‌వి రాకెట్లోనే ఉంటుంది. భూమి నుంచి కనీసం 36 వేల కిలోమీటర్ల జిఎస్‌ఓ ఆర్బిట్‌లో ఉపగ్రహం పనిచేయాల్సి రావడంతో లిక్విడ్ అపోజి మోటార్ (లామ్)ను ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం ఈ లామ్ పనిచేయడం లేదు. దీనితో ఉపగ్రహంలోని త్రస్టర్లను మండించడానికి శాస్త్రవేత్తలు మరో ప్రయత్నం చేస్తున్నారు. బెంగళూరు సమీపంలోని హసన్‌లో ఉన్న మాస్టర్ కంట్రోల్ ఫెసిలిటీ కేంద్రం నుంచి శాస్త్రవేత్తలు అంతరిక్షంలోని ఉపగ్రహాన్ని నియంత్రించే కార్యక్రమంలో ఉన్నారు. వాస్తవానికి 29న ప్రయోగించిన 100వ రాకెట్ ఈ ఉపగ్రహాన్ని క్షేమంగానే విడిచిపెట్టింది. గత నెల 30న అందులో సాంకేతిక లోపం తలెత్తింది. మొదటిసారి రైజింగ్ ఆపరేషన్ చేయాలనుకున్నప్పుడే లోపం శాస్త్రవేత్తలు గమనించినట్లు సమాచారం. మళ్లీ ఈనెల 1న రెండోసారి రేజింగ్ ఆపరేషన్ సమయాన ఉపగ్రహం పనితీరు సక్రమంగా లేదని గుర్తించారు. ఆక్సిడైజర్ పిఎల్‌కు అందిస్తే ఉపగ్రహం పూర్తిగా తమ అదుపులోకి వచ్చి అనుకున్న కక్ష్యకు చేరువై మిగిలిన నావిగేషన్ ఉపగ్రహాలతో కలిసి ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు నమ్ముతున్నారు. అయితే అది సాధ్యమేనా అనే అనుమానాలు లేకపోలేదు. ఒకవేళ ఉపగ్రహం అక్కడే కదలకుండా ఉంటే అంతరిక్షంలో ఏదయినా ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదని కొందరు అంటున్నారు. ఈ ఉపగ్రహాన్ని వేరే ఉపగ్రహాలు ఢీకొనడం వంటి సంఘటనలు జరిగే అవకాశాన్ని కాదనలేక పోతున్నారు. అలాకాకుండా ఉపగ్రహాన్ని క్రమేణా భూవాతావరణంలోకి తీసుకొచ్చి ప్రమాదం తప్పించవచ్చన్నది ఒక ప్రయత్నంగా ఉంది. అయితే ఎన్‌విఎస్02 నుంచి ఇస్రో శాస్త్రవేత్తలు ఇప్పటిదాకా కావాల్సిన సమాచారం రాబట్టుకోవడం మాత్రమే చేస్తున్నారు. త్రస్టర్లను మండించలేకపోవడం, వృత్తాకార కక్ష్యకు ఉపగ్రహం చేరకపోవడం వలన కక్ష్యలో వచ్చే మార్పుల కారణంగా ఉపగ్రహం ముక్కలై మండిపోవడం జరుగుతుందన్నది ఒక వాదన. భవిష్యత్ తరం నావిక్ వ్యవస్థలో భాగంగా ఇస్రో ఇప్పటికే ఎన్‌విఎస్01ను ప్రయోగించి ఉంది. ఇది రెండవ ఉపగ్రహం. మరో మూడు ఇలాంటి ఉపగ్రహాలు ప్రయోగించి ఒక దానికొకటి సహకారంతో మన జిపిఎస్ సేవలు విస్తృతం చేయాలని శాస్త్రవేత్తలు నమ్మకం పెట్టుకొని దీన్ని ప్రయోగించారు. కనీసం రూ.300 కోట్లు వెచ్చించినట్లు తెలుస్తోంది. అయితే ఈ ఉపగ్రహం ఏదయినా అయితే మళ్లీ మరో నాలుగు ఉపగ్రహాలను రూపొందించాల్సిన అవసరం ఇస్రో శాస్త్రవేత్తలకు ఉంది. దానికి కొంత సమయాభావం పడుతుందని లెక్కలు వేస్తున్నారు. మొత్తంమీద పూర్తి స్వదేశీ నావిగేషన్ వ్యవస్థ మనకు అందుబాటులోకి రావాలంటే ఈ ఉపగ్రహం పనితీరు మెరుగుపడాలని ప్రజలు కూడా ఆశిస్తున్నారు.

# రాహుల్‌పై సభా హక్కుల ఉల్లంఘన నోటీస్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపైజరిగిన చర్చలప్రారంభంలో రాహుల్‌చేసిన ప్రసంగం సభాహక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని బిజెపి ఎంపి నిషికాంత్ దూబె లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు విజ్ఞప్తి చేసారు. రాహుల్‌గాంధీ పార్లమెంటులో స్వయంగా చైనీ దళాలు భారత గడ్డపై ఉన్నాయని ప్రకటించారు. ఆయన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు తీవ్రంగా స్పందిస్తూ రాహుల్ అబద్ధాలు వల్లెవేస్తున్నారంటూ పెద్దపెట్టున నినాదాలుచేసారు. రాహుల్ ప్రసంగంలో చరిత్రాత్మక అంశాలను విస్మరించారని, మన దేశాన్ని అపహాస్యం చేసారని, భారత గణతంత్ర వ్యవస్థను కించపరిచారంటూ దూబె తన లేఖలో స్పీకర్‌కు వివరించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలుతెలిపే అంవంపై ప్రసంగించిన రాహుల్ తన ప్రసంగంలో కేంద్రంలోని ఎన్డీయే సర్కారు, ప్రధాని మోడీపై ధ్వజమెత్తారు. ఉత్పత్తిరంగాన్ని నిర్వీర్యం చేసారని, మేకిన్ ఇండియా కార్యాచరణ మంచిదే అయినా భారత్ వినియోగించుకోలేకపోయిందని, అందుకు బాధ్యత ప్రధాని మోడీదేనని అన్నారు. అంతేకాకుండా చైనా దళాలు భారత గడ్డపైకి ప్రవేశించడానికి కూడా ప్రధాని మోడీయే బాధ్యుడనితెలిపారు. కాంగ్రెస్ నాయకుడు బోగస్ వార్తలనుప్రచారంచేస్తున్నారని ఇలాంటి అసంబద్ధ వాదనలు, భావజాలం, భాషను ఇకపై వాడకూడదని గుర్తుచేస్తున్నామని మంత్రి కిరెన్ రిజిజు అన్నారు. ఆ తర్వాత స్పీకర్ ఓంబిర్లాను కలిసి గాంధీ వ్యాఖ్యలకు ఆధారాలు చూపించాలని డిమాండ్ చేసారు. అంతేకాకుండా బిజెపి ఎంపిలు గాంధీపై సభాహక్కుల నోటీస్ ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నారు. సాక్ష్యాధారాలు చూపించకపోతే హక్కుల ఉల్లంఘననోటీస్ తప్పదని వారంటున్నారు. పార్లమెంటను తప్పుదోవ పట్టించేవిధంగా వ్యవహరించినసభ్యులపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు జారీచేసే హక్కు పార్టీ ఎంపిలకు ఉంటుంది. పార్లమెంటులో ప్రసంగిస్తూ రాహుల్ గాంధీ నిరుద్యోగం అంశాన్ని కూడా ప్రస్తావించారు. ఉత్పత్తిరంగ ఉద్యోగాలను చైనాకు అప్పగించేసామని, చైనా దళాలు మనభూభాగంలోని 4వేల కిలోమీటర్ల లోపలికి చొచ్చుకువచ్చాయని ఆరోపించారు. మేకిన్‌ఇండియా విఫలం కావడంతోనే చైనా మన భూభాగంలోకి వచ్చేస్తోందని ఉత్పత్తిరంగానికి కూడా చైనాకు అప్పగిస్తున్నామని ఆయన ఆరోపించారు.

# నేడు మహాకుంభ మేళాకు ప్రధాని మోడీ



## త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లో జరుగుతున్న అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహాకుంభమేళాలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 5న ఆయన త్రివేణీ సంగమంలో పుణ్యస్నానం ఆచరించనున్నట్లు సమాచారం. ఈ మేరకు ప్రధాని షెడ్యూల్‌ను ఓ సీనియర్ ఐపిఎస్ అధికారి చెప్పినట్లు సమాచారం. బుధవారం ఉదయం 10 గంటలకు ప్రధాని ప్రయాగ్‌రాజ్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి 10.45 గంటలకు అరైల్ ఘాట్‌కు వెళతారు. ఘాట్ నుంచి బోటులో ప్రయాణించి మహాకుంభమేళా జరుగుతున్న ప్రాంతానికి చేరుకుంటారు. ఉదయం 11 గంటల నుంచి 11.30 గంటల మధ్య త్రివేణీ సంగమంలో ప్రధాని పుణ్యస్నానం ఆచరిస్తారు. 11.45 గంటలకు బోటులో తిరిగి అరైల్ ఘాట్‌కు వెళతారు. అక్కడి నుంచి ప్రయాగ్‌రాజ్ ఎయిర్‌పోర్టుకు వెళ్లి ఢిల్లీ బయలుదేరుతారు అని సదరు సీనియర్ పోలీస్ అధికారి వెల్లడించినట్లు సమాచారం. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని ఎలాంటి కార్యక్రమాల్లో పాల్గొనబోరని తెలుస్తోంది. కేవలం పుణ్యస్నానం ఆచరించి గంగానదికి పూజలు చేయనున్నారని సమాచారం. దాదాపు గంటన్నర పాటు మోడీ ప్రయాగ్‌రాజ్‌లో ఉండనున్నారు. ఈ క్రమంలోనే నగరంతో పాటు కుంభమేళా వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. ప్రధాని వెంట యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఉండనున్నారట. మహా కుంభమేళా ప్రారంభానికి ముందు ప్రధాని మోడీ ప్రయాగ్‌రాజ్ వెళ్లిన సంగతి తెలిసిందే. రూ.5500కోట్లతో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. 144యేళ్లకోసారి వచ్చే జనవరి 13న కుంభమేళా ప్రారంభం కాగా ఫిబ్రవరి 26వ తేదీ వరకు కొనసాగనుంది. ఇప్పటికే దాదాపు 35కోట్లకు పైగా భక్తులు కుంభమేళాకు వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించారు.

# ట్రంప్ చర్యకు చైనా ప్రతిచర్య



## దిగుమతులపై సుంకాలు పెంచిన జిన్‌పింగ్

## భయాలు రేకెత్తిస్తోన్న ఇరు దేశాల వాణిజ్య యుద్ధం

**వాషింగ్టన్, ఫిబ్రవరి 4:** అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదలుపెట్టిన వాణిజ్య యుద్ధానికి చైనా నుంచి బలమైన ప్రతిస్పందన వచ్చింది. చైనా నుంచి వచ్చే అన్ని ఉత్పత్తులపై 10 శాతం సుంకం విధిస్తూ ట్రంప్ కార్య నిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేయగా.. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే బొగ్గు, లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్‌లపై 15 శాతం సుంకాలు విధిస్తున్నట్లు చైనా ప్రకటించింది. చమురు, వ్యవసాయ పరికరాలపై ఆ టారిఫ్ 10 శాతం ఉంటుందని స్పష్టం చేసింది. టంగ్‌స్టన్ సంబంధిత పదార్థాల ఎగుమతులపై నియంత్రణ విధించింది. పివిహెచ్ కార్పొరేషన్, ఇల్యుమినా ఇంక్ వంటి అమెరికా సంస్థలను విశ్వసనీయత లేని వాటి జాబితాలో చేర్చింది.


ఇదేగాకుండా అనైతిక వ్యాపార పద్ధతులు అవలంబిస్తున్న అమెరికాకు చెందిన టెక్ దిగ్గజం గూగుల్‌పైనా చైనా విచారణ జరపనుంది. ఈ రెండు పెద్ద దేశాలు ఒకదానిపై ఒకటి సుంకాలు విధించుకోవడంతో ట్రేడ్ వార్ భయాలు మొదలయ్యాయి. ఇప్పటికే చైనా కరెన్సీ యువాన్ విలువ పతనమైంది. ఆ ప్రభావం ఇతర దేశాల కరెన్సీలపైనా పడింది. ఆస్ట్రేలియా డాలర్, న్యూజిలాండ్ డాలర్ విలువలు పడిపోయాయి. ట్రంప్ సుంకాలు విధించడంపై ఇప్పటికే చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ మండిపడింది. దాన్ని డబ్ల్యుటిఒలో సవాల్ చేస్తామని ప్రకటించింది. తమ దేశ ప్రయోజనాలు, హక్కులు కాపాడుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. ఇతర దేశాలను సుంకాలతో ప్రతిసారీ బెదరించకుండా, ఫెంటానిల్ వంటి సమస్యలను సొంతంగా పరిష్కరించుకోవాలని అమెరికాకు చైనా హితవు పలికింది.

తాజాగా సుంకాల రూపంలో కౌంటర్ ఇచ్చింది. ఇదిలా ఉంటే ముందు నుంచీ హెచ్చరిస్తున్నట్లుగానే తమ పొరుగుదేశాలైన మెక్సికో, కెనడాలతోపాటు చైనాపైనా ట్రంప్ సుంకాల కొరడా ఝుళిపించారు. దీర్ఘకాలిక మిత్రదేశాలైన కెనడా, మెక్సికోల నుంచి తాము దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై 25 శాతం చొప్పున టారిఫ్ విధించారు.

అయితే ఈ రెండు దేశాల విషయంలో తర్వాత ట్రంప్ కాస్త ఉపశమనం కల్పించారు. ఇరు దేశాలల అధినేతలు అమెరికా సరిహద్దుల వెంట భద్రతను కట్టుదిట్టం చేస్తామని హామీ ఇవ్వడంతో టారిఫ్‌ల అమలును నెల రోజుల పాటు నిలిపివేశారు.

# మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మెమోరియల్‌కు స్థలం కేటాయించిన కేంద్రం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ డిసెంబర్‌లో తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆయన స్మారకం ఏర్పాటుకోసం కేంద్రం భూమి కేటాయించిందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఢిల్లీలోని రాజ్‌ఘాట్ ప్రాంగణంలో మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ స్మారకం కోసం ఇచ్చిన స్థలం పక్కనే ఉన్న ఈ భూమిని సింగ్ కుటుంబ సభ్యులకు ఇచ్చిందని పేర్కొన్నాయి. ఈ ప్రక్రియ కోసం సింగ్ కుటుంబ సభ్యులు ఏర్పాటు చేయనున్న ట్రస్ట్ కోసం ప్రభుత్వం వేచి చూస్తోందని మీడియా కథనాలు తెలిపాయి. ఒకసారి



అది ఏర్పాటైన తర్వాత ఆ స్థలాన్ని అప్పగించనుంది. అంతేకాకుండా నిర్మాణం నిమిత్తం రూ.25 లక్షలు ఇవ్వనుంది. ఢిల్లీలోని రాజ్‌ఘాట్ ప్రాంగణంలోని రాష్ట్రీయ సమితి కాంప్లెక్స్‌లో ప్రణబ్‌ముఖర్జీ స్మారకం కోసం ప్రభుత్వం స్థలం కేటాయించింది. ఈ విషయాన్ని గత నెల ఆయన కుమార్తె శర్మిష్ఠ ముఖర్జీ ధృవీకరించారు. కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఢిల్లీ సిఎం అతిశిపై పోలీసుల ఎఫ్‌ఐఆర్




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు మరికొద్దిగంటల్లో పోలింగ్‌ప్రారంభం అవుతున్న తరుణంలో ఢిల్లీ ముఖ్యమంత్రి ఆప్ ఎమ్మెల్యే అతిషి మొర్లేనాపై పోలీసులు కేసునమోదు చేసారు. ఆమె కల్కాజీ అసెంబ్లీస్థానంనుంచి పోటీచేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించారంటూ ఆమెపై ఢిల్లీపోలీసులు కేసునమోదు చేసారు. స్థానిక గోవింద్‌పూరి పోలీస్‌స్టేషన్‌లో ఢిల్లీసీఎం అతిశిపై పలు సెక్షన్లకింద కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసు దర్యాప్తు సాగుతోందని పోలీస్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఫతేసింగ్ మార్గ్‌లో ఆప్ అభ్యర్థి అతిషి 50నుంచి 70 మంది మద్దతు దారులతోపాటు పది వాహనాలతో కనిపించడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆప్రాంతాన్ని ఖాళీ చేయాలని పోలీసులు ఆదేశించారు. కానీ ఆ అధికారిని తన విధులు నిర్వర్తించకుండా అడ్డుకున్నారని పోలీసులు వాదిస్తున్నారు. మరోవైపు సీఎం అతిశి తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. బిజెపి అభ్యర్థిరమేష్ బిదూరితోపాటు వాళ్లకుటుంబ సభ్యులు బహిరంగంగా దాడులకు దిగుతున్నారని విమర్శించారు. వీరిపై ఎన్నికల సంగం ఎలాంటి చర్యలు చేపట్టదన్నారు. ఆ క్రమంలో ఎన్నికల కమిషన్‌పై ఆమె విమర్శలు గుప్పించారు.

# శీఘ్రంగా అణుబాంబు తయారీపై ఇరాన్ సైంటిస్టుల దృష్టి

**టెహ్రాన్, ఫిబ్రవరి 4:** ఇరాన్ ప్రభుత్వం అణుబాంబు తయారుచేయాలనుకోవాలనే దానిని సిద్ధం చేసేందుకు ఉన్న మార్గాలను అక్కడి శాస్త్రవేత్తలు రహస్య యత్నాలు మొదలుపెట్టారు. ఈ విషయాన్ని అమెరికా ఇంటెలిజెన్స్ వర్గాలు పసిగట్టినట్లు ఇటీవల న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రచురించింది. దేశ నాయకత్వం నుంచి అణుబాంబు తయారీకి గ్రీన్‌సిగ్నల్ వచ్చిన వెంటనే అందుబాటులో ఉన్న యూరేనియం నిల్వలతో కొనిన నెలల్లోనే దానిని సిద్ధం చేసేలా ప్రణాళిక వేస్తున్నారు. ఇంటెలిజెన్స్ అధికారులు సమాచారాన్ని బైడెన్ అధికారంలో ఉన్నప్పుడే సేకరించారు. తాజాగా ఇప్పుడు ట్రంప్ కార్యవర్గంతో కూడా దీనిని పంచుకొన్నారు.

ఇటీవల సిరియా, పాలస్తీనా, లెబనాన్‌లో చోటు చేసుకొన్న పరిణామాలతో పశ్చిమాసియాలో ఇరాన్ పట్టు సడలిపోయింది. దానిని పరోక్ష బలగాలను ఇజ్రాయెల్, అమెరికా మద్దతుతో



సిరియా తిరుగుబాటుదారులు అణచివేశారు. ఇజ్రాయెల్ క్షిపణి, వైమానిక దాడులతో ఆయుధ తయారీ సామర్థ్యం కూడా దెబ్బతిన్నది. మరోవైపు ట్రంప్ అధికారం చేపట్టిన వెంటనే ఇజ్రాయెల్‌లో నెతన్యాహును బలోపేతం చేశారు. ఇక ఇరాన్ కూడా బాంబుగ్రేడు యూరేనియంను ఉత్పత్తి చేసే దిశగా తన సంట్రిఫ్యూజ్ లో మార్పులు చేసి 60 శాతం వరకు శుద్ధి చేస్తోందని అంతర్జాతీయ అణుశక్తి చెబుతోంది. పౌర అణు అవసరాల కోసం ఏ దేశం కూడా ఆ స్థాయిలో యూరేనియంను శుద్ధి చేయదని చెబుతున్నారు.

వాస్తవానికి ఒక అణుబాంబు తయారీకి 42 కిలోలు 90 శాతం శుద్ధి చేసిన యూరేనియం ఉంటే సరిపోతుంది. ప్రస్తుతం ఇరాన్ వద్ద 200 కిలోల మేరకు 60 శాతం శుద్ధి చేసిన యూరేనియం ఉంది. గత వారం ఇరాన్ విదేశాంగ మంత్రి మాట్లాడుతూ తమ అణు స్థావరాలపై దాడులు చేస్తే చాలా వేగంగా, బలంగా స్పందిస్తామని హెచ్చరించారు. ఇది ఆలౌట్ వార్‌కు దారి తీస్తుందని పేర్కొన్నారు.

# విదేశీయులను వెంటనే పంపించేయండి



## అసోం ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** అసోం ప్రభుత్వంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అక్రమంగా రాష్ట్రంలోకి వచ్చిన విదేశీయులను వెంటనే పంపివేయకుండా నిర్బంధ కేంద్రాల్లో నిరవధికంగా ఉంచడంపై మండిపడింది. వారిని స్వస్థలాలకు పంపడానికి ముహూర్తం కోసం ఎదురు చూస్తున్నారా అని ప్రశ్నించింది. నిర్బంధ కేంద్రాల్లో ఉంచిన 63 మందిని రెండు వారాల్లోగా పంపించేయాలని న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఎవరైనా దేశంలోకి అక్రమంగా ప్రవేశించినవారని తెలిసినప్పుడు వారిని పంపివేయడానికి వెంటనే చర్యలు తీసుకోవాలి. నిర్బంధంలో ఉన్న విదేశీయులను వారి దేశాలకు పంపించమంటే వారి చిరునామా తెలియదని పేర్కొంటూ మీరు తరలింపు ప్రక్రియను ప్రారంభించడానికి నిరాకరిస్తున్నారు. అది మనం పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశంకాదు. అలాగే వారిని జీవితాంతం కేంద్రంలో ఉంచి పోషించలేం కదా వెంటనే వారిని వారి దేశాలకు తరలించండి. దానికి ఏమైనా ముహూర్తం కోసం ఎదురుచూస్తున్నారా? అని సుప్రీం కోర్టుప్రశ్నించింది. అస్సాంలో ఉన్న అన్ని నిర్బంధ కేంద్రాల నుంచి ఇప్పటి వరకు ఎంత మందిని వారిదేశాలకు పంపించారన్న నివేదికలను సమర్పించాలని ఆదేశించింది. అస్సాం సహా మరి కొన్ని రాష్ట్రాల్లో అక్రమ వలసదారులు పెద్ద ఎత్తున పెరిగిపోవడంతో స్థానికుల్లో అభద్రతా భావంఅధికమవుతోంది. తమ వనరులు పొరుగు దేశస్తుల పాలవుతున్నాయని తాము మైనారిటీలుగా మారే ముప్పుందని వారు వాపోతున్నారు. వలసదారుల్లో కొందరు మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతూ దేశభద్రతకు ముప్పుగానూ పరిణమిస్తున్నారు. ఈనేపథ్యంలో అక్రమంగా రాష్ట్రంలోకి ప్రవేశిస్తున్న వారిని తమ దేశాలకు పంపడంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన అత్యున్నత న్యాయస్థానం పై విధంగా స్పందించింది.


# మైయిటీలను రెచ్చగొడుతున్న సిఎం బీరేన్‌సింగ్

## సుప్రీంలో కుకీ మానవహక్కుల సంస్థ పిటిషన్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 4:** మణిపూర్‌రాష్ట్రంలో జాతుల వైరాన్ని ముఖ్యమంత్రి బీరేన్‌సింగే రెచ్చగొడుతున్నారని దాఖలయిన పిటిషన్లపై విచారణకు ముందు సిఎఫ్‌ఎస్‌ఎల్ నివేదిక వచ్చిన తర్వాత నిర్ణయిస్తామని సుప్రీంకోర్టుప్రకటించింది. లీక్ అయిన ఆడియో టేపులను సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీకి పంపించామని, ఆ స్వరం ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్‌దేనా అని నిర్ధారించిన తర్వాత పిటిషన్ల విచారణపై నిర్ణయానికి వస్తామని చీఫ్‌జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన బెంచ్ ప్రకటించింది. సిఎఫ్‌ఎస్‌ఎల్ నివేదిక ఆరువారాల్లోపు సీల్డ్ కవర్‌లో అందచేయాలని ఆదేశించింది. పిటిషన్ విచారణను మార్చి 24వ తేదీకి వాయిదా వేసింది. తదుపరి వాయిదాకు ముందు ఈ కేసును మళ్లీ లిస్టింగ్ చేసుకోవాలని అప్పటికి సిఎఫ్‌ఎస్‌ఎల్ నివేదిక అందుతుందని న్యాయమూర్తులు వెల్లడించారు. కుకీ ఆధ్వర్యంలోని మానవహక్కుల ట్రస్టు ఈ ఆడియో టేపులపై స్వతంత్ర విచారణ జరిపించాలనికోరుతూ పిటిషన్ దాఖలుచేసింది. విచారణలో భారత సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహతా మణిపూర్ ప్రభుత్వం తరపున వాదనలు వినిపించారు. పిటిషనర్ వేర్పాటువాద ఆలోచనలతో ప్రత్యేక సిద్ధాంతాలను అమలుచేసదిగా ఆతని వైఖరి ఉందని వాదించారు. అంతేకాకుండా సుప్రీంకోర్టు నియమించిన జడ్జిల ప్యానెల్ కూడా ఇలాంటి సంఘటనలను ప్రస్తావిస్తూ ఆందోళన వ్యక్తం చేసింది. మణిపూర్‌లో ఈ రావణకాష్టం అలాగే కొనసాగేందుకు ఈ తెగలు కృషిచేస్తున్నాయని కలవరం వ్యక్తంచేసిన అంశాన్ని గుర్తు చేసారు. కోర్టుముందుంచిన ఆడియో టేపులపై సిఎఫ్‌ఎస్‌ఎల్ నివేదిక వచ్చాకగాని నిర్ణయానికి రాలేమని అన్నారు. న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ ఈ ఆడియో టేప్‌లను ఒక ప్రైవేటు ఫోరెన్సిక్ సైన్స్‌ల్యాబ్ ట్రూత్ ల్యాబ్స్ విశ్లేషించిందని 93శాతం ఈ స్వరం ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్‌కు చెందినదిగానే వెల్లడించినట్లు గుర్తుచేసారు. ప్రభుత్వ సంస్థల నివేదిక కంటే ట్రూత్‌ల్యాబ్ నివేదిక హేతుబద్ధంగా ఉంటుందని ప్రశాంత్‌భూషణ్ చెప్పారు. కుకి గ్రూప్ సంస్థ తన పిటిషన్‌లోకోర్టు పర్యవేక్షణలో విచారణ జరిపించాలని ఆడియో క్లిప్‌లపై సత్వర విచారణచేయాలని కోరింది. క్రైస్తవులు ఎక్కువగా ఉన్న కుకీలకు, హిందూత్వం ఎక్కువ తీసుకున్న మైయిటీ కులస్తులమధ్య జాతులవైరం నడుస్తున్న సంగతి తెలిసిందే. ఆల్ ట్రైబల్ స్టూడెంట్స్‌యూనియన్ ఆఫ్ మణిపూర్ (ఆట్సుమ్) 2023 మే 3వ తేదీ నిర్వహించిన ర్యాలీ అనంతరం ఈ ఉద్రిక్తతలు చెలరేగాయి. 2023మేనెలనుంచి కూడా మణిపూర్‌లో ఉద్రిక్తతలు పెరిగిపోయాయి. కేంద్ర ప్రభుత్వం పారా మిలిటరీ దళాలను పంపించి పరిస్థితిని అదుపు చేస్తున్నా ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.

# తొక్కిసలాట పెద్ద సంఘట కాదు..అనుకోకుండా జరిగిన దుర్ఘటన

## అయోధ్య ఎంపి హేమమాలిని



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** మహాకుంభ్‌నగర్‌లో జరిగిన తొక్కిసలాట పెద్ద సంఘటన ఏమీ కాదని అనుకోకుండా జరిగిన సంఘటన అని దురదృష్టకరమని అన్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మహాకుంభ్‌మేళాకు భారీ ఏర్పాట్లు చేసారని ఇంత పెద్దఎత్తున జరిగిన ఆధ్యాత్మికమేళాలో ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయని, ఈ తొక్కిసలాట అనుకోకుండా జరిగిందని, దేశవిదేశాలనుంచి అనేకమంది వస్తున్నారని, లక్షలాదిగా వస్తున్న భక్తులను అదుపు చేయడం కూడా ఒకదశలో కష్టమే అవుతుందని అయోధ్య ఎంపి అన్నారు. ప్రతిపక్షసభ్యులు చేస్తున్న ఆరోపణలపైనా స్పందించారు. వాస్తవంగా మృతులసంఖ్యను యుపి ప్రభుత్వం దాచిపెడుతుందన్న వాదనలపై ఆమె స్పందిస్తూ వాళ్లు ఏదనుకుంటూ అదే చెపుతుంటారని, తప్పుడు వార్తలు ప్రచారంచేయడం వారి నైజమని ఆమె విమర్శించారు. గతవారంలోనే హేమమాలిని త్రివేణి సంగమంలో పవిత్రస్నానం చేసారు. తనకు లభించిన అదృష్టమని, త్రివేణి సంగమంలోస్నానంచేయడం తన పూర్వజన్మ సుకృతమని ఆమె అన్నారు. అయితే హేమమాలిని వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపి తారిక్ అన్వర్ స్పందించారు. యుపిలోని కతిహార్‌కు చెందిన ఈ ఎంపి హేమమాలినికి ఇలాంటి తొక్కిసలాటలపై అవగాహన లేదని అన్నారు. ఆమె మహాకుంభ్‌మేళకు వెళ్లినపుడు ఆమెకు విఐపి మర్యాదలు అందాయని, అధికారులు మొత్తం విఐపిల మర్యాదల్లో మునిగి తేలుతున్నారని, క్షేత్రస్థాయిలో సామాన్యుల బాధలు వారికి ఎలా తెలుస్తాయని అన్నారు. ఇదొక పెద్ద సంఘటన కానేకాదని ఆమె చెప్పడం బాధితులపట్ల ఆమెకున్న వైఖరిని స్పష్టం చేస్తుందని విమర్శించారు.

# చిన్నారి మాటలకు ఫిదా అయిన మంత్రి.. అంగన్‌వాడీ మెనూలో మార్పులు

**తిరువనంతపురం, ఫిబ్రవరి 4:** బుజ్జిబుజ్జి మాటలతో ఓ చిన్నారి చేసిన రిక్వెస్ట్ నెట్టింట్లో వైరల్‌గా మారింది. ఇది కాస్త మంత్రి దృష్టికి చేరడంతో ఆమె స్పందించారు. దానిని ఆమె ఫేస్‌బుక్‌లో షేర్ చేశారు. అంగన్వాడీలో ఉప్మాకు బదులు బిర్యానీ, చికెన్ ఫ్రై కావాలి అని కేరళకు చెందిన శంకు అనే చిన్నారి తన తల్లిని అడుగుతున్న వీడియో ఆన్‌లైన్‌లో చక్కర్లు కొట్టింది. ఇంట్లో బిర్యానీ తింటూ పిల్లాడు ఈ కోరిక కోరాడు. ఆ ముద్దుముద్దు మాటలను తల్లి వీడియో తీసి, పోస్ట్ చేయడంతో అది వైరల్ అయింది. ఇది కాస్త మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి వీణా జార్జ్ దృష్టికి చేరింది. దానిని ఫేస్‌బుక్ ఖాతాలో పోస్టు చేశారు. ఇప్పుడు పెడుతున్న ఆహారాన్ని ఒకసారి పరిశీలిస్తాం. పోషకాహారం అందేలా




ప్రస్తుతం వివిధ రకాల పదార్థాలను అందిస్తున్నాం. ఈ ప్రభుత్వ హయాంలో అంగన్వాడీ ద్వారా గుడ్లు, పాలు అందించే పథకం విజయవంతంగా అమలవుతోంది అని మంత్రి మాటాడారు. ఇక శంకు వీడియోను చూసి నెటిజన్లు ముచ్చటపడ్డారు. అంగన్వాడీ పిల్లలకు మరింత మెరుగైన ఆహారం అందించాలని కోరారు.

# టెక్సాస్ నుంచి వలసదారుల విమానం.. స్వదేశానికి 205 మంది భారతీయులు

**వాషింగ్టన్, ఫిబ్రవరి 4:** అక్రమ వలసదారులపై అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదటి నుంచి కఠినంగా వ్యవహరిస్తున్నారు. దీంతో అమెరికా చరిత్రలోనే అతిపెద్ద బహిష్కరణ ఆపరేషన్ సాగుతోంది. ఈ క్రమంలో అమెరికాకు అక్రమంగా వలసవెళ్లిన భారతీయులను విమానంలో వెనక్కి తరలిస్తున్నారు. ఇప్పటికే ఓ విమానం భారత్‌కు బయల్దేరింది. అందులో 205 మంది భారతీయులు ఉన్నారని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఆ విమానం పంజాబ్‌లోని అమృత్‌సర్‌కు చేరుకుంటుందని తెలుస్తోంది.

సి-17 యుఎస్ ఎయిర్‌క్రాఫ్ట్ వీరిని తరలిస్తోంది. భారత్‌కు చేరుకోవాడానికి 24 గంటలు పడుతుందని అంచనా. అక్రమ వలసదారులపై అమెరికా అనుసరిస్తున్న విధానాలపై ఇప్పటికే భారత్ తన స్పందనను తెలిపింది. అక్రమ వలసలకు తాము వ్యతిరేమని, ఈ అంశం అనేక



రకాల వ్యవస్థీకృత నేరాలతో ముడిపడి ఉందని పేర్కొంది. వీసా గడువు ముగిసినా లేదా సరైన దస్త్రాలు లేకుండా భారతీయులు అమెరికాతో సహా ఎక్కడ ఉన్నా వారిని తిరిగి తీసుకు వచ్చేందుకు వీలు కల్పిస్తామని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. త్వరలో ప్రధాని మోడీ అమెరికా పర్యటనకు వెళ్లనున్నారని తెలుస్తోంది. ఈ తరుణంలో అక్రమంగా వలస వెళ్లిన భారతీయుల తొలి విడత తరలింపు జరుగుతోంది.

# అనూహ్యరాజకీయ పరిణామాల నడుమ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో కూటమి పట్టు

## -26ఓట్లతో డిప్యూటీ మేయర్‌గా టిడిపి కార్పొరేటర్ మునికృష్ణ



డిప్యూటీ మేయర్ మునికృష్ణ

**తిరుపతి,ఫిబ్రవరి 4ప్రభాతవార్తప్రతినిధి:** వారంరోజులుగా వైసిపి కార్పొరేటర్లలో నెలకొన్న ఆధిపత్యపోరు...సందిగ్ధత...సమన్వయంతో నడిపించలేని అనైక్యత చివరకు 35వ డివిజన్ ఒకేఒక టిడిపి కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ రెండవ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యారు. అంచనాలు తారుమారుచేస్తూ వైసిపి కార్పొరేటర్లు ఆరునెలలముందునుండే కూటమిపార్టీల చెంతన చేరడంతో మంగళవారం ఉదయం జరిగిన డిప్యూటీ మేయర్ ఎన్నికకు ముందే నాటకీయ పరిణామాలతో ఏకంగా 25మంది వైసిపి కార్పొరేటర్లు కూటమిపార్టీకి మద్దతు తెలపడంతో టిడిపి పాగా వేసినట్లయింది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్‌లో 50మంది కార్పొరేటర్లుఉండగా ఒక డివిజన్‌లో 2021లో ఎన్నికలు వాయిదాపడ్డాయి. ఏడాదిన్నరక్రిందట 24వ డివిజన్ వైసిపి కార్పొరేటర్ హనుమంతునాయక్ మరణంతో ఖాళీఅయ్యింది. గత ఏడాది మార్చిలో ఎన్నికల నేపధ్యంలో 4వడివిజన్ కార్పొరేటర్(పూర్వ డిప్యూటీ మేయర్)భూమన అభినయ్‌రెడ్డి రాజీనామా చేశారు. 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ ఒక్కడే గతంలోనూ టిడిపి నుండి ఎన్నికైన వాడే. గత నాలుగేళ్ళలో ఆయన కౌన్సిల్‌లో ఎదుర్కొన్న పరాభవాలు, అనుభవాలు, చేదు సంఘటనలు ఇప్పుడు ఆయనకు కలిసొచ్చిన అవకాశంగా డిప్యూటీ మేయర్ పదవిని అందుకునేలా చేసిందనేది కూటమికి మద్దతుగా నిలిచిన 25మంది వైసిపి కార్పొరేటర్లు వాదన వినిపించడం విశేషం. 47మంది కార్పొరేటర్లు బలమున్న తిరుపతి నగరపాలక కౌన్సిల్‌లో వైసిపి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి(వైసిపి), తిరుపతి సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు(జనసేన), ఎంఎల్‌సి డాక్టర్ సిపాయిసుబ్రమణ్యం(వైసిపి) ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉన్నారు. మంగళవారం ఉదయం తర్జనభర్జనలు అనంతరం మొదలైన డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో 26మంది కార్పొరేటర్లు టిడిపి మునికృష్ణకు ఓటువేశారు. వైసిపి అభ్యర్థి లడ్డు భాస్కర్‌రెడ్డికి 21మంది మద్దతుగా నిలిచారు. దీంతో వైసిపికి పూర్తిస్థాయి బలమున్నప్పటికీ కొందరు కార్పొరేటర్లు తీరుతో టిడిపి కార్పొరేటర్ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యారు. ఆయన డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైనట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి శుభం బన్సల్ ప్రకటించారు. తిరుపతి నగరపాలక కౌన్సిల్‌లో గత ఎనిమిదినెలలుగా వైసిపికి చెందిన కార్పొరేటర్లు 20మందివరకు కూటమివైపే మొగ్గు చూపుతున్నారు. గతంలోనే ఏకంగా వీరంతా కలసి టిడిపి పార్టీ కండువాలు వేసుకునేందుకు అమరావతివెళ్ళారు. అక్కడ టిడిపి అధినేత, సిఎం చంద్రబాబునాయుడు నుండి సంకేతాలు రాకపోవడంతో స్వతంత్రులుగానే కొన సాగుతున్నారు. వీరంతా ఇప్పుడు డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో తమ ఓటును కూటమి బలపరిచిన ఆర్‌సి మునికృష్ణకే వేసి మద్దతు తెలిపారు. కాగా 2021 ఏప్రిల్‌లో జరిగిన తొలి కౌన్సిల్ ఎన్నికల్లో 50 మంది కార్పొరేటర్లకుగాను అప్పటి అధికారంలో ఉన్న వైసిపి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి 22 డివిజన్లలో వైసిపి కార్పొరేటర్లను ఏకగ్రీవం చేసుకున్నారు. మిగిలిన 28 డివిజన్లకు ఎన్నికలు 26మంది వైసిపివారే. తాజాగా ఉన్న 48మంది కార్పొరేటర్లలో ఒక టిడిపి కార్పొరేటంకు అనూహ్యంగా అవకాశం దక్కింది. ఇప్పటికీ మేయర్‌గా కొనసాగుతున్న డాక్టర్ శిరీష, ఉప మేయర్‌గా ఉన్న ముద్రనారాయణ రానున్న రోజుల్లో పదవులు వదలుకుంటారా?లేక కూటమిచెంత చేరుతారా అనేది కాలం నిర్ణయించనుంది.

తిరుపతిలో బలమైన బిసి వర్గానికి చెందిన రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయిసుబ్రమణ్యంను డిప్యూటీ మేయర్ ఎన్నికకు కొన్ని గంటల ముందు కూటమి పార్టీలు కిడ్నాప్‌చేశారని, ఫోన్‌లో కూడా అందుబాటులో లేరని వైసిపి వర్గీయులు ఆరోపించారు.

## అమరావతి మీదుగా ఎర్రుపాలెం నంబూరు మధ్య కొత్త రైల్వే లైన్ పనులు

**విజయవాడ.ఫిబ్రవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి మీదుగా ఎర్రుపాలెం నంబూరు మధ్య కొత్త రైల్వే లైన్ పనులు నాలుగేళ్లలో పూర్తి చేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. 56 కి.మీ. మేర నిర్మించే ఈ ప్రాజెక్టుకు రూ.2,545 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేసినట్లు వెల్లడించారు. విజయవాడలో డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్ వేర్వేరుగా విలేకరులకు వెల్లడించారు ఏపీలోని వివిధ ప్రాజెక్టుల నిర్మాణానికి భూసేకరణలో జాప్యమయ్యేదని, సీఎం చంద్రబాబు వివిధ శాఖలతో ఏర్పాటుచేసిన టాస్క్‌ఫోర్స్ వల్ల సమన్వయ సమావేశాలు నిర్వహించి, సమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. భూసేకరణ త్వరగా పూర్తయితే పనుల్లో వేగం పెరుగుతుందని చెప్పారు. గతేడాది బడ్జెట్‌లో ఏపీకి రూ.9,151 కోట్లు కేటాయించారు. ఈసారి రూ.9,417 కోట్లకు పెంచారు. రైలు ప్రమాదాలు నివారించే కవచ్ వ్యవస్థను కర్నూలు గుంతకల్లు మార్గంలోని 122 కి.మీ. మేర అందుబాటులోకి తెచ్చాం. బల్హార్ష విజయవాడ మార్గంలో ఏపీ పరిధిలో 36 కి.మీ, విజయవాడ గూడూరు మధ్య 293 కి.మీ, నల్వార్ గుంతకల్లు ఎర్రగుంట్ల రేణిగుంట మార్గంలో 401 కి.మీ, విజయవాడ దువ్వాడ మధ్య 330 కి.మీ. పరిధిలో కవచ్ ఏర్పాటు పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

# ఎపిలో కుల గణన సర్వే చేపట్టాలి

## : పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



**విజయవాడ. ఫిబ్రవరి4. ప్రభాత వార్త ప్రతినిధి:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కుల గణన సర్వే చేపట్టాలని కూటమి ప్రభుత్వాన్ని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఐదున్నర కోట్ల రాష్ట్ర జనాభాలో వెనుకబడిన వర్గాల వారి సంఖ్య ఎంతో తేల్చాలంటూ ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆమె సూచించారు. మంగళవారం విజయవాడలో ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఐదున్నర కోట్ల జనాభాలో వెనుకబడిన వర్గాల వారి సంఖ్య ఎంతో తేల్చాలన్నారు. అలాగే కుల వివక్షకు గురవుతున్న బలహీన వర్గాల ప్రజలు ఎంత మంది ఉన్నారో లెక్కలు తీయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మనమెంతో మనకంతా అన్నట్లుగా.. రాజకీయ, సామాజిక, విద్యా, ఉద్యోగాలలో వారి వాటా వారికి దక్కాల్సి ఉందని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల అభిప్రాయపడ్డారు. జనాభా ప్రాతిపదికన న్యాయంగా రిజర్వేషన్లు అమలు కావాల్సి ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు కులగణన చేపట్టినా.. బీజేపీ దత్తపుత్రుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆ సర్వే వివరాలు తొక్కిపెట్టారని వైఎస్ షర్మిల వ్యంగ్యంగా అన్నారు. ఆ వివరాలు బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారంటూ మాజీ సీఎం వైఎస్ జగన్‌పై మండిపడ్డారు. బీజేపీ డైరెక్షన్ లోనే సర్వే రిపోర్టు బయటకు పొక్కకుండా కుట్ర చేశారంటూ వైఎస్ జగన్ పై ఆగ్రహం వ్యక్తం చేసారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తుంటే.. రిజర్వేషన్ల రద్దుకు కుట్ర అంటూ బీజేపీ తప్పు దారి పట్టించే ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఉచ్చులో మీరు పడవద్దంటూ సీఎం చంద్రబాబుకు ఈ సందర్భంగా వైఎస్ షర్మిల సూచించారు. వెంటనే ఏపీలో సైతం కులగణన సర్వే చేపట్టాలని.. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శమని ఈ సందర్భంగా వైఎస్ షర్మిల అభివర్ణించారు. ఇదో చారిత్రాత్మక ఘట్టమన్నారు. ఈ సర్వే యావత్ భారతావనికి దిక్సూచి అని తెలిపారు. దేశ భవిష్యత్ కోసం రాహుల్ గాంధీ దూరదృష్టికి ఇదొక నిదర్శన మన్నారు.

## మార్చి ఆఖరు వరకూ ఖరీఫ్ ధాన్యం సేకరణ

**విజయవాడ ఫిబ్రవరి 04 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఖరీఫ్ ధాన్యం సేకరణ గడువును ప్రభుత్వం పొడిగించింది. మార్చి నెలాఖరు వరకు సేకరించనున్నట్లు పౌరసరఫరాల సంస్థ వీసీ, ఎండీ మనజీర్ జిలాని తెలిపారు. మార్చి తర్వాత వచ్చినా, అవసరమైతే రబీలో సేకరించే విషయాన్ని పరిశీలిస్తామని చెప్పారు. నిజమైన రైతుల వద్ద ఉన్న ధాన్యం మొత్తాన్ని కొంటామని, రైతుల పేరుతో ఇతరులు విక్రయించాలని చూస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కృష్ణా జిల్లాల్లో పలుచోట్ల పంట కోసి, వరి కుప్పలువేశారు. అదే పొలంలో రెండో పంటగా అపరాలు వేసినందున , ఆపంట చేతికొచ్చే వరకు వరి కుప్పలు నూర్చే వీల్లేదు. శ్రీకాకుళం జిల్లాలోనూ ధాన్యం నిల్వలున్నాయి. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఖరీఫ్ ధాన్యం ఆలస్యంగా వస్తుంది. ఆయా జిల్లాల రైతుల వినతుల మేరకు ధాన్యం సేకరణ గడువును ప్రభుత్వం పొడిగించింది. వైకాపా హయాంలో 2023 ఖరీఫ్‌లో 29 లక్షల టన్నుల ధాన్యం సేకరించగా, ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక 2024 ఖరీఫ్‌నకు సంబంధించి ఇప్పటికే 31.52 లక్షల టన్నులు సేకరించింది. మరో 4 లక్షల టన్నుల వరకు రైతుల వద్ద ఉన్నట్లు అంచనా. అప్పట్లో ధాన్యం అమ్మిన రైతులకు నెలల తరబడి డబ్బులు రాకపోగా, ఈ ప్రభుత్వం 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తోంది. ఇప్పటికే రూ.7222 కోట్లు చెల్లించింది.

# ఇంద్రకీలాద్రిలో సూర్యోపాసన సేవ

## వైభవంగా శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని కళ్యాణం



**ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ ఆలయంలో వైభవంగా శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామివార్ల కళ్యాణోత్సవాన్ని మంగళవారం మాఘమాసం శుద్ధ షష్టి సందర్భంగా నిర్వహించారు. ముందుగా శ్రీ స్వామి అమ్మవార్లను చూడముచ్చటగా అలంకరించిన కళ్యాణ వేదికలపై వేంచేపు చేసి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కళ్యాణం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దుర్గమ్మ ఆలయంలో మాఘ మాసం షష్టి, రథసప్తమి తిథుల సందర్భంగా వేదోక్తంగా సూర్యోపాసన సేవను మంగళవారం నిర్వహించారు. ఆదిత్య హృదయం, సూర్యాష్టకం, సూర్యనమస్కారాలు ఆచరిస్తూ అరుణ పారాయణ గావించిన అర్చకులు శ్రీ స్వామివారికి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. లోకసంక్షేమార్థం నిర్వహించిన ఈ సేవలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈఓ కె రామచంద్ర మోహన్ మాట్లాడుతూ ఈ మాఘమాసంలో సూర్యోపాసన సేవలను ఈనెల 8వ తేదీ శనివారం భీష్మఏకాదశి, 9వ తేదీ ఆదివారం మాఘశుద్ధ ద్వాదశి, 12వ తేదీ మాఘమాస పూర్ణిమ, 16 ఆదివారం, 23వ తేదీ ఆదివారం, 24 సోమవారం బహుళ ఏకాదశి, 26 బుధవారం మాఘబహుళ చతుర్దశి పర్వదినాల్లో ఉదయం 8 గంటలకు అరుణ పారాయణ, సూర్యనమస్కారాలు, ఆదిత్య హృదయం, సూర్యాష్టకం పఠిస్తూ పండితులు పూజాదికాలు నిర్వహిస్తారని, రు.1000ల ఉభయంతో దంపతులు పూజలో పాల్గొనవచ్చని తెలిపారు.

# ఎగువ కాఫర్ డ్యాం పొడవునా బట్రెస్ డ్యాం

**విజయవాడ ఫిబ్రవరి 04 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలవరంలో విదేశీ నిపుణులు డి సిస్కో, డేవిడ్ పాల్ ఆధ్వర్యంలోసోమవారమూ కీలక చర్చలు జరిగాయి. ఇందులో పోలవరం అథారిటీ సభ్య కార్యదర్శి రఘురామ్ , కేంద్ర జలసంఘం నుంచి సరబ్‌జీత్‌సింగ్ బక్షి, రాకేష్, అశ్వనీకుమార్ వర్మ, రమేష్ కుమార్‌తో పాటు ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు, వివిధ కేంద్ర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. కొత్తగా నిర్మిస్తున్న డయాఫ్రం వాల్ కోసం ఏర్పాటు చేసిన ప్లాట్‌ఫాం వరదల సమయంలో సీపేజీ నీటితో మునిగిపోకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలి ఏయే జాగ్రత్తలు తీసుకోవాలో కూడా ఈ సమావేశంలో చర్చించారు. పోలవరం ప్రాజెక్టులో ఎగువ కాఫర్ డ్యాం సీపేజీని నియంత్రించేందుకు ఆ డ్యాం పొడవునా బట్రెస్ డ్యాం నిర్మించాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఉన్న ఎగువ కాఫర్ డ్యాం 2458 మీటర్ల పొడవునా దిగువ వైపు దీన్ని నిర్మిస్తారు. డ్యాం గర్భం వద్ద నిర్మించడం వల్ల దిగువ వైపు నుంచి వస్తున్న సీపేజీని అరికట్టడానికి ఇది ఉపకరిస్తుందని పోలవరం విదేశీ నిపుణులు ఇప్పటికే తేల్చారు. అందుకు సంబంధించి సోమవారం నాటి సమావేశంలో చర్చించారు. ఇందులో చెప్పిన మార్పులు, చేర్పులు చేసి పంపితే తాము అనుమతులు ఇస్తామని కేంద్ర జలసంఘం పెద్దలు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## తొలిదశలో గుర్తించడం, సరైన చికిత్స అందించడం ద్వారానే క్యాన్సర్ మహమ్మారిని ఎదుర్కోగలం

### - మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ ఫిబ్రవరి 04 ప్రభాతవార్త ప్రతినిధి:** నివారణ, ముందస్తు పరీక్షలు, తొలిదశలో గుర్తించడం, సరైన చికిత్స అందించడం ద్వారానే క్యాన్సర్ మహమ్మారిని ఎదుర్కోగలమని ఏపీ ఆరోగ్యశాఖా మంత్రిసత్యకుమార్ యాదవ్ అన్నారు.

ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా ఎక్స్ వేదికగా వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ట్వీట్ చేశారు. నోటి , రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌లకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉచిత ముందస్తు పరీక్షలు నిర్వహిస్తోంది. ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలి మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.



సూర్య భగవానునికి ప్రత్యేకాభిషేకాలు

# సత్యవ్రత భాస్కరక్షేత్రంలో రథసప్తమి వేడుకలు

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త** సత్యవ్రత భాస్కర క్షేత్రంలో పురాణఇతిహాసాలు పేర్కొంటున్న శ్రీకాళహస్తి క్షేత్రంలో రథసప్తమి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. హిందూ సంస్కృతీ, సాంప్రదాయాల్లో రథసప్తమి విశిష్టమైన పర్వదినంగా భావిస్తారు. ఇంటింటా సూర్యపూజలను నిర్వహించి సూర్యదేవునికి విశేష పూజలను నిర్వహించారు.

**శివయ్యసన్నిధిలో సూర్యభగవానునికి అభిషేకాలు:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో రథసప్తమి సందర్భంగా సూర్యదేవునికి విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారి ఆలయంలోని సూర్యదేవుని విగ్రహానికి విశేష అభిషేకాలు నిర్వహించి పుష్పాలంకరణలు చేసి హారతులిచ్చారు. ఆలయ ఇఒ డి.బాపిరెడ్డి పర్యవేక్షణలో ఏర్పాట్లు జరిగాయి. అభిషేకాల్లోనూ ఆలయానికి విచ్చేసిన భక్తజనం స్వామి వారి ఆలయంలోని సూర్యదేవున్ని దర్శించుకొని భక్తి శ్రద్ధలతో మొక్కుకున్నారు. అలాగే జలవినాయకుని సమీపంలోని సూర్యదేవుని ఆలయంలోనూ విశేష పూజలను నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు నిర్వహించి విశిష్ట అలంకారం చేశారు. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో సూర్యదేవున్ని దర్శించుకొని పూజలు జరుపుకున్నారు.

**సూర్యపుష్కరిణి జలాలతో . . .** ఇక్కడే వెలసియున్న సూర్యపుష్కరిణి జలాలతో గతంలో స్వామి అమ్మవార్లకు నిత్యం అభిషేకాలను నిర్వహించే వారు. ఇక్కడి సూర్యపుష్కరిణి విశిష్టత గురించి పురాణాల్లో చెప్పబడి వుంది. సూర్య ప్రభ వాహనంపై స్వామి వారిని వుంచి గ్రామోత్సవం నిర్వహించారు.

**ఊరేగింపులు:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం రథసప్తమి సందర్భంగా ఆలయంలో అభిషేకాల నిర్వహణ జరిగింది. సాధారణంగా శ్రీకాళహస్తీశ్వరుని సూర్యప్రభవాహనంపై అమ్మవారిని చప్పరంపై ప్రతిష్టించి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవంతో పాటు ఉభయదారులు సమీప గ్రామానికి చెందిన మునగాల భక్త వత్సల నాయుడు కుటుంబసభ్యులు వెంటరాగా కన్నుల పండువగా గ్రామోత్సవం జరిపారు. స్వామి అమ్మవార్లను అలంకార మండపంలో చక్కగా ముస్తాబు చేసి తేరువీధిలోని వాహనాల మండపం వద్ద ఉత్సవ వాహనాల్లో ప్రతిష్టించి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవంను ఆలయ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్, సిఎస్ఓ నాగభూషణం యాదవ్, ద ఫేదార్ రాజా తదితరులు వెంటరాగా ఉత్సవం కన్నుల పండువగా సాగింది.

# ఎన్డీఏ కూటమి నాయకుల అనైతిక విధానాలపై ఇసికి ఫిర్యాదు

**విజయవాడ,ఫిబ్రవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** అడ్డదారిలో విజయం సాధించడమే లక్ష్యంగా మున్సిపల్ ఉప ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి నాయకులు రౌడీయిజం చేస్తూ అనైతిక విధానాలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ కి ఫిర్యాదు చేశామని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం వైయస్సార్‌సీపీ ఇంఛార్జ్ మల్లాది విష్ణు వెల్లడించారు. తిరుపతిలో ఓటింగ్‌కు వెళ్తున్న తమ పార్టీ కార్పొరేటర్లు ప్రయాణిస్తున్న బస్సుపై దాడి చేసి ధ్వంసం చేయడంతో పాటు, నలుగురు కార్పొరేటర్లను కిడ్నాప్ చేసి తీసుకెళ్లారని ఆయన తెలిపారు. చివరకు ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యంను కూడా టీడీపీ గూండాలు కిడ్నాప్ చేసి తీసుకెళ్లిన ఘటన చూస్తే.. మనం ఏపీలో ఉన్నామో.. బీహార్‌లో ఉన్నామో అర్థం కాని పరిస్థితి అని చెప్పారు. మున్సిపల్ ఎన్నికలు జరిగిన అన్ని చోట్లా ఇదే పరిస్థితి నెలకొందని ఎస్ఈసీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడిన మల్లాది విష్ణు వెల్లడించారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకునే ప్రమాదం ఉందని ఎన్నికలకు ముందు నుంచే ఎస్ఈసీకి చెప్పామని, పరిస్థితిని ఎప్పటికప్పుడు పోలీసుల దృష్టికి తీసుకెళ్తూ అప్రమత్తం చేస్తూనే ఉన్నామని మల్లాది విష్ణు తెలిపారు. తిరుపతి కార్పొరేటర్లకు భద్రత కల్పించమని ప్రాధేయపడినా పోలీసులు పట్టించుకోలేదని, తమకేమీ సంబంధం లేదన్నట్లు వ్యవహరించారని చెప్పారు. పవిత్రతకు మారుపేరైన తిరుపతి విశిష్టతను కూటమి నాయకులు దౌర్జన్యకాండతో కాల రాస్తున్నారని, కార్పొరేటర్లను, ఎమ్మెల్సీలను తమవైపు తిప్పుకునేందుకు కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు బరిలోకి దిగి ప్రలోభాలకు గురి చేశారని, లొంగని వారిని బెదిరించారని వెల్లడించారు.

అందుకే వరసగా మూడు రోజుల నుంచి ఎస్ఈసీకి ఫిర్యాదు చేస్తున్నామని వివరించారు. తిరుపతిలో తమ పార్టీకి కేవలం ఒకే కార్పొరేటర్ ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు ఆదేశాలతో, డిప్యూటీ మేయర్ పదవి కోసం టీడీపీ చేసిన అరాచకాలు, దౌర్జన్యాలను ప్రజలే ఈసడించుకుంటున్నారని మల్లాది విష్ణు వివరించారు.

## పింఛన్ల పంపిణీ ఉదయం 7గంటలకు ప్రారంభించాలని సిఎం ఆదేశం

## హర్షం వ్యక్తం చేసిన గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం

**విజయవాడ, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** ప్రతినెలా 1వ తేదీన పంపిణీ చేసే పెన్షన్లు ఉదయం 5 కు కాకుండా 7 గంటలకు ప్రారంభించేలా ఆదేశాలిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అప్పలనాయుడులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే సాయంత్రం 5 గంటలలోపు ప్రభుత్వ ఉద్యోగులు పెన్షన్లను 100 శాతం పూర్తి చేయగలరని, దీన్ని దృష్టిలో వుంచుకుని ముఖ్యమంత్రి ఉన్నతాధికారులు మరోమారు ఆలోచించి నిర్ణయించాలని కోరారు.

# తిరుపతి ఐఐటిలో నేషనల్ ఇంటిగ్రేషన్ టూర్



తిరుపతి ఐఐటిలో ఈశాన్య ప్రాంత విద్యార్థులు

**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త** తిరుపతి ఐఐటిలో మంగళవారం ఈశాన్య ప్రాంతాలకు చెందిన 25 మంది విద్యార్థులు హాజరై పాల్గొన్నారు. వారికి ఐఐటిటి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎస్ సత్య నారాయణ ఐఐటి విద్య గురించి లాబాలు, భవిష్యత్తు గురించి విద్యార్థులకు వివరించారు. 25 మంది విద్యార్థులు స్టూడెంట్స్ ఎక్స్‌పీరియన్స్ ఇన్ ఇంటర్-స్టేట్ లివింగ్ ప్రోగ్రాం కింద వారి నేషనల్ ఇంటిగ్రేషన్ టూర్‌లో భాగంగా తిరుపతి ఐఐటి క్యాంపస్ సందర్శనకు వచ్చారు. ఈ టూర్ లక్ష్యం ఏమిటంటే టూర్ ఉద్దేశ్యం విద్యార్థులు దేశ వ్యాప్తంగా వివిధ సాంస్కృతిక సంప్రదాయ పద్ధతులను అవగాహన చేసుకోవటానికి అధ్యయనం చేయటానికి పరిచయం చేసుకోవటానికి సమీకరించటానికి అవకాశాన్ని అందించటం జరుగుతుందన్నారు. విద్యార్థులకు డైరెక్టర్ ప్రొఫెసర్ కె.యస్, సత్యనారాయణ డీన్ ఆఫ్ కాంపిటెన్సి డెవలప్‌మెంట్ అండ్ అవుట్‌రిచ్ యాక్టివిటీస్ ప్రొఫేసర్ అరుణ్ తంగిరాల జాతీయ సమైక్యత, సాంస్కృతిక మార్పిడి ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు అత్యాధునిక ల్యాబ్‌లు మౌళిక సదుపాయాలు, వివిధ సాంకేతికతలు సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్శన వారికి ప్రీమియర్ ఇన్‌స్టిట్యూట్ విద్యా,పరిశోధనా వాతావరణంలో విలువైన సమాచారాన్ని అందించారు. విద్యార్థుల్లో ఐక్యత,అవగాహను పెంపొందించానికి కీలక పాత్ర పోషిస్తూ దేశం సంబందాలను బలోపేతం చేసుకుంటుందన్నారు.

# ఉగాది నుంచి పి4 విధానం అమలు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

## - ప్రజల నుంచి అభిప్రాయాల సేకరణకు పోర్టల్



పీ-4 విధనంపై సమీక్ష నిర్వహిస్తున్న సీఎం చంద్రబాబు

**విజయవాడ., ఫిబ్రవరి 4,ప్రభాతవార్తప్రతినిధి:** పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పీ4 విధానాన్ని ఉగాది పండుగ నుంచి ప్రారంభిచనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. పీ4 విధానం ద్వారా సమాజంలో ఆర్థికంగా అగ్రస్థానంలో ఉన్న 10 శాతం మంది...అట్టడుగున ఉన్న 20 శాతం మందికి చేయూతనివ్వడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని సీఎం అన్నారు. దీనిపై సమగ్ర విధి విధానాలను రూపొందించేందుకు ప్రజల నుంచి సలహాలు, సూచనలు, అభిప్రాయాలను తీసుకునేందుకు ప్రత్యేకంగా పోర్టల్‌ను తీసుకురావాలని అధికారులను సీఎం ఆదేశించారు. పేదరిక నిర్మూలన విషయంలో ప్రజల అభిప్రాయాలు, ఆలోచనలను తీసుకుని పీ4 విధానాన్ని అమలు చేయనున్నట్లు సీఎం తెలిపారు. సచివాయంలో ప్లానింగ్ శాఖపై సమీక్ష సందర్భంగా పీ4 కార్యక్రమం ప్రారంభంపై అధికారులతో చర్చించారు. పారిశ్రామిక వేత్తలు, ఎన్ఆర్ఐలతో పాటు కొంత ఉన్నత స్థాయిలో ఉన్నవారు పేదలకు సాయం చేసేందుకు ముందుకొస్తున్నారని ....వీరందరినీ ఒక గొడుగు కిందకు తెచ్చి పీ4 విధానం అమలు చేస్తామని చెప్పారు. ఇదే సమయంలో ప్రత్యేక సర్వే ద్వారా అట్టగుడున ఉన్న వర్గాలను గుర్తించి...వారికి సాయం అందేలా చేస్తామన్నారు. దీనికోసం అవసరమైన డేటాను సేకరించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పలువురు పారిశ్రామిక వేత్తలు తమ సొంత ఊళ్లు, మండలాలను అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చారని...అలా ఆసక్తి ఉన్న వారిని స్వయంగా ఆహ్వానించి...ఉగాది రోజున పీ4 కార్యక్రమాన్ని ఆవిష్కరిస్తామన్నారు. పబ్లిక్‌ప్రైవేట్‌పీపుల్స్ పార్ట్నర్‌షిప్ విధానం అమలు ద్వారా పేదరిక నిర్మూలకు అడుగులు వేస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఆర్థికశాఖా మంత్రి పయ్యావుల కేశవ్, ప్లానింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# కల్తీపాలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు

**అనంతపురం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త బ్యూరో** ఉమ్మడి అనంతపురం జిల్లాలో కల్తీపాల విక్రయం జోరుగా సాగుతోందని ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజిలెన్స్ డిఎస్పీ నాగభూషణం హెచ్చరించారు. కల్తీ పాలను నేరుగా డైరీలకు పంపుతున్నారని, ఇది అనంతపురం జిల్లానే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కల్తీ పాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని, దీనిపై నిగాబెట్టి రాప్తాడు నియోజకవర్గంలోని బండమీదపల్లి గ్రామంలో పెద్ద ఎత్తున కల్తీపాల తయారీ విక్రయం కొనసాగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా రామిరెడ్డి అనే వ్యక్తి ఇంట్లో కల్తీ పాలకు సంబంధించి తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి అనేక రకాలైనటువంటి కెమికల్ ఉపయోగించి పాలను తయారు చేస్తున్న విషయాన్ని గుర్తించామన్నారు. పాలలో చిక్కదనం కోసం పామాయిల్, ఉప్పున మాల్టోడెక్సిన్ అనే రసాయన పదార్థాలను కలుపుతున్నారని, తాము ఆ ఇంటిపై దాడి చేసినప్పుడు ఆ రసాయన పదార్థాల నిల్వలు ఉన్నాయని ఆయన చెప్పారు. రామిరెడ్డిని అదుపులోకి తీసుకొని విచారించగా చాలా కాలంగా ఈ పాలను తయారుచేసి విక్రయిస్తున్న విషయాన్ని వెల్లడించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ మిగతా వాళ్లు కూడా కొందరు చేస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయని, ఇది జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్నట్లు తమకు అనుమానాలు ఉన్నాయన్నారు. శాంపిల్స్ హైదరాబాద్‌లోని పరీక్ష కేంద్రాలకు పంపామని, ఫుడ్ సేఫ్టీ వాళ్లు కూడా పంపారని నివేదికలు వచ్చాక తగు చర్యలు తీసుకుంటా మన్నారు. కల్తీ పాలను పాల డైరీలు పంపుతున్నారని, నేరుగా వినియోగదారులు పంపలేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. కల్తీ పాల వల్ల ప్రజలకు క్యాన్సర్ రావడమే కాకుండా అనేక రకాల జబ్బులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బండమీదపల్లి గ్రామంలో నలుగురు వ్యక్తులు ఈ విధమైనటువంటి తయారీ చేసి నేరుగా పాల డైరీలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కల్తీపాల తయారీ భారీగా సాగుతోందని ప్రతి ఒక్కరూ దీన్ని గుర్తించి అప్రమత్తంగా ఉండాలని డిఎస్పీ హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్న ఇటువంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో జిల్లాలో అనేక చోట్ల ఈ రకమైన పాల తయారీ చేసి విక్రయాలు చేస్తున్న విషయాన్ని పసిగట్టగా ఆఖరికి బండమీద పల్లిలో తయారీదారుల వ్యవహారం వెలుగులోకి వచ్చిందన్నారు.

5-2pg7exHMNWJQE.qxd:5-2pg7exHMNWJQE.qxd 01/01/01 9:39 AM Page 1



# కులగణన సర్వేపై శాసన మండలిలో చర్చ



## ప్రకటన ప్రవేశపెట్టిన డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క

### అనుమానాల నివృత్తికి అవకాశం ఇచ్చిన మండలి ఛైర్మన్

**హైదరాబాద్, ఫిబ్రవరి, 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రత్యేకంగా సమావేశమైన శాసనమండలిలో ప్రభుత్వం రెండు ప్రకటనలను ప్రవేశ పెట్టింది. సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కులసర్వే-2024పై అలాగే తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీలలోని ప్రత్యేక వర్గాల ఉప ఉపవర్గీకరణపై డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌తో నియమించబడిన ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదికపై ప్రకటనను ప్రభుత్వం తరపున మంగళవారం శాసన మండలిలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. ప్రభుత్వం ప్రకటన చేసిన నేపథ్యంలో రెండు అంశాలపై చర్చ లేకుండా కేవలం మండలి సభ్యులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేసుకోవడానికి అవకాశం కల్పించారు. మంగళవారం రాష్ట్ర శాసన సభతోపాటు శాసనమండలి ప్రత్యేకంగా సమావేశమైంది. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారభం కాగానే.. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రస్తుతం కేబినెట్ మీటింగ్ కొనసాగుతోంది.. కొంత సమయం ఇస్తే మీటింగ్ ముగిసిన తరువాత రెండు అంశాలపై ప్రభుత్వం ప్రకటన చేస్తుందని తెలిపారు. దీంతో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 2.20 గంటలకు సభ ప్రారంభం కాగానే.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుల గణన నివేదికను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండలిలో ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో శాసన మండలిలో కేబినెట్ ఆమోదం తెలిపిన కులగణన నివేదిక రిపోర్టును ప్రవేశ పెట్టారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. ప్రకటనపై సాధారణంగా చర్చ ఉండదని సభ్యులు కేవలం అనుమానాలను(క్లారిఫికేషన్స్) అడగాలని మండలి ఛైర్మన్ సూచించారు. ప్రతిపక్ష నేత మదుసూదనాచారి మాట్లాడుతూ బీసీ కులగణనపై సమగ్రంగా చర్చ జరగాలి.. అలాంటి చర్చ జరగాలంటే పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని కోరారు. నివేదిక కోసం రాష్ట్ర ప్రభుత్వం కొండను తవ్వి ఎలుకను పట్టినట్టుగా ఉందని విమర్శించారు. డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్ మాట్లాడుతూ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ వెబ్‌సైట్‌లో నివేదిక ఉందని దానిపై స్పష్టం ఇవ్వాలని బండ ప్రకాష్ కోరారు.

ప్రభుత్వం ప్రకటించిన కులగణన వివరాలతో స్థానిక సంస్థల ఎన్నికల్లో, ఉద్యోగాల్లో బీసీలకు రిజర్వేషన్లు 42 శాతం కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పడం లేదన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నివేదికను మండలిలో ప్రవేశపెట్టిన సందర్భంగా సభ్యుల ప్రశ్నలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు సమాధానమిచ్చారు. షెడ్యూల్ కులాలు, తెగలు, వెనుకబడిన తరగతులు, రాష్ట్రంలోని ఇతర బలహీన వర్గాల సంక్షేమానికి విధానాల రూపకల్పన చేయడానికి ప్రభుత్వం కుటుంబ సర్వే సమాచారాన్ని ఉపయోగిస్తుందన్నారు. రాష్ట్రంలో మొత్తం బీసీల సంఖ్య 56. 33 శాతం అని సమగ్ర ఇంటింటి సర్వే ద్వారా తేలింది. ఈ సంఖ్యల ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు, బడ్జెట్లో కేటాయింపులకు సర్వే సమాచారాన్ని వినియోగిస్తామన్నారు. సర్వే సమాచారం ఆధారంగా సమగ్రత, పారదర్శకత ప్రాతిపదికగా నడిచే పాలనకు నూతన దశ ప్రారంభాన్ని ఈ సర్వే సూచిస్తుందన్నారు. ఈ సర్వే సమాచారం ఆధారంగా రాబోయే రోజుల్లో చాలా చేయబోతున్నామని.. ఈ సర్వే రాష్ట్రంలోని ప్రజల వివిధ రకాల స్థితిగతులపై ఫుల్ బాడీ చెకప్ ఒక ఎక్స్ రే లాంటిదన్నారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో ఉందని ఈ సర్వే స్పష్టం చేస్తుందని భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో 3.56 లక్షల మంది సర్వేలో పాల్గొనలేదని.. అందులో కేసీఆర్, కేటీఆర్, హరీష్, పల్లా రాజేశ్వర్ రెడ్డి లాంటి వారు ఉన్నారన్నారు. వారు ఇప్పుడు ఆసక్తి కనబరిచి సమాచారం ఇస్తే తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని.. టిఆర్ఎస్ నాయకులు సమగ్ర కుటుంబ సర్వే పేరిట ఒకేరోజు ఆరు గంటల్లో సర్వే పూర్తి చేశామని తెలిపారు. మీరు చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ఏం చేసుకున్నారో.. ఎవరికీ తెలియదు. మీరు అధికారంగా చేసి ఉంటే సభలో పెట్టలేదు బహిరంగంగా ప్రకటన చేయలేదు కాబట్టి అది అధికారిక డాక్యుమెంట్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో కులగణనపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి సైంటిఫిక్ సర్వే జరగలేదు.. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే ఇది మొదటిది. సర్వే ఆధారంగా రాష్ట్ర వనరులు సంపదను అభివృద్ధికి కావలసిన విధంగా వినియోగిస్తాం. రాజకీయ, విద్య, ఆర్థిక రంగాల్లో వెనుకబడిన వారిని గుర్తించి ఆ వర్గాల ప్రగతికి వినియోగిస్తాం.

బలహీన వర్గాలకు మేలు జరగాలన్న ఆలోచన ఉండదు కాబట్టి టిఆర్ఎస్ నాయకులకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వేపై నమ్మకం ఉండదన్నారు. వివిధ ప్రజా సంఘాలు సామాజికవేత్తలు మేధావులు ఇతర భాగస్వాములు అభిప్రాయాలు పరిగణలోకి తీసుకొని సర్వే షెడ్యూల్ను రూపొందించాం. హౌస్ లిస్టింగ్ షెడ్యూల్, సర్వే షెడ్యూల్, ఎన్ని మరేటర్లకు మార్గదర్శకాలు జారీ చేశాం. సర్వే ఫారం లో మొత్తం 57 ప్రశ్నలు ఉండగా అదనపు, ఉప ప్రశ్నలతో కలిపి మొత్తం 75 క్షేత్రస్థాయిలో సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ మరియు కుల అంశాలకు సంబంధించిన సమాచారం సేకరించబడిందన్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాను 150 కుటుంబాలతో కూడిన ఎన్యూమరేషన్ బ్లాక్‌గా విభజించి తద్వారా 94,261 బ్లాక్ లను ఏర్పాటు చేశారు

ప్రతి ఎన్యూమరేషన్ బ్లాక్‌కి ఎన్యూమరేటర్‌ను, ప్రతి పదిమంది ఎన్యూమరేటర్లను పర్యవేక్షించడానికి ఒక సూపర్వైజర్‌ను నియమించామన్నారు. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1, 03, 889 ఎన్యుమరేటర్లు మరియు సూపర్వైజర్లను నియమించడం జరిగింది. 6 నవంబర్ 20 24న హౌస్ లిస్టింగ్ ప్రారంభమైంది

6 నవంబర్ నుంచి 8 నవంబర్ వరకు మూడు రోజులపాటు హౌస్ లిస్టింగ్. అసలైన సర్వే 9 నవంబర్ 24 నుంచి తెలంగాణ గవర్నర్ గారితో ప్రారంభమైంది. సర్వే మొత్తం 50 రోజుల్లో పూర్తయింది. సర్వే పూర్తయ్యే సమయానికి గ్రామీణ ప్రాంతంలో 66,99,62 నగర ప్రాంతంలో 45, 15, 532 కాగా మొత్తం సర్వే చేసిన కుటుంబాల సంఖ్య 1,12,15,1134 సర్వే నుంచి వచ్చిన ఫలితాలు రాష్ట్రంలో 3,54,77,554 మందిని సర్వే చేయడం జరిగింది.

ఎస్సీలో 61,84,3119 ఉండగా ఇది మొత్తంలో 17.43 శాతం. బిసి(ముస్లిం మైనారిటీలు మినహా) 1,64,09,179 ఉండగా ఇది మొత్తంలో 46.25 శాతం. ముస్లిం మైనార్టీలలో మొత్తం 44,57,012 ఉండగా ఇది మొత్తంలో 12.56 శాతంగా ఉంది. ముస్లిం మైనారిటీలలో బీసీలుగా 35,76,588 ఉండగా ఇది మొత్తంలో 10.08 శాతంగా ఉంది.ముస్లిం మైనారిటీలలో ఓసీలు 8,80,424 ఉండగా ఇది మొత్తంలో 2.48 శాతంగా ఉంది. ముస్లిం మైనారిటీలు మినహా ఓసీలు 47, 21, 115 ఉండగా ఇది మొత్తంలో 13.31 శాతంగా ఉందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు.

# రీ సర్వే చేయాలి

## చట్టబద్ధత కల్పించాకే స్థానిక ఎన్నికలు

### అసెంబ్లీలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని



**హైదరాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కుల గణన సర్వేకు సంబంధించి ఫార్మెట్‌ను మార్చి రీసర్వే చేయాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్ డిమాండ్ చేశారు. ఈ సర్వే వివరాలపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. శాసనసభలో మంగళవారం ప్రవేశపెట్టిన కుల గణన సర్వే నివేదికపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సర్వే కోసం 56 అంశాలను పరిగణలోకి తీసుకున్నారని, అది సరికాదన్నారు. ఈ ప్రొఫార్మాలో పలు అంశాలు ఉండడంతో చాలా మంది సర్వేలో పాల్గొనలేదని చెప్పారు. హడావిడీగా కాకుండా ఈ అంశాలను తగ్గించి మళ్లీ ఫార్మాట్‌ను మార్చి రీ సర్వే చేయించాలని సూచించారు. ప్రభుత్వం కేవలం కుల గణన సర్వే నిర్వహించి అసెంబ్లీలో తీర్మానం చేస్తే సరిపోదన్నారు. ఈ సర్వే విషయంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు చట్టబద్ధత కల్పించాలని స్పష్టం చేశారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా బీసీలు వెనకబడి ఉన్నారన్నారు. ఎన్నో దశాబ్దాలుగా బీసీలు తమ హక్కుల కోసం పోరాడుతూనే ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం చేయించిన కులగణన సర్వేపై కొన్ని వర్గాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నా యని పేర్కొన్నారు. గడిచిన పదిహేనేళ్లలో బీసీల జనాభా పెరగలేదని సర్వేలో వెల్లడించడం సరికాదని తప్పుపట్టారు. 2011 జనాభా లెక్క ల ప్రకారం 3.54 కోట్ల మంది ఉన్నారని, 14 ఏళ్లలో 14 లక్షల జనాభానే పెరిగినట్లు చూపించడంలో వాస్తవం ఉందా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఏ కులం జనాభా ఎంత పెరిగిందో ప్రభుత్వం వెల్లడించాల్సిందేనన్నారు. దేశ, రాష్ట్రాభివృద్ధిలో వెనుకబడిన వర్గాలది కీలక పాత్ర అని తెలియచేశారు. ఎస్సీల జనాభా, ముస్లింల జనాభా తగ్గినట్లుగా ప్రభుత్వం నిర్వహించిన కుల గణన సర్వే చెప్తోందన్నారు. హైదరాబాద్ నగరం పరిధిలో 30 శాతం మంది కూడా సర్వేలో పాల్గొనలేదని వెల్లడైనట్లు పేర్కొన్నారు. జీహెచ్ఎంసీలో చాలా మంది తమ వివరాలు చెప్పలేదని స్పష్టం చేశారు. సామాజిక, ఆర్థిక, రాజకీయంగా ఎదగాలని బీసీలు భావిస్తున్నా రని స్పష్టం చేశారు. జనాభా దామాషా మేరకు రాజకీయ న్యాయం జరగాలని బీసీ వర్గాలు భావిస్తున్నారన్నాయని చెప్పారు. కేవలం సర్వే చేయించి, ఆ నివేదికను అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించి చేతులు దులుపుకోవడం సరైనది కాదన్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు చట్టబద్ధత కల్పించాల్సించి కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించినట్లు బీసీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాల్సిందేనన్నారు. సర్వే ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనని తేల్చిచెప్పారు.

# కులగణన ఉద్దేశం ఏమిటి?

### సిపిఐ ఎమ్మెల్యే కూనం నేని సాంబశివరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:** కులగణనపై అసెంబ్లీలో చర్చ పెట్టి కేంద్రానికి పంపి చేతులు దులుపుకోవద్దని సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కులగణనపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా మాట్లాడారు. కులగణన సర్వేపై అనేక అభ్యంతరాలు ఉన్నాయన్నారు. సర్వేను సభలో పెట్టారని, దీని ఉద్దేశ్యం ఏమిటో చెప్పాలన్నారు. మూడు లక్షల కుటుంబాలు సర్వేలు పాల్గొనలేదన్నారు. ఒకపనిచేస్తే విమర్శలు వస్తాయని, సమాచారం దాస్తే ఎవరికేం ఉపయోగం తనకు తెలియదన్నారు. ప్రభుత్వంపై విమర్శల కంటే సూచనలు చేస్తే ఉత్తమం అన్నారు. కులగణన లిస్టులను గ్రామాలలో ఉంచి మిగిలిన వారి పేర్లు నమోదు చేయాలన్నారు. రీ సర్వే చేయాలంటే ఎప్పటికీ అవ్వదన్నారు. 2014 సర్వేను ఈ సర్వేతో పోల్చకూడదన్నారు. ఒక్క రోజులో హడావుడిగా చేసిన సర్వేకు ఈ సర్వేకు చాలా తేడా ఉందన్నారు. సర్వేను సభలో ప్రవేశపెట్టారు. దీని ఉద్దేశ్యం ఏమిటన్నారు. బిసి రిజర్వేషన్లు పెంచుతారా? లేదా ? పెంచితే ఎంత పెంచుతారో చెప్పాలన్నారు. ఈ సర్వే కాగితాలకే పరిమితం అవుతుందా అన్నారు. 50శాతం రిజర్వేషన్లు దాటొద్దని సుప్రీంచెప్పిందన్నారు. జడ్జిమెంట్‌కు లోబడే ప్రభుత్వం పనిచేస్తుందా అన్నారు. కామారెడ్డిలో 44శాతం పెంచుతామని హామి ఇచ్చారని, ఎంత పెంచినా ప్రాక్టికల్‌గా ఉండాలని, ఇక్కడ చర్చపెట్టి కేంద్రానికి పంపి చేతులు దులుపుకోవద్దన్నారు.

# హైడ్రా విషయంలో వెనక్కి తగ్గేది లేదు

## పేదల ఇళ్లు కూల్చుతామంటే ఊరుకోను

## ఇప్పటికే తనపై 173 కేసులు ఉన్నాయన్న దానం నాగేందర్

## పార్టీ మార్పునకు సంబంధించి నోటీసులు అందలేదన్న ఎమ్మెల్యే

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** నగరంలోని పేదల ఇళ్లను కూల్చివేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని,అధికారుల విషయంలో వెనక్కి తగ్గేది లేదని ఖైరతా బాద్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత దానం నాగేందర్ అన్నారు. హైడ్రా అధికారుల విషయంలోనూ వెనక్కి తగ్గేదిలేదని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే తాను అధికారుల విషయంలో రాజీ పడలేదని అన్నారు. అవసరమైతే జైలుకు కూడా వెళ్తానని, ఇప్పటికే తనపై 173 కేసులు ఉన్నాయన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హైడ్రా ఆపరేషన్ విషయంలో దానం నాగేందర్ అసహనం వ్యక్తం చేశారు. ఆయన ఇంకా మాట్లాడుతూ, తన ఇంట్లో వైఎస్ రాజశేఖరరెడ్డి, కెసిఆర్ ఫొటోలు ఉన్నాయని, వారి ఫొటోలు ఉంటే తప్పేమిటని ప్రశ్నించారు. నాయకుల విషయంలో ఎవరి అభిప్రాయం వారికి ఉంటుందన్నారు.

ఁ పటాన్‌చెరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కెసిఆర్ ఫొటో ఉండ టంపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు పంపించిన విషయాన్ని మీడియా ప్రతినిధులు ప్రస్తావించగా, ఇప్పటివరకు తనకు ఎలాంటి నోటీసులు రాలేదని ఆయన అన్నారు. నోటీసులు వచ్చాక స్పందిస్తానని తెలిపారు. 'పేదల ఇళ్లు కుల్చుతా అంటే ఊరుకోం. హైడ్రా విషయంలో కూడా వెనక్కి తగ్గేదిలేదు. నా ఇంట్లో వైఎస్సార్, కెసిఆర్ ఫొటో ఉంది. ఇంట్లో లీడర్ల ఫొటోలు ఉంటే తప్పేం టి? ఎవరి అభిమానం వాళ్లది' అంటూ దానం నాగేందర్ వ్యాఖ్యానించారు.

ఁఎలాంటి పబ్లిక్ నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేస్తున్నారన్నారు. అధికారులు చేసే పనుల వల్ల ప్రజల మధ్య తాము తిరగలేకపోతున్నామని అన్నారు. పేదప్రజల జీవనాధారాన్ని అధికారులు ధ్వంసం చేస్తున్నారంటూ ధ్వజమెత్తారు. ఆయన గతంలోనూ నగరంలో ఫుట్‌పాత్‌ల కూల్చివేతలపై అధికా రులు ఏకపక్షంగా వివ్యహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

# శాసనమండలి నుంచి బిఆర్ఎస్ వాకౌట్

### బిసి రిజర్వేషన్ల పెంపుపై ప్రభుత్వం స్పష్టత

### ఇవ్వాలి: ఎమ్మెల్సీ కవిత డిమాండ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే నివేదికపై ప్రతిపక్ష బీఆర్ఎస్ శాసనమండలి నుంచి వాకౌట్ చేసింది. శాసనమండలిలో ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేపై ప్రభుత్వం ప్రకటన చేసింది. అయితే ఈ నివేదికపై ప్రకటన కాకుండా చర్చకు అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ పట్టుపట్టింది. ప్రభుత్వం ప్రకటన జారీ చేస్తే దానిపై చర్చ ఉండదని.. కేవలం అనుమానాల నివృత్తి(క్లారిఫికేషన్స్) మాత్రమే ఉంటుందని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రకటనపై క్లారిఫికేషన్లు ఉంటే అడగాలని ఛైర్మన్ సూచించారు. ప్రతిపక్ష నేత మధుసూదనాచారి మాట్లాడుతూ ప్రభుత్వం సమగ్ర కులగణన సర్వేపై కొండను తవ్వి ఎలుకను పట్టిందన్నారు. గతంలో బీఆర్ఎస్ చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే లెక్కలకి.. ఇప్పటి లెక్కలకి బీసీ జనాభా తగ్గిందనే అభిప్రాయం వ్యక్తం అవుతుందని అన్నారు. అందుకు మంత్రులు కలుగజేసుకొని గతంలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహిస్తే వాటి వివరాలను గత బీఆర్ఎస్ ఎందుకు ప్రకటించలేదని.. ఎక్కడ దాచిపెట్టిందని ప్రశ్నించారు. వారు అప్పటి లెక్కలను బహిర్గతం చేసి ఉంటే.. ఇప్పటి లెక్కలతో పోల్చి చూసేవారమని ఉప ముఖ్యమంత్రి భట్టి సమాధానమిచ్చారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ల పెంపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. కులగణన విషయంలో తదుపరి కార్యాచరణను ప్రభుత్వం ప్రకటిస్తుందని భావించామని.. కానీ రెండు రోజుల క్రితం కేబినెట్ సబ్ కమిటీ ఛైర్మన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి విలేకరుల సమావేశంలో చెప్పిన విషయాలనే.. ప్రకటన రూపంలో శాసనమండలిలో చెప్పడం ద్వారా ఉపయోగమేమిటో ప్రభుత్వం చెప్పాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు రిజర్వేషన్లను పెంచిన తర్వాత ఎన్నికలు నిర్వహిస్తారా? లేదా? అన్నది ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. బీసీలను, బీసీ ముస్లింల జనాభాను వేరు చేసి ప్రభుత్వం చెబుతుందని, ఇది కేవలం జనాభాను తక్కువ చేసి చూపించాలన్న ఉద్దేశంతోనే చేస్తున్నారని అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ప్రభుత్వం ఒక నిర్దిష్టమైన కార్యాచరణను ప్రకటించాలన్నారు. ఇంతవరకు ఖచ్చితమైన డేటానే లేదని ప్రభుత్వం చెప్పడం సరికాదని.. 2011 జనాభా లెక్కలు అందుబాటులో ఉన్నాయ న్నారు. అంతర్జాతీయంగా, జాతీయంగా 10 సంవత్సరాలలో సగటున 13.5 శాతం జనాభా పెరుగుతుందన్నది అంచనా అని.. ఆ లెక్కన ఇప్పుడు తెలంగాణ జనాభా 4 కోట్ల 18 లక్షలు ఉండాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన సర్వేలో ఎస్సీ, ఎస్టీ, బీసీల జనాభా తగ్గినట్లు కేవలం ఓసీల జనాభానే పెరిగినట్టు కనిపిస్తుందన్నారు. అన్ని వర్గాల జనాభా తగ్గి కేవలం ఒక వర్గం జనాభా ఎలా పెరుగుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వం చర్చకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమయంలో ఛైర్మన్ చర్చకు అంగీకరించక పోవడంతో.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వెల్‌లోకి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తాము సమగ్ర కుల గణన సర్వే నివేదికను వ్యతిరేకిస్తున్నామని.. అందుకు నిరసనగా వాకౌట్‌చేస్తున్నట్టు ప్రకటించి సభ నుంచి బయటికి వెళ్లిపోయారు.

# జనవరిలో ఎసిబి కేసుల సంఖ్య 19

## లంచం సొమ్ము రూ.1.45 లక్షలు,

## అక్రమ ఆస్తులు రూ.65.50 లక్షల జప్తు

**హైదరాబాద్, ఫిబ్రవరి, 4, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా ఈ యేడాది జనవరి నెలలో 19 ఎసిబి కేసులు నమోదయ్యాయి. ఇందులో పది కేసులు రెడ్ హ్యాండెడ్ ట్రాప్‌కు సంబంధించినవి కాగా ఒకటి ఆదాయానికి మించి ఆస్తులు కలిగినవి. మూడు కేసులు క్రిమినల్, అసభ్య ప్రవర్తన, మరో మూడు రెగ్యులర్ కేసులు, ఇంకో మూడు అక్రమాస్తులకు సంబంధించిన విచారణ కేసులు. ఈ సందర్భంగా ఆయా సర్కారీ విభాగాలకు చెందిన 14 మంది ఉద్యోగులు, ముగ్గురు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పట్టుబడగా, వీరివద్ద నుంచి లక్షా 45 వేల రూపాయల లంచం తాలూకు సొమ్మును జప్తు చేశారు. గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించి ఒక అధికారి వద్ద 65 లక్షల 50 వేల అక్రమాస్తులు పట్టుబడ్డాయి. కాగా సర్కారీ విభాగాల్లో అవినీతి గురించి ఎవరి వద్ద ఎలాంటి సమాచారం ఉన్నా 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఎసిబి డిజి విజయ్‌కుమార్ తెలిపారు. దీంతోపాటు ఎసిబి విభాగా నికి సంబంధించి ఫేస్‌బుక్, ట్విటర్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చన్నారు.

# నిజాం నిరంకుశత్వంపై పోరాడిన మగ్దూం మొయినుద్దీన్

## 117వ జయంతి వేడుకల్లో కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** ఆనాటి నిజాం నవాబు నిరంకుశత్వంపై మగ్దూం మొయినుద్దీన్ రాజీలేని పోరాటం చేశారని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆయన నిర్మాణ దక్షకుడు, ఏఐటీయూసీ ఆనాటి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా మూడు నాలుగు పర్యాయాలు పనిచేశారని గుర్తు చేశారు. మగ్దూం మొయినుద్దీన్ 117వ జయంతి సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్‌లో కూనంనేని సాంబశివరావు మొయినుద్దీన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ మొయినుద్దీన్ ఉన్నతమైన చదువులు చదివి గొప్ప కవిగా పేరుగాంచారని అన్నారు. నిజాం దుందుడుకు చర్యలు, దమనకాండకు వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తు చేశారు. ముస్లింలంతా నిజాం ప్రభువు తాబేదారులనే చర్చ జరుగుతుంటే షేక్ బందగి, షోయబుల్లాఖాన్, మొయినుద్దీన్ వంటి అనేకమంది న్యాయం కోసం మతం, కులాన్ని పక్కనపెట్టి నిజాం ప్రభువుకు వ్యతిరేకంగా, ప్రజల బాధలే లక్ష్యంగా అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్రం వస్తే 1947 సెప్టెంబర్ 11న నిజాం నవాబు స్వతంత్ర రాజ్యాంగ ప్రకటించుకున్నాడని కూనంనేని గుర్తు చేశారు.1945 నుండి కమ్యూనిస్టులు పోరాటం చేసి సాధించిన భూములను పటేల్ సైన్యం కుమ్మక్కై భూములను లాక్కునే ప్రయత్నం చేయగా.. పటేల్ సైన్యం కమ్యూనిస్టులపై చేస్తున్న దాడులను తిప్పి కొట్టడానికి సాయుధ పోరాటమే శరణ్యమని 1947 సెప్టెంబర్ 11న ఆంధ్ర మహాసభ అధ్యక్షులు రావి నారాయణరెడ్డి, భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ ప్రాంత కార్యదర్శి బద్దం ఎల్లారెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మగ్దం మొయినుద్దీన్‌లు ముగ్గరు సాయుధ పోరాటానికి పిలిపివ్వడం జరిగిందన్నారు.

# బిసిలకు అన్యాయం చేస్తే మరో ఉద్యమం తప్పదు



మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

### మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** బీసీలకు ప్రభుత్వం అన్యాయం చేస్తే బీసీల ఐక్యంతో మరో అతిపెద్ద ఉద్యమం వస్తుందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని అన్నారు. తెలంగాణ ఉద్యమం కన్నా తీవ్రంగా ఈ ఉద్యమం ఉండబోతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తుందో ప్రజలు గమనిస్తున్నారని, బీసీల కోసం మరో ఉద్యమం రాబోతోందన్నారు. 1947 స్వతంత్ర ఉద్యమం, 1969 తెలంగాణ ఉద్యమం మనం చూడలేదని, కేసీఆర్ నడిపిన తెలంగాణ ఉద్యమం చూశామని, కానీ ఇప్పుడు బీసీలకు అన్యాయం జరిగితే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. శాసనసభ రూల్స్, ప్రొసిజర్స్ తుంగలో తొక్కారని, తెలంగాణ సమాజం న్యాయం కోసం, కామారెడ్డి డిక్లరేషన్ యధాతథంగా అమలు చేయడం కోసం తెలంగాణ సమాజం ఎదురుచూస్తుందన్నారు. స్పీకర్ శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు అడిగిన వెంటనే సభ వాయిదా వేయడం ఖండిస్తున్నామన్నారు. స్పీకర్ సభను వాయిదా వేసే ముందు మమ్మల్ని అడగరా అని ప్రశ్నించారు. ప్రాధాన్యత గల అంశాలపై నాలుగు రోజులు చర్చ లేకుండా ఒక్క రోజులో ముగించడం ఏమిటన్నారు. నేను ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఉన్నానని, ఇంత బాధ్యతారహి తంగా, అన్యాయంగా, కుట్రపూరితంగా వ్యవహరించడం ఎప్పుడు చూడలేదన్నారు. సర్వేలో అనుమానాలు ఉన్నాయని, అవి నివృత్తి కావాలన్నారు. కుల గణన తప్పు అని మేము అంటున్నామని, కరెక్టు అని నిరూపించుకోవాలన్నారు. ఉదయం 11 గంటలకు అసెంబ్లీ అని పిలిచి నిమిషం కూడా నడపక ముందు వాయిదా వేయడం అంటే అవ మానించినట్లే అన్నారు.

**ఒక్క మాట మాట్లాడకుంటా వాయిదా : వేముల ప్రశాంత్‌రెడ్డి**

అసెంబ్లీ ప్రారంభం కాగానే ఒక్క మాట కూడా మాట్లాడకుండానే వాయి దా వేశారని, శాసన సభ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా చేశారని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఉమ్మడి ఏపీ చరిత్రలో కూడా ఇలా జరగలేదని, సభలో ఒక్క మాట కూడా చెప్పకుండా వాయిదా వేశారన్నారు. ఒక్క మంత్రి కూడా శాసన సభలో లేరని, ఇది శాసనసభను అవమాన పరచడం కాదా అన్నారు.

**కాంగ్రెస్ బిసిలకు ఇచ్చే గౌరవం ఇదేనా?: గంగుల కమలాకర్**

కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చే గౌరవం ఇదేనా ? బీసీ గణనపై చర్చ అని అసెంబ్లీకి 11 గంటలకు పిలిచి వాయిదా ఎందుకు వేశారని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రశ్నించారు. బీసీలను రమ్మని సభ వాయిదా వేశారని, ఇదా మీరు బీసీలకు ఇచ్చే గౌరవమన్నారు. కేబినెట్ చర్చ లేకుండా, అప్రూవల్ లేకుండా ఇదేం పద్ధతని, ఏం చేసే ఉద్దేశ్యంతో మీరు ఇలా చేస్తున్నారని మండిపడ్డారు.



**బిసిలపై బిఆర్ఎస్ మొసలి కన్నీరు: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

బిసిలపై బీఆర్ఎస్‌మొసలి కన్నీరు కారుస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. గతంలో ఒక్కరోజు సర్వే చేసి నివేదిక బయట పెట్టని ఈ పార్టీ ఈరోజు బీసీ కుల గణనపై మాట్లాడుతుందన్నారు. స్పీకర్ అనుమతితో సభ వాయిదా పడిందన్నారు. స్థానిక సంస్థల్లో 34శాతం ఉన్న బీసీల రిజర్వేషన్లు 29శాతానికి తగ్గించిన ఘనత బీఆర్ఎస్ పార్టీ దన్నా రు. ఆ రోజు బీసీలపై మీకున్న చిత్తశుద్ధి ఏ మైందనిప్రశ్నించారు.

**దేశ చరిత్రలో గుర్తు ఉండిపోయే రోజు : బీర్ల ఐలయ్య**

50 రోజుల్లో కులగణన దేశచరిత్రలో ఎన్నడూ జరగలేదని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. గంగుల కమలాకర్‌కు బీసీ కుల గణనపై మాట్లాడే హక్కు లేదని, మీరు గతంలో చేసిన సమగ్ర కుటుంబ సర్వే లెక్కలు ఫాంహౌస్‌లో దాచి పెట్టారని విమర్శించారు.

**తెలంగాణ రోల్ మోడల్: ప్రభుత్వ విప్ రాంచంద్రానాయక్**

దేశ చరిత్రలో తెలంగాణ ఒక రోల్ మోడల్, కేవలం 50 రోజుల్లో కుల గణన పూర్తి చేశామని ప్రభుత్వ విప్ రాంచంద్రానాయక్ అన్నారు. సభాపతి అందరికీ మాట్లాడే అవకాశం ఇస్తామని అన్న కూడా రాజకీయ అవివేకంతో బీఆర్ఎస్ నేతలు ఇలా మాట్లాడుతున్నారన్నారు.

## మీడియా పాయింట్


దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఇంటి దగ్గర తయారు చేసిన స్క్రిప్ట్ మీలాగా మేము చదవడం లేదని దేవరకద్ర ఎమ్మెల్యే చధుసూదన్ రెడ్డి అన్నారు. ఫాం హౌస్‌లో నలుగురు కూర్చొని బిల్లులు అసెంబ్లీలో పెట్టే సాంప్రదాయం మాది కాదన్నారు. ఇప్పుడు అంతా ప్రజాస్వామ్య బద్ధంగా జరుగుతుందని, ఇది హరీశ్‌రావు గుర్తించాలన్నారు.

**ప్రభుత్వ తీరు బాగాలేదు: ఎమ్మెల్యే పాయల్ శంకర్**

శాసనసభలో ఈ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు బాగాలేదని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



అన్నారు.బిజెపి ఎమ్మెల్యేలు కాటేపల్లి వెంకటరమణారెడ్డి, రాకేష్ రెడ్డి, రామారావు పవార్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ మేము హుటాహుటిన నియోజకవర్గం నుండి వస్తే సభ ప్రారంభించిన వెంటనే వాయిదా వేయడం భాదాకరన్నారు. వారికి సమస్యల పై చర్చించే ఆలోచన లేనట్లు ఉందని, కేబినెట్ మీటింగ్ కూడా ఒకే రోజు పెట్టాల్సిన అవసరం ఏముందన్నారు. మేము ప్రజా సమస్యలపై మాట్లాడితే ప్రజాసమయం దుర్వినియోగం అంటారని, మరి ఈ రోజు వారు చేసిందేమిటని ప్రశ్నించారు.



ప్రజావాణిలో దరఖాస్తుదారుల సమస్యలు వింటున్న డా.జి.చిన్నారెడ్డి

# ప్రజావాణికి అందిన దరఖాస్తులు 7,142

**హైదరాబాద్ (బేగంపేట) ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 7,142 దరఖాస్తులు అందాయి. ఇందులో అధిక శాతం ఇందిరమ్మ ఇళ్ల కోసం 4,860 దరఖాస్తులు వచ్చాయి. పౌర సరఫరాల శాఖకు సంబంధించి 1,861, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 175, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 46 దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణికి ఒక దరఖాస్తు అందినట్లు అధికారులు తెలియజేసారు. ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

## ఐసిసి టీమ్ ఆఫ్ ది టోర్నీలో నలుగురు

# భారత్ అమ్మాయిలకు చోటు



**న్యూఢిల్లీ:** అండర్-19 మహిళల టీ20 ప్రపంచ కప్‌ను వరుసగా రెండోసారి సాధించిన భారత జట్టులోని పలువురు ప్లేయర్లకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టీమ్‌లో చోటు దక్కింది. ఈ నెల 2వ తేదీన మలేసియాలో జరిగిన అండర్ టీ20 వరల్డ్ కప్ టైటిల్ పోరులో నికీ ప్రసాద్ నేతృత్వంలోని భారత అమ్మాయిల జట్టు తొమ్మిది వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాపై జయభేరిమోగించిన సంగతి తెలిసిందే. ఈ టోర్నీ ఆసాంతం విశేషంగా రాణించిన తెలంగాణ స్టార్ ఓపెనర్ గొంగడి త్రిష సహా మొత్తం నలుగురు భారత క్రికెటర్లకు ఐసీసీ టీమ్ ఆఫ్ ద టోర్నమెంట్‌లో స్థానం లభించింది. త్రిష ఓపెనింగ్ భాగస్వామి కమలిని, లెఫ్టార్మ్ స్పిన్ ద్వయం వైష్ణవి శర్మ, ఆయుశి శుక్లాలు కూడా ఐసీసీ ఎంపిక చేసిన జట్టులో ఉన్నారు. హార్డ్ హిట్టర్ త్రిష ఈ టోర్నీ చరిత్రలోనే తొలి సెంచరీతో సహా 309 పరుగులు చేసింది. లెగ్‌స్పిన్‌తో 7 వికెట్లను కూడా పడగొట్టింది. ఆమెతో జోడీగా దిగిన కమలిని 143 పరుగులు చేసింది. ఇంగ్లండ్‌తో జరిగిన సెమీఫైనల్లో కమలిని (50 బంతుల్లో 56 నాటౌట్) అజేయ అర్ధ సెంచరీతో ఆకట్టుకుంది. భారత స్పిన్నర్లలో ఆయుశి 14 వికెట్లను చేజిక్కించుకోగా, వైష్ణవి 17 వికెట్లతో టోర్నీలోనే అగ్రస్థానంలో ఉంది. మలేసియా పై హ్యాట్రిక్‌తో ఆమె (5/5) అత్యుత్తమ గణాంకాలు నమోదు చేసింది. ఇక ఈ ఐసీసీ టీమ్ ఆఫ్ ద టోర్నీలో స్థానం దక్కిన వారిలో కైలా రేనెకె (కెప్టెన్, దక్షిణాఫ్రికా), జెమ్మా బోతా (దక్షిణాఫ్రికా), త్రిష, కమలిని, ఆయుశి శుక్లా, వైష్ణవి శర్మ (భారత్), దేవినా పెరిన్, కేటీ జోన్స్ (ఇంగ్లండ్), కావొంహెబ్రే (ఆస్ట్రేలియా), చమొది ప్రబొద (శ్రీలంక), పూజ మహతో (నేపాల్), 12వ ప్లేయర్‌గా ఎస్తబిసెంగ్ నిని (దక్షిణాఫ్రికా) ఉన్నారు.

# నేషనల్ గేమ్స్‌లో.. తెలంగాణ షూటర్ సురభికి కాంస్యం



**న్యూఢిల్లీ:** నేషనల్ గేమ్స్‌లో తెలంగాణకు రెండో పతకం లభించింది. షూటర్ సురభి భరద్వాజ్ కాంస్య పతకం గెలిచింది. భోపాల్ వేదికగా జరిగిన విమెన్స్ 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఈవెంట్‌లో సురభి 488.8 స్కోరుతో మూడో స్థానంలో నిలిచి పతకం అందుకుంది. ఇండియా స్టార్ షూటర్, పంజాబ్‌కు చెందిన సిఫ్ట్ కౌర్ సమ్రా 461.2 స్కోరుతో గోల్డ్ అందుకుంది. అదే రాష్ట్రానికి చెందిన సీనియర్ షూటర్ అంజుమ్ మోద్గిల్ 458.7 స్కోరుతో సిల్వర్ గెలిచింది. మరో గేమ్‌లో మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రి పొజిషన్‌లో సురభి 425.9 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచి నిరాశ పరిచింది. ఈ విభాగంలో ప్రియ (461.4), విదర్శ (461.1), మాణిని (448.6) పతకాలు కైవసం చేసుకున్నారు. మరోవైపు బాస్కెట్ బాల్ 3+3 మహిళల విభాగంలో తెలంగాణ విమెన్స్ టీమ్ ఫైనల్ చేరుకొని పతకం ఖాయం చేసుకుంది. ఇక మెన్స్ బాస్కెట్‌బాల్ టీమ్ కాంస్య పతక పోరుకు అర్హత సాధించింది.

## మరో లీగ్‌లోకి ఐపిఎల్ ఫ్రాంచైజీ ఎంట్రీ

### రూ.1,251.11 కోట్లతో కొత్త జట్టు కొనుగోలు

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ టీమ్ లక్నో సూపర్ జెయింట్స్ క్రికెట్ అభిమానులను అలరించేందుకు మరో లీగ్ లోకి అడుగుపెట్టింది. ది హండ్రెడ్ లీగ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. తాజాగా ఈ లీగ్ కు చెందిన మాంచెస్టర్ ఒరిజినల్స్ టీమ్ వేలానికి రాగా, లీఎస్‌జి యాజమాన్యం ఆ జట్టును కళ్లు చెదిరే ధర పెట్టి దక్కించుకుంది. టీమ్ మొత్తం విలువలోని 49 శాతం వాటాను ఊహించని విధంగా భారీ ధరతో బిడ్డింగ్



వేసి గెలుపొందింది. అంతకుముందు హండ్రెడ్ లీగ్ లోని లండన్ స్పిరిట్ జట్టు కోసం బిడ్ వేసి విఫలమైన లక్నో సూపర్ జైంట్స్ యాజమాన్యం, ఇప్పుడు మాంచెస్టర్ ఒరిజినల్స్‌ను బిడ్డింగ్ వేసి సొంతం చేసుకుంది. దాదాపు 116 మిలియన్ పౌండ్ల (దాదాపు రూ.1,251 కోట్లు) భారీ ధరకు మాంచెస్టర్ ఒరిజినల్స్ జట్టును లక్నో యాజమాన్యం అయిన సంజీవ్ గోయెంకా ఆర్‌పిఎస్‌జి గ్రూప్ కొనుగోలు చేసింది. తమతో లక్నో జత కట్టడంపై మాంచెస్టర్ కు చెందిన లంకషైర్ యాజమాన్యం సంతోషం వ్యక్తం చేసింది. తాజాగా ది హండ్రెడ్ లీగ్ లోకి ఐపీఎల్ స్టార్ టీమ్ ముంబయి ఇండియన్స్ కూడా అడుగుపెట్టింది. ఈ లీగ్ కు చెందిన ఓవల్ ఇన్విన్సిబుల్స్ జట్టును భారీ ధరకు ముంబయి యాజమాన్యం కొనుగోలు చేసింది. దీంతో ది హండ్రెడ్ లీగ్ లోకి అడుగుపెట్టిన రెండో ఐపీఎల్ టీమ్ గా లక్నో జెయింట్స్ నిలిచింది. గతంలో 2016-17 సమయంలో ఐపీఎల్ లో రైజింగ్ పుణె జెయింట్స్ ను కొనుగోలు చేసిన సంజీవ్ గోయెంకా గ్రూప్ 2021లో లక్నో జట్టును రూ.7,090 కోట్లకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. అలానే సన్ రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం అయిన సన్ గ్రూప్ కూడా హండ్రెడ్ లీగ్ లోని నార్తరన్ సూపర్ ఛార్జర్స్, ట్రెంట్ రాకెట్స్‌ను కొనుగోలు చేయాలని ఆసక్తిగా చూపిస్తున్నట్లు సమాచారం. వీటితో పాటు, దిల్లీ క్యాపిటల్స్ కో ఓనర్స్ అయిన జీఎమ్ఆర్ గ్రూప్ సౌత్‌రాన్ బ్రేవ్ లో వాటాను సొంతం చేసుకోవాలని ఆశిస్తోంది.



## భారత్‌లో తొలిసారి బాక్సింగ్

# ప్రీమియర్ లీగ్

### వచ్చే నెలలో 6 ప్రధాన నగరాల్లో పోటీలు

**న్యూఢిల్లీ:** భారత బాక్సింగ్ అభిమానులను ఆకట్టుకునేందుకు మరో కొత్త లీగ్ ప్రారంభం కాబోతోంది. ఇటీవల దేశంలో తొలిసారి ఖో ఖో వరల్డ్ కప్ పోటీలు నిర్వహించిన భారత్ ఇప్పుడు బాక్సింగ్‌లో ఇండియన్ ప్రీమియర్ లీగ్‌ను ప్రారంభించబోతోంది. ఇందులో భాగంగా ప్రముఖ బాక్సింగ్ లీగ్‌గా పేరొందిన అంథోనీ పెట్టిస్ ఫైటింగ్ చాంపియన్‌షిప్ (ఏపీఎఫ్‌సీ), ఇండియన్ ప్రొ బాక్సింగ్ లీగ్ (ఐపీబీఎల్) భారత్‌లో తొలిసారి బాక్సింగ్ పోటీలు నిర్వహించబోతున్నాయి. వచ్చే నెలలో దేశంలోని ఆరు ప్రధాన నగరాలు ఢిల్లీ, హైదరాబాద్, జైపూర్, ముంబై, గోవా, బెంగుళూరు వేదికలుగా ఈ బాక్సింగ్ పోటీలను నిర్వ హించనున్నాయి. ఇందుకోసం యూఎఫ్‌సీ లైట్‌వెయిట్ మాజీ చాం పియన్ అంథోనీ పెట్టిస్ తొలిసారి భారత్‌కు రాబోతున్నాడు.
డబ్ల్యూ బీసీ, ఇండియా ఛాంపియన్ సబరి జైశంకర్, సెర్గియో పెట్టిస్ మధ్య ప్రధాన పోరు జరుగుతుందని ఇండియన్ ప్రో బాక్సింగ్ లీగ్ మంగళవారం ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఇప్పటికే పలు ప్రపంచ బాక్సింగ్ కౌన్సిల్ (డబ్ల్యూ బీసీ) టైటిళ్లు సొంతం చేసుకున్న సబరి, సెర్గియో మధ్య పోరు రసవత్తరంగా సాగే అవకాశముంది.

# తొలి వన్డేలో డేంజరస్ ప్లేయర్స్

## పవర్ ఫుల్ ప్లేయింగ్ 11

### రేపు ఇంగ్లండ్‌తో రోహిత్ సేన ఢీ


**న్యూఢిల్లీ;** భారత్ వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్ ఈ నెల 6న ప్రారంభం కానుంది. టీ20 సిరీస్ లో భారత జట్టు 41తో విజయం సాధించిన నేపథ్యంలో, వన్డే సిరీస్‌పై అంచనాలు పెరిగాయి. రోహిత్ శర్మ నాయకత్వంలోని భారత జట్టు, ఇంగ్లాండ్‌ను ఓడించడానికి పవర్ ఫుల్ ప్లేయింగ్ ఎలెవెన్‌తో సిద్ధమవుతోంది. తొలి వన్డేలో టీమిండియా ప్లేయింగ్ 11లో డేంజరస్ ఆటగాళ్లతో రోహిత్ రంగంలోకి దిగుతున్నాడు. భారత్, ఇంగ్లండ్ మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ముగిసింది. టీం ఇండియా పూణేలో విజయంతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. కానీ, ముంబైలో కూడా ఎటువంటి రాయిని వదిలిపెట్టలేదు. ఐద వ, చివరి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌ను 150 పరుగుల తేడాతో ఓడించి 4-1తో సిరీస్‌ను గెలుచుకుంది. భారత జట్టు మొదట బ్యాటింగ్‌లో ఇంగ్లండ్‌పై తన అత్యధిక టీ20ఐ స్కోరును చేసింది. తరువాత బౌలింగ్‌లో అద్భుతాలు చేసింది. ఇంగ్లండ్ జట్టును కేవలం 97 పరుగులకే ఆలౌట్ చేసింది. వాంఖడే స్టేడియం పిచ్ బ్యాటింగ్‌కు చాలా బాగుంది. కానీ, ఇంగ్లండ్ జట్టు విఫలమైంది. వన్డే సిరీస్‌లో భారత్, ఇంగ్లండ్ మరోసారి ఢీ కొట్టనుంది. టీ20 సిరీస్ ముగిసిన తర్వాత, ఇప్పుడు వన్డే ఫార్మాట్‌లో భారత్ ఇంగ్లండ్ మధ్య అభిమానులు ఉత్కంఠను చూచే అవకాశం మళ్లీ వచ్చింది. ఈ రెండు జట్ల మధ్య 3 వన్డే మ్యాచ్‌లు జరగాల్సి ఉంది. ఈ నెల 6 నుంచి సిరీస్ ప్రారంభం కానుంది. ఇందుకోసం, టీ20 సిరీస్‌లో భాగం కాని భారత జట్టులోని కొంతమంది ఆటగాళ్లు మొదటి వన్డే ఆడాల్సిన నాగ్‌పూర్‌కు చేరుకున్నారు. భారత్-ఇంగ్లండ్ మధ్య రెండో వన్డే ఈ నెల 9న కటక్‌లో జరగనుండగా, సిరీస్‌లోని మూడో, చివరి వన్డే ఈ నెల 12న అహ్మదాబాద్‌లో జరగనుంది. ఈ మ్యాచ్‌లన్నీ భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1:30 గంటలకు ప్రారంభమవుతాయి. టాస్ అరగంట ముందుగా అంటే మధ్యాహ్నం 1 గంటలకు జరుగుతుంది. ఈ సిరీస్ కోసం



టీమిండియా ప్లేయర్లను ఇప్పటికే భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు ప్రకటించింది. ఇందులో చాలా మంది కీలక ఆటగాళ్లు తమ తమ బ్యాటక్లకు పదును పెడుతున్నారు. ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో భాగమైన కొంతమంది ఆటగాళ్లు ఈ ఇప్పుడు వన్డే జట్టులో కూడా కనిపించనున్నారు. ఇక ఈ వన్డే సిరీస్‌కు టీమిండియా ప్రాబబుల్ ప్లేయింగ్ 11లో రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, అర్షదీప్ సింగ్, మహ్మద్ షమీ.

# ఐదు రోజులూ ఆఫీసుకు రావాల్సిందే: డెల్

**ముంబై, ఫిబ్రవరి 4:** టెక్ కంపెనీలన్నీ వర్క్ ఫ్రమ్ హోమ్ విధానానికి స్వస్తి పలుకుతున్నాయి. ఇప్పటికే చాలా సంస్థలు తమ ఉద్యోగులంతా ఆఫీసుకు రావాలని అల్టిమేటం జారీచేశాయి. తాజాగా ప్రముఖ కంప్యూటర్ల తయారీ సంస్థ డెల్ కూడా హైబ్రిడ్, రిమోట్ వర్క్ పాలసీకి స్వస్తి చెబుతున్నట్లు పేర్కొంది. ఈ విషయాన్ని కంపెనీ సిఇఒ మైఖేల్ డెల్ ఇ-మెయిల్ ద్వారా ఉద్యోగులకు సమాచారం అందచేసినట్లు కొన్ని కథనాలు వెలువడుతున్నాయి. డెల్ కార్యాలయాల దగ్గర నివసించే ఉద్యోగులు ఇకపై హైబ్రిడ్, రిమోట్ వర్క్ విధానంలో పని చేయడానికి వీలుండదని మైఖేల్ డెల్ ఉద్యోగులకు పంపిన ఇ-మెయిల్‌లో తెలిపారు. వారంలో ఐదు రోజులు తప్పనిసరిగా ఆఫీస్ నుంచి పని చేయాలని తెలియ చేశారు. మార్చి 3 నుంచే ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయని అందులో స్పష్టంగా పేర్కొన్నారు. అయితే కార్యాలయం సమీపంలో నివసిస్తున్న ఉద్యోగులకు మాత్రమే ఈ నిబంధనలు వర్తిస్తాయని తెలుస్తోంది. సుదూర ప్రాంతాల్లో నివసించే ఉద్యోగులు రిమోట్‌గా పని చేసేందుకు సీనియర్ లీడర్ల నుంచి తగ్గిన కారణాలు చూపించి తప్పనిసరిగా అనుమతి పొందాల్సి ఉంటుంది. లేదంటే వారెవరికీ పదోన్నతులు ఉండవని తెలుస్తోంది. భవిష్యత్తులో నియమించుకొనే వారికి ఇకపై రిమోట్ విధానం ఉండదని అందులో పేర్కొంది. కరోనాకు ముందు నుంచే డెల్‌లో వర్క్ ఫ్రమ్ హోమ్



విధానం అమల్లో ఉండేది. కంపెనీ వ్యవస్థాపకుడు, సిఇఒ మైఖేల్ డెల్ ఖుద్దా దీన్ని ప్రోత్సహించే వారు. పైగా ఆఫీసుకు రావాలని ఆదేశిస్తున్న కంపెనీలను ఆయన తప్పుబట్టారు. కానీ తాజాగా డెల్ విధానాల్లో సమూల మార్పులు వచ్చాయి. అందరూ కలిసి పనిచేయడం, తమ ఆలోచనలను పంచుకోవడం సంస్థ వృద్ధికి దోహదం చేస్తుందని కంపెనీ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రతి ఒక్కరూ ఆఫీసుకు రావాలని కోరుతోంది.

# బిఎస్ఇ టర్నోవర్ రూ.425 లక్షల కోట్లు

**ముంబై, ఫిబ్రవరి 4:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో మన సూచీలు రాణించాయి. కెనడా, మెక్సికో దేశాలపై విధించిన టారిఫ్‌లను తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో మార్కెట్లలో పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. వాణిజ్య యుద్ధ భయాలు రేపిన ట్రంప్ నుంచి సానుకూల నిర్ణయం వెలువడడంతో ఆసియాతో పాటు మన మార్కెట్లు సూచీల భారీ లాభాలకు కారణమైంది. చివరికి సెన్సెక్స్ 1226.94 పాయింట్లలాభంతో 78,413.68 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 378.20 పాయింట్లు పెరిగి 23,739.25 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.87.07గా కొనసాగుతోంది. రూ.5.5 లక్షల కోట్లు ఇన్వెస్టర్ల సంపద పెరిగి రూ.425 లక్షల కోట్లకు చేరింది. ఎల్అండ్‌టి, ఇండస్ ఇండ్ బ్యాంకు, అదానీ పోర్ట్స్, టాటా మోటార్స్, రిలయన్స్ వంటి షేర్లు ప్రధానంగా లాభపడగా, ఐటిసి హోటల్స్, జొమాటో, నెస్లే ఇండియా, హిందుస్థాన్ యూనిలీవర్, మారుతి వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. మెక్సికో, కెనడాపై సుంకాల విషయంలో ట్రంప్ తన



నిర్ణయాన్ని వాయిదా వేయడం సూచీల లాభాలకు కారణమైంది. దీంతో ఆసియా మార్కెట్లతో పాటు మన మార్కెట్లూ లాభపడ్డాయి. రేట్లకోతపై ఆర్‌బిఐ నుంచి సానుకూల సంకేతం వస్తుందన్న అంచనాలతో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కూడా సూచీల ర్యాలీకి కారణమని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. జనవరిలో కార్ల విక్రయాలు స్థిరమైన వృద్ధిని నమోదు చేయడంతో ముున్ముందు ఆటోమొబైల్ రంగానికి డిమాండ్ ఉంటుందన్న అంచనాలతో ఆయా కంపెనీల షేర్లు రాణించాయి. ఇటీవల మార్కెట్ పతనాన్ని ఇన్వెస్టర్లు అవకాశంగా తీసుకుని కొనుగోళ్లకు దిగడం మరో కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# జిమ్నీ మేనియా బుకింగ్స్ నిలిపివేత

**జపాన్, ఫిబ్రవరి 4:** దేశీయ ప్రముఖ వాహన తయారీ సంస్థ మారుతి సుజుకి ఓ కీలక నిర్ణయం తీసుకుంది. తాజాగా జపాన్‌లో తీసుకొచ్చిన జిమ్నీ 5డోర్ వేరియంట్ బుకింగ్‌లను తాత్కాలికంగా నిలిపివేసింది. జపాన్‌లో మారుతీ జిమ్నీ బుకింగ్‌లను తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ బుకింగ్‌లు ఎప్పుడు తిరిగి ప్రారంభించేదీ వెల్లడించలేదు. జపాన్‌లో మారుతీ జిమ్నీ స్పీడ్ మాన్యువల్ వేరియంట్ ప్రారంభ ధర రూ.14.88 లక్షలు, ఏటీ వెర్షన్ ధర రూ.15.43 లక్షలుగా కంపెనీ నిర్ణయించింది. భారత్‌లో వీటి ధరలు రూ.12.74 లక్షలు, రూ.14.79 లక్షలుగా ఉన్నాయి. మహీంద్రా థార్ రాక్స్, ఫోర్స్ గుర్ఖా వంటి 5 డోర్ ఎస్‌యువిలకు జిమ్నీ పోటీ ఇస్తోంది. బుకింగ్‌లను జనవరి 30 నుంచి ప్రారంభించింది. ఏప్రిల్ 3 నుంచి డెలివరీలు అందిస్తామని కంపెనీ పేర్కొంది. ఈ ఎస్‌యువి అక్కడి ప్రజల నుంచి మంచి డిమాండ్‌ను సొంతం చేసుకుంది. బుకింగ్‌లు ప్రారంభించిన నాలుగు రోజుల్లోనే 50వేల బుకింగ్‌లు సొంతం చేసుకుంది. డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడం, వెయిటింగ్ పీరియడ్ పెరగడంతో



# డాక్టర్ అగర్వాల్ హెల్త్‌కేర్ డీలా

**ముంబై, ఫిబ్రవరి 4:** డాక్టర్అగర్వాల్స్ ఐ హాస్పిటల్ మాతృ సంస్థ డాక్టర్ అగర్వాల్ హెల్త్‌కేర్ షేర్లు మంగళవారం స్టాక్ మార్కెట్లో లిస్ట్ అయ్యాయి. డిస్కౌంట్‌తో దలాల్ స్ట్రీట్‌లో ఎంట్రీ ఇచ్చి ఇన్వెస్టర్ల నిరాశపర్చాయి. ఇష్యూ ధర రూ.402 తో పోలిస్తే బిఎస్ఇలో 1.27శాతం డిస్కౌంట్‌తో రూ.396 వద్ద ట్రేడింగ్ మొదలుపెట్టాయి. డాక్టర్ అగర్వాల్స్ హెల్త్‌కేర్ ఐపిఒ సబ్‌స్క్రిప్షన్ జనవరి 29న ప్రారంభమై 31న ముగిసింది. ధరల శ్రేణి రూ.382-402గా కంపెనీ నిర్ణయించింది. గరిష్ట ధర వద్ద కంపెనీ రూ.3,027.26 కోట్లు సమీకరించాలనుకుంది. ఐపిఒలో భాగంగా రూ.300 కోట్లు విలువైన తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.2,727.26 కోట్ల విలువైన షేర్లు జారీ చేసింది. రిటైల్ ఇన్వెస్టర్లు ఒక్క లాట్ కోసం రూ.14,070 వెచ్చించారు. ఈ పబ్లిక్ ఇష్యూ మొత్తం గా 1.55 రెట్ల సబ్‌స్క్రిప్షన్‌ను అందుకుంది. అయినప్పటికీ లిస్టింగ్‌లో మాత్రం రాణించలేక పోయింది. డిస్కౌంట్‌తో లిస్ట్ అయిన తర్వాత ఈ షేర్లు మరింత కుంగాయి. వాస్తవానికి 2010లో



స్థాపించబడిన డాక్టర్ అగర్వాల్స్ హెల్త్ కేర్ ప్రజలకు దేశవ్యాప్తంగా కంటి ఆరోగ్యానికి సంబంధించిన అనేక సేవలను అందిస్తోంది. ఇదే క్రమంలో సర్జికల్ అండ్ నాన్ సర్జికల్, కంటి ఆరోగ్యానికి సంబంధించిన మందులు, లెన్స్ వంటి వాటిని కూడా విక్రయిస్తోంది. తాజా ఐపిఒ నుంచి సమీకరించిన మొత్తాన్ని కంపెనీ రుణాల చెల్లింపులకు, సాధారణ కార్పొరేట్ ప్రయోజనాల కోసం ఉపయోగించాలని నిర్ణయించింది.

# వాణిజ్యం

## టాటా కంపెనీ కొనుగోలుకు ఆర్‌బిఐ గ్రీన్ సిగ్నల్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** టాటా గ్రూప్ ఆధ్వర్యంలో ఉన్న టాటా కమ్యూనికేషన్స్ పేమెంట్ సొల్యూషన్స్ లిమిటెడ్ (టిసిపిఎస్ఎల్)ను భారత్‌లోని ఆస్ట్రేలియాకు చెందిన ఫిన్‌టెక్ కంపెనీకి విక్రయించేందుకు రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆమోదం లభించింది. ఆస్ట్రేలియాకు చెందిన ఫైండీ ఆధ్వర్యంలోని భారతీయ అనుబంధ సంస్థ ట్రాన్సాక్షన్ సొల్యూషన్స్ ఇంటర్నేషనల్ (టిఎస్ఐ)కు టిసిపిఎస్ఎల్‌ను విక్రయించే ప్రణాళికలను ఆర్‌బిఐ ముందుంచారు. దాంతో తాజాగా వాటిపై ఆర్‌బిఐ నిర్ణయం తీసు కుంది. రూ.330 కోట్ల విలు వైన ఈ డీల్ వల్ల బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేని ప్రాంతాల్లో ఆర్థిక సేవలు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నవంబర్ 2024లో ప్రకటించిన ఈ కొనుగోలు టిసిపిఎస్ఎల్ వైట్ లేబుల్ ఎటిఎం ప్లాట్ ఫామ్, ఇండికాష్ ఎటిఎంల నెట్‌వర్క్‌ను ఉపయోగించుకోవడానికి ఫైండీకి వీలు కల్పిస్తుంది. టిఎస్ఐ ప్రస్తు తం 7,500కు పైగా బ్రౌన్ లేబుల్ ఎటిఎంలకు బ్యాక్ ఎండ్ కార్యకలాపాలు అందిస్తోంది. ఈ కొనుగోలుతో ఫైండీ 4,600 ఆపరేషనల్ ఇండికాష్ ఎటిఎంలను తీసుకుంటుంది. మరో 3వేల ఎటిఎం పొందేందుకు ఫైండీకి అవకాశం లభిస్తుంది. ఫైండీ సిఇఒ దీపక్ వర్మ మాట్లాడుతూ భారత్‌లో ఆర్థిక సేవలను విస్తరించేందుకు ఈ కొనుగోలు ఉపయోగపడుతుందన్నారు. ఈ ఎటిఎంలను కంపెనీ ప్రస్తుత నెట్‌వర్క్‌తో అనుసంధానించడంతో బ్యాంకింగ్ సేవలు లేని మారుమూల ప్రాంతాల్లో ఆర్థిక సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు.



# జోరందుకున్న తయారీ రంగం

**ముంబై, ఫిబ్రవరి 4:** భారత తయారీ రంగం జనవరి నెలకు పటిష్టమైన వృద్ధిని నమోదు చేసింది. హెచ్ఎస్‌బిఐ ఇండియా తయారీ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పిఎంఐ) గత డిసెంబరులో 56.4 శాతంగా ఉంటే, 2025 జనవరి నెలలో 57.7కు దూసుకెళ్లింది. ఎగుమతులు 14 యేళ్లలోనే బలమైన వృద్ధిని చూపించడం ఇందుకు మద్దతుగా నిలిచినట్టు ఈ సర్వే అభిప్రాయపడింది. 50 పాయింట్లకుపైగా తయారీ పిఎంఐ నమోదు అయితే దాన్ని విస్తరణగా, అంతకు దిగువకు పడిపోతే క్షీణతగా పరిగణిస్తుంటారు. 'భారత తయారీ పిఎంఐ ఆరు నెలల గరిష్ట స్థాయికి జనవరిలో చేసుకుంది. దేశీయ, ఎగుమతుల డిమాండ్ బలంగాఉంది. ఇది వృద్ధికి మద్దతు నిచ్చింది' అని హెచ్ఎస్‌బిసి ముఖ్య భారత ఆర్థిక వేత్త ప్రంజుల్ భండారీ తెలిపారు. తయారీ దారులకు కొత్త ఆర్డర్లలో వృద్ధి ఉన్నట్లు దీనికి అను గుణంగా తమ ఉత్పత్తిని పెంచుకుంటున్నట్లు పిఎంఐ సర్వే తెలిపిం ది. రానున్న కాలంలో 32శాతం సంస్థలు వృద్ధి పట్ల సానుకూల అంచనాలతో ఉంటే, కేవలం ఒకశాతం సంస్థలు క్షీణతను అంచనా వేస్తున్నట్లు వెల్లడించింది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14